fb/prajasakti, www.prajasakti.com

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 54 | విజయవాడ, శనివారం 24 ఫిబ్రవరి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

1న లోక్‌పాల్ ఎంపిక కమిటీ భేటీ

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: లోక్‌పాల్ సభ్యుల నియామక ప్రక్రియ కొనసాగుతున్నదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. మార్చి 1న ఎంపిక కమిటీ భేటీ కానున్నట్టు కేంద్రం తరపున అటార్నీ జనరల్ కెకె వేణుగోపాల్ సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ అంశంపై స్వచ్ఛంద సంస్థ కామన్‌కాజ్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ ఆర్ భానుమతితో కూడిన సుప్రీం ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. తదుపరి విచారణను మార్చి 6కు ధర్మాసనం వాయిదా వేసింది. మార్చి 5కు పురోగతికి సంబంధించిన నివేదికను అందచేయలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

ఎన్నికల షెడ్యూల్



నోటిఫికేషన్	:	మార్చి 5(సోమవారం)
నామినేషన్ల స్వీకరణ గడువు	:	మార్చి 12(సోమవారం)
నామినేషన్ల పరిశీలన	:	మార్చి 13(మంగళవారం)
నామినేషన్ల ఉపసంహరణ	:	మార్చి 15(గురువారం)
పోలింగ్	:	మార్చి 23(శుక్రవారం)
ఓట్ల లెక్కింపు	:	మార్చి 23(శుక్రవారం) సాయంత్రం 5 గంటలకు
పోలింగ్ సమయం	:	ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు

23న రాజ్యసభ ఎన్నికలు

- ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన ఈసి
- ఏపిలో మూడు, తెలంగాణలో మూడు స్థానాలు ఖాళీ
- దేశవ్యాప్తంగా 16 రాష్ట్రాల్లో 58 స్థానాలు ఖాళీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాజ్యసభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. కేంద్ర ఎన్నికల సంఘం ఈ మేరకు ప్రకటన జారీ చేసింది. మార్చి 5న ఈ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయనున్నట్టు వెల్లడించింది. మార్చి 23న ఎన్నికలు నిర్వహించనున్నట్టు పేర్కొంది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో మూడు, తెలంగాణలో మూడు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. 16 రాష్ట్రాలకు చెందిన 58 మంది రాజ్యసభ సభ్యుల పదవీ కాలం ఈ ఏడాది ఏప్రిల్,

మిగతా 9లో



రెండు నుంచి థియేటర్ల బంద్!

దక్షిణాది రాష్ట్రాల్లో అమలు

ప్రజాశక్తి - బెంగళూరు

దక్షిణాది రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్నాటక, కేరళలో మార్చి రెండో తేదీ నుంచి థియేటర్లలో సినిమాల ప్రదర్శన నిలిచిపోనుంది. పంపిణీదారులు- నిర్మాతలు, డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లకు మధ్య జరిగిన చర్చలు విఫలం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే చెన్నై, హైదరాబాద్‌లలో రెండేసి దఫాలు చర్చలు జరిపిన నాలుగు రాష్ట్రాల నిర్మాత మండళ్లు, క్యూబ్ యుఎఫ్ఓ సర్వీస్ ప్రొవైడర్లు శుక్రవారం బెంగళూరులో మరోసారి సమావేశమయ్యారు. అయినా ఇవి ఓ కొలిక్కి రాలేదు. దీంతో థియేటర్లకు సినిమాలు ఇవ్వకూడదన్న నిర్ణయానికి నిర్మాతలు

మిగతా 9లో

హెచ్-1బి వీసాలకు కొత్త పద్ధతి

ప్రకటించిన అమెరికా.. భారతీయ సంస్థలకు చిక్కులు?

వాషింగ్టన్: విదేశీయులకు అమెరికాలో ఉద్యోగాలకు అనుమతించే హెచ్-1బి వీసాల జారీలో ట్రంప్ ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రకటించింది. దీని ప్రకారం థర్డ్ పార్టీ వర్క్ సైట్స్‌లో నియమితులయ్యే ఒకరు లేదా ఎక్కువ మంది ఉద్యోగులకు వారి పని ఉన్నంత వరకూ మాత్రమే వీసా మంజూరు చేస్తారు. అత్యంత క్లిష్టమైన ఈ విధానంలో భారతీయ ఐటి కంపెనీలు, వారి ఉద్యోగులకు చిక్కులు తప్పకపోవచ్చని పరిశీలకులు భావిస్తున్నారు. ఈ కొత్త విధానంలో హెచ్-1బి వీసాకు దరఖాస్తు చేసుకునే ఉద్యోగి థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లో తన వృత్తికి సంబంధించని నైపుణ్యం కలిగిన పనులకు నియమితులైనట్లు సంబంధిత కంపెనీ నిరూపించాల్సి వుంటుంది. వాస్తవానికి ఇప్పటి వరకూ కొనసాగిన విధానం ప్రకారం హెచ్-1బి వీసాల ఆయా రంగాలలో అమెరికన్ నిపుణుల కొరత వున్నపుడు అత్యంత నిపుణులైన విదేశీయులకు మాత్రమే తాత్కాలిక వీసాలు జారీ చేస్తున్నారు. ఈ హెచ్-1బి వీసాల జారీలో ప్రధానంగా లబ్ధి పొందుతున్న భారత ఐటి కంపెనీలు థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లలో గణనీయమైన సంఖ్యలో తమ ఉద్యోగులను నియమించాయి. ఇందులో ప్రధానంగా అమెరికన్

మిగతా 9లో

ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే



గ్రీవెన్స్ సెల్‌లో ఇ - ప్రగతి శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్స్ అందజేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మార్చి నుండి అమలు
రెండు నెలల పాటు అధికారులకు శిక్షణ
ఇ - ప్రగతి గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. మార్చి నుండి ఈ విధానాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉండవల్లిలోని సిఎం నివాస ప్రాంగణంలోని గ్రీవెన్స్ సెల్‌లో ఇ - ప్రగతి శిక్షణ పూర్తి చేసుకున్న అధికారులకు సర్టిఫికెట్స్ ప్రదాన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కింది స్థాయి నుంచి అత్యున్నత స్థాయి ఉద్యోగిగా ఎదిగే వరకు శిక్షణ ఇచ్చేలా ఏప్రిల్ నాటికి ఇ - ప్రగతి అకాడమీని ఏర్పాటు చేయాలని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్

మిగతా 9లో

ఎన్నికల బడ్జెట్

- గత పథకాలకు మళ్లీ వెలుగు
- విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పెంపు
- అంతర్జాతీయ యువ భేరీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

వచ్చేది ఎన్నికల బడ్జెట్టే.. ఓట్లకు గేలం వేసే దృష్టి కోణంలోనే అందుకు వరుస భేటీల కసరత్తు..! ఎన్నికలకు ముందు ఇదే చివరి పూర్తి స్థాయి బడ్జెట్ కావడంతో ఏదో రకంగా ప్రజలను ఆకట్టుకోవడమే లక్ష్యంగా 2018 -19 సంవత్సరపు బడ్జెట్ రూపకల్పన జరుగుతోంది.. ప్రధానంగా బిసిలు, మహిళలు, యువత, విద్యార్థులను ఆకట్టుకునేలా రాష్ట్ర వార్షిక కొత్త బడ్జెట్ తయారవుతున్నట్లు తెలుస్తోంది. గతం లో కన్నా ఈసారి ఎన్నికలు టిడిపి అధినేత చంద్రబాబుకు కఠినంగా కనిపిస్తున్నందున ఓట్ల కోసం ఇప్పుడున్న లోటు పాట్లను కొత్త బడ్జెట్ ద్వారా తీర్చే యత్నం చేస్తున్నారనే అభిప్రాయం అధికారవర్గాల్లో వ్యక్తమవుతోంది. చంద్రబాబు ముఖ్యమంత్రిగా గతంలో అమలు చేసిన ఆదరణ పథకం ఆ తరువాత కాంగ్రెస్ హయాంలో నిలిచిపోయింది. ఈ పథకాన్ని మళ్లీ తెరపైకి తీసుకురా నున్నారు. వెనుక బడిన కులాల్లోని చేతి వృత్తిదారులకు అవసరమైన వృత్తి పరికరాలు అందించే ఈ పథకానికి వచ్చే బడ్జెట్‌లో భారీగా నిధులు కేటాయించాలని నిర్ణయించారు. ఎన్టీఆర్ హయాంలో జనతా వస్త్రాలు పేరిట ఉచితంగా పంపిణీ చేసిన చీరలు, ధోతులను మళ్లీ అమలు చేయాలని యోచిస్తున్నారు. బడ్జెట్ కూర్పు సమావేశాల్లో దీనిపై నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం పేదలకు అదే సమయంలో చేనేత వృత్తిదారులకు ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు ఇస్తున్న ఉపకార వేతనాన్ని మరింతగా పెంచాలని యోచిస్తున్నారు. దాదాపుగా

మిగతా 9లో

సంక్షేమానికి పెద్దపీట : యనమల



కొత్త బడ్జెట్‌లో సంక్షేమానికి పెద్దపీట వేయనున్నట్లు ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. ఆయన బడ్జెట్ కూర్పుపై శుక్రవారం తన నివాసంలో ఉన్నతాధికారులతో చర్చించారు. ఇప్పటివరకు వివిధ సందర్భాల్లో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను కూడా బడ్జెట్‌లో పొందుపరచాలని అధికారులకు సూచించారు. విద్య, వైద్య రంగాలకు కూడా అవసరమైన ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. పేద, మధ్య తరగతి రంగాలకు మేలు చేసేలా బడ్జెట్ ఉండాలని, ఆ దిశగా ఆలోచన చేయాలని నిర్దేశించారు. రాష్ట్ర ఆదాయం వృద్ధి జాతీయ వృద్ధి కన్నా తక్కువగా ఉందని, ఆదాయాన్ని మరింతగా పెంచుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షల కోసం యాప్

అభ్యర్థులు 10.26 లక్షలకు పైగానే
హాల్ టికెట్లు ఆపితే చర్యలు : గంటా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/మద్దిలపాలెం(విశాఖ)

ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు ఇంటర్మీడియేట్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్మీడియేట్ విద్యా విభాగం ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ పరీక్షల నిర్వహణపై మానవ వనరుల అభివృద్ధి శాఖమంత్రి గంటా శ్రీనివాసరావు విశాఖపట్నంలోని ఎయి కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఆయన విశాఖలోను, ఇంటర్మీడియేట్ విద్యా బోర్డు కార్యదర్శి బి ఉదయలక్ష్మి వెలగపూడిలోని సచివాలయంలోను శుక్రవారం విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 10,26,891 మంది ఈ పరీక్షలు రాయనుండగా, వారిలో ప్రథమ సంవత్సరానికి 5,09,898 మంది, ద్వితీయ సంవత్సరానికి 5,16,993 మంది హాజరుకానున్నారు. మొత్తంగా రాష్ట్ర వ్యాప్తంగా 1,423 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 116 సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, ఆయా



ఎయి కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి గంటా

సెంటర్లలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలుంటాయి. విద్యార్థులు అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాల్సి ఉంటుంది. ఉదయం 9 గంటల తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని

మిగతా 9లో

15న జాతీయ స్థాయిలో నిరసన దినం

కేంద్ర కార్మిక సంఘాల నిర్ణయం

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, న్యూఢిల్లీ:

ప్రజలపై ఆర్థిక భారాలు మోపుతూ వారి జీవితాలపై నిర్విరామంగా కేంద్రం కొనసాగిస్తున్న దాడులను కేంద్ర కార్మిక సంఘాలు తీవ్రంగా ఖండించాయి. కేంద్రం అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక వైఖరిని నిరసిస్తూ మార్చి 15న జాతీయ స్థాయిలో నిరసన దినాన్ని పాటించాలని ఇక్కడి ఐఎన్‌టియుసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల భేటీలో నిర్ణయించారు. పదేపదే ఆర్థిక భారాలు మోపుతూ ప్రజల జీవితాలపై దాడులు కొనసాగిస్తున్న కేంద్రం దేశ ప్రయోజనాలనుసైతం దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని కార్మిక సంఘాల నేతలు ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రధానంగా కార్మిక చట్టాలను నిర్వీర్యం చేస్తూ ఉద్యోగులు, కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా చేస్తున్నారని కార్మిక సంఘాలు ఆందోలన వ్యక్తం చేశాయి. శాశ్వత నియామకాలకు స్వస్తి చెప్పి కాంట్రాక్ట్ కార్మిక చట్టాన్ని సవరించటం ద్వారా నిర్ణీత కాలానికి మాత్రమే ఉద్యోగ నియామకాలను చేపడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై భరోసా కోల్పోయే విధంగా కేంద్రం వ్యవహరిస్తోందని కార్మిక సంఘాలు విమర్శించాయి. దేశ పారిశ్రామిక చిత్రపటం నుండి ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా తుడిచిపెట్టేందుకే కేంద్రం కంకణం కట్టుకున్నదని, ఇటీవలి కాలంలో కేంద్రం తీసుకుంటున్న చర్యలు ఈ విషయాన్ని రుజువు చేస్తున్నాయని ఈ ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా రైల్వేల ప్రైవేటీకరణ, మైనింగ్ ప్రైవేటు ఇలా మూకుమ్మడి ప్రైవేటీకరణతో దేశ సార్వభౌమత్వాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వం రక్షణఉత్పత్తుల రంగంలో విదేశీ, ప్రైవేటు సంస్థలకు ప్రవేశం

మిగతా 9లో

వర్మపై పోలీసుల విచారణ వాయిదా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జిఎస్టీ వెబ్ సీరీస్ కేసులో ప్రముఖ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మపై పోలీసు విచారణ వాయిదా పడింది. ఈకేసులో గత శనివారం ఆయన్ని విచారించిన సిసిఎస్ పోలీసులు తదుపరి విచారణకు శుక్రవారం హాజరుకావాలని నోటీసులిచ్చారు. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న వర్మ ల్యాప్‌టాప్ విశ్లేషణ నివేదిక అందనందున విచారణ వాయిదా వేసినట్లు వర్మకు పోలీసులు సమాచారం అందించారు. తిరిగి ఎప్పుడు విచారణకు హాజరయ్యేది పోలీసులు వెల్లడించలేదు.



ఉగ్రవాదం, వాణిజ్యం

మోడీ, ట్రూడో చర్చల్లో ప్రధానాంశాలు

న్యూఢిల్లీ: ప్రస్తుతం మన దేశంలో పర్యటిస్తున్న కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో శుక్రవారం నాడు ఇక్కడ ప్రధాని నరేంద్రమోడీతో భేటీ అయి ఉగ్రవాదం, తీవ్రవాదం వంటి వాటి నిరోధానికి తీసుకోవాల్సిన చర్యలు, వాణిజ్య సంబంధాల మెరుగుదల వంటి అంశాలపై చర్చలు జరిపారు. అనంతరం ఇరుదేశాల మధ్య ఇంధన సహకారంతో సహా వివిధ రంగాలకు సంబంధించి ఆరు ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. దాదాపు రెండు గంటలసేపు భేటీ అయిన ఇరువురు నేతలు అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకెళ్లే అంశంపై తాము చర్చించినట్లు చెప్పారు. ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు ప్రాధాన్యతను తాము గుర్తించామని, ఈ పోరులో రాజకీయ లక్ష్యాల కోసం మతాన్ని దుర్వినియోగం చేసే వారికి స్థానం లేదని మోడీ చెప్పారు. భారత సార్వభౌమత్వాన్ని, ఐక్యతను సవాలు చేసేవారిని తాము ఎంతమాత్రమూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టం చేశారు. ఖలిస్తాన్ విషయంలో ట్రూడో సర్కారు మెతక వైఖరి అనుసరిస్తోందన్న విమర్శలు వెలువడతున్న నేపథ్యంలో మోడీ ఈ వ్యాఖ్యలు చేయటం గమనార్హం. కెనడా ప్రధాని గత కొద్ది రోజులుగా దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించిన విషయాన్ని ప్రస్తావించిన మోడీ మన దేశంలో కొనసాగుతున్న భిన్నత్వంలో ఏకత్వాన్ని ట్రూడో ఆస్వాదించి వుంటారని భావిస్తున్నానన్నారు. కెనడా ప్రధాని ట్రూడో మాట్లాడుతూ వాణిజ్య సహకారంలో భారత్

మిగతా 9లో

టెట్‌కు 96.60శాతం హాజరు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) మూడో రోజు ప్రశాంతం జరిగింది. శుక్రవారం నిర్వహించిన పేపర్-1(తెలుగు)కు 49,179 మంది దరఖాస్తు చేసుకోగా, 47,508 మంది పరీక్ష రాశారని టెట్ కన్వీనర్ ఎ సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం నిర్వహించిన పేపర్-1(తెలుగు)కు 25,371 మంది అభ్యర్థులకు కేటాయించిగా, 24,451(96.37) మంది హాజరయ్యారు. మధ్యాహ్నం పరీక్షకు 23,808 మందిని కేటాయించగా 23,057 (96.85) శాతం పరీక్ష రాశారు. మొత్తం 49,179 మంది అభ్యర్థులకు 47,508 మంది హాజరయ్యారు. రాష్ట్రస్థాయి పరిశీలకులు, జిల్లా విద్యాశాఖ అధికారులు, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ పరీక్షా కేంద్రాలను సందర్శించారని కన్వీనర్ వెల్లడించారు.

పోస్టర్ ఆవిష్కరణ



ఏప్రిల్ 20న రాజమండ్రిలో జరిగే ప్రత్యేక హోదా ఆత్మగౌరవ పోరాట సభ పోస్టర్‌ను విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆవిష్కరించిన సిపిఐ కార్యదర్శి రామకృష్ణ

సీమకు బిజెపి చేసిందేమిటి?

హోదా కోసం 6 నుంచి ఢిల్లీలో ఆందోళనలు : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ఏం చేసిందో చెప్పాలని ఎపి ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ప్రశ్నించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏప్రిల్ 20వ తేదీన రాజమండ్రిలో నిర్వహించే ప్రత్యేక హోదా ఆత్మగౌరవ పోరాట సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధికి బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ ఇస్తామని ప్రకటించిన కేంద్రం ఒక్కో జిల్లాకు రూ. 50 కోట్లు ముష్టి వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేక హోదా, విభజన హామీలపై రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రమవుతుంటే రాయలసీమ డిక్లరేషన్ పేరుతో కర్నూలులో బిజెపి నేతలు హడావుడి చేయడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చర్చావేదికల్లో ప్రత్యేక తరగతి హోదా, విభజన చట్టంలోని హామీల అమలు, నిధులపై ఎవరైనా ప్రశ్నిస్తే బిజెపి నాయకులు భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.మార్చి 6 నుంచి ఢిల్లీలో నిర్వహించే ఆందోళన ద్వారా ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళతామన్నారు. కేంద్రం దిగివచ్చే వరకూ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రీయ సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్,ప్రజా కాంగ్రెస్ సెక్యులర్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మేడా శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత మస్తాన్‌వలి, ప్రత్యేక హోదా ఆత్మగౌరవ పోరాట కమిటీ చైర్మన్ పి సురేందర్‌రెడ్డి, కన్వీనర్ అవధానుల హరి, ఏపీజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణాంజనేయులు, ఆప్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి డి సేవాకుమార్ తదితరులు పాల్గొన్నారు.



పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి - విశాఖపట్నం ప్రతినిధి

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు పెరగనున్నాయని విశాఖపట్నం వాతావరణ శాఖ తెలిపింది. రాత్రిపూట కాస్త చల్లదనం ఉన్నా పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరగనున్నట్లు పేర్కొంది. సాధారణం కంటే కళింగపట్నం 4, విశాఖ 3, తుని 2 డిగ్రీల ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదయ్యాయని తెలిపింది. కాకినాడ, కావలి, నర్సాపురం, తుని, విజయవాడ 21, బాపట్ల 19, జంగమేశ్వరపురం 19, విశాఖ 18 డిగ్రీలు నమోదయ్యాయి.

ఉధృతంగా 'విద్యుత్' సమ్మె

- రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల ప్రదర్శనలు
- పలుచోట్ల సంఘీభావ సభలు

ప్రజాశక్తి-యంత్రాంగం

రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని, పీస్‌రేటు పద్ధతిని రద్దు చేసి సంస్థ నుంచే జీతాలివ్వాలని తదితర డిమాండ్లపై విద్యుత్ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా సాగుతోంది. నాలుగవరోజైన శుక్రవారం వినూత్న రీతిలో కార్మికులు ఆందోళనలు నిర్వహించారు. విద్యుత్ కార్మికులకు సంఘీభావంగా పలుప్రాంతాల్లో సభలు జరిగాయి. గుంటూరులో సమ్మె శిబిరాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు సందర్శించి, మద్దతు తెలిపారు. బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానం అమలు కోసం కార్మికులు మూడేళ్లుగా అనేక రూపాల్లో పోరాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రతి ఉద్యోగానికీ అవుట్‌సోర్సింగ్ విధానం అమలు చేసే చంద్రబాబు సిఎం సీటునీ అవుట్‌సోర్సింగ్ చేస్తారా? అని నిలదీశారు. అవసరమైతే కార్మికుల ఆందోళనలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు ప్రత్యక్షంగా పాల్గొంటామని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉమ్మడి అసెంబ్లీలో కాంట్రాక్ట్ కార్మిక చట్టాన్ని తెచ్చిన ప్రభుత్వానికి చట్టసవరణ పెద్ద పనేం కాదన్నారు. విద్యుత్ కార్మికుల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశి మాట్లాడుతూ రాష్ట్రంలోని 24 వేల మందిలో 95 శాతం కార్మికులు సమ్మెలో ఉన్నారని, రానున్న రోజుల్లో సమ్మెను మరింత ఉధృతం చేస్తామని చెప్పారు. సమ్మె శిబిరాన్ని వైసిపి నగర అధ్యక్షులు లేళ్ల అప్పిరెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షులు మస్తాన్‌వలి సందర్శించి మద్దతు తెలిపారు. మంగళగిరిలో సిఐటియు ఆధ్వర్యాన మానవహారం నిర్వహించారు. సత్తెనపల్లిలో కార్మికులు ధర్నా చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం ఇచ్చారు. విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద చేపట్టిన సమ్మె శిబిరం వద్దకు సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓబులేశుహాజరై, సంఘీభావం తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని ఎన్‌టిటిపిఎస్ వద్ద చేపట్టిన సమ్మెలో సిపిఎం పశ్చిమ కృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ, ఐద్వా రాష్ట్ర నాయకులు స్వరూపరాణి పాల్గొని మాట్లాడారు. వన్‌టౌన్‌లోని నెహ్రూబొమ్మ సెంటర్‌లో సిఐటియు పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. కృష్ణాజిల్లా గుడివాడ నెహ్రు చౌక్‌లో సిఐటియు విద్యుత్ కార్మికుల సమ్మెకు మద్దతుగా ధర్నా చేసింది. కార్మికులకు మద్దతుగా శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద సిపిఎం నాయకులు ధర్నా చేశారు. విజయనగరంలో కోట జంక్షన్ నుంచి బాలాజి జంక్షన్ వరకూ ప్రదర్శన చేశారు. మానవ హారం నిర్వహించి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.కాంట్రాక్టు ఉద్యోగులు విశాఖ నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మీటర్ రీడర్ మీటర్లను చేతిలో పట్టుకుని ర్యాలీలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సిఐటియు నగర అధ్యక్షులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, ప్రధాన కార్యదర్శి ఎం.జగ్గునా యుడు పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు కలెక్టరేట్ వద్ద జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వందలాదిమంది కార్మికులు మహాధర్నా చేశారు. కలెక్టరేట్ నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వరకూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించి, మానవహారం చేశారు. నరసాపురం, భీమవరం ప్రాంతాల నుంచి 150 మోటారు సైకిళ్లపై కార్మికులు ర్యాలీగా ఏలూరు చేరుకున్నారు. నిడదవోలులో సబ్ స్టేషన్ నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సిపిఎం జిల్లా (కాకినాడ) కమిటీ కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు సబ్‌స్టేషన్ వద్ద నిర్వహిస్తున్న సమ్మె శిబిరాన్ని సిపిఎం జిల్లా (రాజమహేంద్రవరం) కమిటీ కార్యదర్శి టి.అరుణ్ సందర్శించి మద్దతు తెలిపారు. కాకినాడలో కలెక్టరేట్ వద్ద చీపుర్లతో ఊడ్చి, బొమ్మూరులో సబ్‌స్టేషన్ వద్ద అర్ధనగ్న ప్రద ర్శన చేసి నిరసన తెలిపారు. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాలో సమ్మె నాల్గవరోజుకు చేరింది. కర్నూలు జిల్లా కేంద్రంలోని ట్రాన్స్‌కో కార్యాలయం నుంచి కొత్తబస్టాండ్ వరకూ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. నంద్యాలలో కార్మికులకు సిపిఎం జిల్లా తూర్పు ప్రాంత కార్యదర్శి టి.రమేష్ కుమార్ సంఘీభావం తెలిపారు. అనంతపురం ఎస్ఇ కార్యాలయం ఎదుట దీక్షలకు మద్దతుగా సిపిఎం ఆధ్వర్యాన నగరంలో ర్యాలీ నిర్వహించారు. సిపిఎం ఉత్తర ప్రాంత జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ అనంత వెంకట్రామిరెడ్డి, సిపిఐ నాయకులు నరసింహులు, జన సేన నాయకులు నాగేంద్ర మద్దతు తెలిపారు.



పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో విద్యుత్ కార్మికుల భారీ ర్యాలీ

ప్రజ్ఞ

1. కేంద్రం ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన ఎన్నికల బాండ్లను ఎప్పటి నుంచి విక్రయించనున్నారు?
2. 44వ విడత ఖజురహో నృత్యోత్సవం నిర్వహించనున్న ఖజురహో ఆలయం ఎక్కడుంది?
3. వెనిజులా ప్రభుత్వం తీసుకురానున్న క్రిప్టోకరెన్సీ పేరు ఏంటి?
4. ఉపరితలం నుంచి ఉపరితలంపైకి ప్రయోగించే పృథ్వీ-2 క్షిపణిని ఇటీవల విజయవంతంగా పరీక్షించారు. ఈ పరీక్ష ప్రత్యేకత ఏంటి?
5. ఇటీవల గీత తుఫానుతో అతలాకుతలమైన టాంగా పునరావసం కోసం భారత్ ప్రకటించిన ఆర్థిక సాయమెంత?

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి దినపత్రిక, ఎంబి విజ్ఞానకేంద్రం, డోర్.నెం.27-30-4, గవర్నరుపేట, విజయవాడ-520002కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

హైకోర్టు, రెండో రాజధాని

- రూ.10 వేల కోట్లతో సీమ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలి

రాయలసీమపై బిజెపి డిక్లరేషన్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

హైకోర్టు, రెండో రాజధానిని రాయలసీమకు ఇవ్వాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలో ఆ పార్టీ రాయలసీమ ముఖ్య నేతల సమావేశం జరిగింది. రాయలసీమ జిల్లాల నాయకులు హాజరయ్యారు. రాయలసీమ వెనుకబాటుతనం, సమస్యలపై చర్చించి డిక్లరేషన్ రూపొందించారు. ఈ డిక్లరేషన్‌ను బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కపిలేశ్వరయ్య ఆవిష్కరించారు. కర్ణాటక, మహారాష్ట్ర తరహాలో ఆరు నెలలకోసారి అసెంబ్లీ సమావేశాలు జరిగేలా రెండో రాజధానిని రాయలసీమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైకోర్టు బెంచ్ కాకుండా పూర్తిస్థాయి హైకోర్టు సీమకు ఇవ్వాలని పేర్కొన్నారు. మూడు న్నరేళ్లుగా టిడిపి ప్రభుత్వం రాయలసీమకు ఎంత ఖర్చు పెట్టిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పరిపాలనకు అనుగుణంగా నాలుగు జిల్లాలను ఎనిమిదిగా విభజించాలని కోరారు. హైదరాబాద్ తరహాలో కాకుండా అభివృద్ధిని వికేంద్రీకరించాలని డిక్లరేషన్‌లో పొందుపరిచారు. రాయలసీమ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు 2018-19 బడ్జెట్‌లో రూ.20 వేల కోట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. గాలేరు నగరి, హంద్రీనీవా, గురు రాఘవేంద్ర ప్రాజెక్టులను 2018-19లోపు పూర్తి చేయాలని తెలిపారు. గుండ్రేవుల, ఆర్‌డిఎస్ కుడి కాల్వలను యుద్ధప్రాతిపదికన చేపట్టాల న్నారు. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో రూ.వందల కోట్ల అవినీతి జరిగిందని, సమగ్ర విచారణ చేసేందుకు రిటైర్డ్ జడ్జితో కమిటీ వేయాలని డిమాండ్ చేశారు. రూ.10 వేల కోట్లతో రాయలసీమ అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. 2018-19 బడ్జెట్‌లో రాయలసీమకు ఎంత కేటాయిస్తారో ముందే చెప్పాలని డిమాండ్ చేశారు. టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో 600 అంశాలుంటే 200 అంశాలు రాయలసీమవేనని, వీటిని పూర్తిగా విస్మరించారని విమర్శించారు. బడ్జెట్ సమావేశాల్లోపు వీటిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతిని చెల్లించి, ఇంటికో ఉద్యోగం హామీని అమలు చేయాలన్నారు. మూతపడిన పరిశ్రమలను తెరిపించి, కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలని కోరారు. రాయలసీమలో చేనేత, ఇతర చేతివృత్తుల వారి కోసం రూ.5 వేల కోట్లతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు శాంతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షులు హేమలత, నాయకులు కందుల రాజామోహన్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, ఉమా, శ్రీనాథ్‌రెడ్డి, చంద్రారెడ్డి, కర్నూలు జిల్లా అధ్యక్షులు హరీష్‌బాబు పాల్గొన్నారు.

బిజెపి కొత్త రాజకీయ ఎత్తుగడ

ప్రత్యేక హోదా పక్కదారిపట్టించే యత్నం

ప్రజాశక్తి కర్నూలు ప్రతినిధి

'మాది పోతే వెంట్రుక... వాళ్లకు మొత్తం గుండే ..' ఇది టిడిపి, బిజెపిల మైత్రిపై మంత్రి మాణిక్యాలరావు చేసిన వ్యాఖ్య. ఈ వ్యాఖ్యను అమలు చేసేందుకు రాష్ట్ర బిజెపి నాయకత్వం సమాయత్తమవుతున్నట్లు కనిపిస్తోంది. విభజన చట్టాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందంటూ ప్రజల్లో ఇటీవల నెలకొన్న తీవ్ర అసంతృప్తిని పక్కదారి పట్టించేందుకు బిజెపి ఎదురు దాడికి దిగింది. రాయలసీమ సమస్యలపై కర్నూలు డిక్లరేషన్ పేరుతో 16 అంశాలతో తెలుగు దేశం ప్రభుత్వానికి సవాలు విసిరింది. రాయల సీమలోని ప్రాజెక్టుల్లో పెద్ద ఎత్తున అవినీతి జరుగు తుందని, ఈ అవినీతిపై రిటైర్డ్ న్యాయమూర్తితో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తోంది. టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలోని 600 అంశాల్లో 200 అంశాలు రాయలసీమ సమస్యలే వున్నా యని ఇందులో 90శాతం విస్మరణకు గురయ్యాయని బిజెపి నేతలు కర్నూలు డిక్లరేషన్‌లో ప్రకటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో విభజన చట్టంలో చెప్పిన అంశాలను కేంద్రం పక్కన పెట్టిందికదా కడప ఉక్కు పరిశ్రమ ఏమైందని అలాగే ప్రస్తుతం కేబినెట్‌లో మీ మంత్రులిద్దరు వున్నారు కదా ఏమిచేస్తున్నారని అడిగిన ప్రశ్నలకు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. మా మంత్రులు కూడా డిక్లరేషన్ ను అమోదిం చాల్సిందేనంటూ సమావేశాన్ని ముగించారు. 2014 ఎన్నికల ప్రచారంలో ఎపికి మోడీ చేసిన వాగ్ధానాలు, విభజన చట్టంలో వుండే అంశాలు ఇప్పటిదాకా కార్యాచరణ నెరవేర్చకపోవడం వల్లే ప్రజల్లో ఆసంతృప్తి నెలకొందని బిజెపి ముఖ్య నాయకుడు ఒకరు తమ పేరు రాయద్దంటూ అంగీకరించడం విశేషం. కడప ఉక్కు పరిశ్రమపై కేంద్రప్రభుత్వం నాన్చుడు ధోరణి వ్యవహరించడం తమకు ఈ ప్రాంతంలో తలెత్తుకోలేని సమస్యగా వుందని అభిప్రాయపడ్డారు. మొత్తంగా ప్రజల్లో ఇటీవల కాలంలో నెలకొన్న ఆసంతృప్తిని, ఆగ్రహాన్ని దారిమళ్లించేలా బిజెపి రాయలసీమ సమస్యల అజెండాతో డిక్లరేషన్‌ను ప్రకటించిందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

హెల్త్ వర్సిటీ ఉద్యోగుల సమ్మె విరమణ

మంత్రి కామినేనితో చర్చలు సఫలం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం నిధులను మళ్లించొద్దని గత నాలుగు రోజులుగా ఆందోళన చేస్తున్న ఉద్యోగులు మంత్రి కామినేనితో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. దీంతో ఉద్యోగులు సమ్మె విరమిస్తున్నట్లు తెలిపారు. ఎపిఎన్జీవో సంఘం నాయకులు అశోక్ బాబు, విద్యాసాగర్ ఆధ్వర్యంలో వర్సిటీ ఉద్యోగులు మంత్రి కామినేనితో శుక్రవారం సచివాలయంలో చర్చించారు. ఉద్యోగుల డిమాండ్లపై కామినేని సానుకూలంగా స్పందించారు. వర్సిటీ నిధులను భవిష్యత్తులో మళ్ళించేందుకు వీలులేకుండా ఉత్తర్వులు విడుదల చేయాలని మంత్రి వైద్యశాఖ ముఖ్యకార్యదర్శిని ఆదేశించారు. సిఆర్‌డిఎ పరిధిలో యూనివర్శిటీ కోసం వారు గతంలోనే డిపిఆర్‌లో ప్రతిపాదించిన 133 ఎకరాల భూమిని ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని కామినేని ఉద్యోగులకు హామీ ఇచ్చారు. ఈ ఏడాది బడ్జెట్‌లో యూనివర్శిటీ గ్రాంటు రూ 20 కోట్లకు పెంచుతూ ప్రతిపాదించినట్లు ఉద్యోగులకు తెలిపారు. వర్శిటీ తాత్కాలిక ఉద్యోగులకు 2015 రివైజ్ పే స్కేల్ (ఆర్‌పిఎస్) ప్రకారం జీతాలు చెల్లించే ఫైలుపై కామినేని సంతకం చేశారు. ఎన్జీవోల యకులు ఇక్బాల్, జగదీశ్, యూనివర్శిటీ వనరుల పరిరక్షణ సమితి కో చైర్మన్ ఎమ్‌వి. అక్కిరాజు, వర్శిటీ ఉద్యోగులు చర్చల్లో పాల్గొన్నారు.

వైద్య వ్యవస్థకు ప్రపంచ బ్యాంకు రుణం

ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రపంచ బ్యాంకు సహకారం పొందేందుకు అనుమతులిస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి పూనం మాలకొండయ్య శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు మొత్తం రూ 3172.3 కోట్లతో వైద్య సేవలను మెరుగుపరచాలని ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంట్లో ప్రపంచ బ్యాంకు వాటా 70 శాతం (రూ 2184.11 కోట్లు) కాగా మిగిలిన మొత్తం రూ 938.19 కోట్లు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద వెచ్చిస్తుందని పేర్కొన్నారు. ప్రతిపాదించిన ప్రాజెక్టు కార్యరూపం దాల్చేందుకు సుమారు ఐదేళ్లు పడుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులో ప్రధానంగా ప్రాథమిక ఆరోగ్య వ్యవస్థను నాలుగు విధాలుగా బలోపేతం చేస్తామని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రాలను ' ఇ - ప్రాథమిక సంరక్షణ ' (ఇ - ప్రైమరీ కేర్) కేంద్రాలుగా మార్చేందుకు ప్రతిపాదించారు. రాష్ట్రవ్యాప్తంగా ఏఎన్‌ఎమ్‌లు ఉన్న ఆరు వేల ఆరోగ్య ఉప కేంద్రాలను ఈ దిశగా తీర్చిదిద్దుతామని తెలిపారు. జిల్లా కేంద్ర, ఏరియా, బోధనాస్పత్రులలో మౌలిక వసతులను మెరుగుపరచి ఎన్ఎబిహెచ్ అక్రిడిటేషన్ పొందేలా రూపొందిస్తామని తెలిపారు. మాతాశిశు ఆరోగ్య సూచి, వ్యాధి నిర్ధారణ, పరిశోధనకు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యతనిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అన్ని బోధనాస్పత్రుల్లో ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు నిర్వహించడం ద్వారా రోగికి సంబంధించిన పూర్తి వివరాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

ప్రత్యేకం

కృష్ణా తండాల్లో కిడ్నీ వ్యాధుల ముప్పు

- వందలాది మంది బాధితులు
- బోరు నీటిలో ఫ్లోరైడ్ అధికం
- ఆర్‌వో ప్లాంట్లు నిరుపయోగం
- ఫ్లోరోసిస్‌తో కీళ్లు, ఒంటి నొప్పులు



కిడ్నీ వ్యాధుల బారిన పడిన దీప్లానగర్‌తండాకు చెందిన గిరిజనులు

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్ ప్రతినిధి

అక్కడ నీరే నిప్పుగా మారి ప్రజల ప్రాణాలు తీస్తోంది. ఏళ్ల తరబడి ఉన్న ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. గత్యంతరం లేక ఫ్లోరిన్ నీటిని వినియోగిస్తున్న కృష్ణాజిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని పలు గ్రామాలు, తండాల వాసులు ఫ్లోరోసిస్, కిడ్నీ వ్యాధులకు గురవుతున్నారు. ఈ వ్యాధి బారినపడి ఇప్పటికే పలువురు మృత్యువాత పడ్డారు.

కిడ్నీ వ్యాధులకు గురైన కొందరు నిరుపేద గిరిజనులు వైద్య సేవలు అందుకునేందుకు కూడా డబ్బుల్లేక జీవచ్ఛవాలుగా జీవనం సాగిస్తున్నారు.

నీటిలో అధిక శాతం ఫ్లోరైడ్‌తో ఎదుగుదల లోపాలు

ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో 20కి పైగా తండాల్లో బోరు నీటిలో 1.5 శాతం ఉండాల్సిన ఫ్లోరిన్ 2.5 శాతం వరకూ ఉంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంచినీటి పథకాలు, ఏర్పాటు చేసిన బోర్లు, ఆర్‌వో ప్లాంట్లలో సైతం ఫ్లోరిన్ అధికశాతంలోనే ఉంది. నీటిని తాగొద్దని బోర్ల వద్ద హెచ్చరికగా రెడ్ మార్కు వేసిన అధికారులు ప్రత్యామ్నాయం మాత్రం చూపని పరిస్థితుల్లో ఆ నీటినే తాగాల్సివస్తోంది. ఫ్లోరైడ్ ప్రాంతల్లో జీవించే ప్రజల పళ్ల రంగు మారి ఫ్లోరోసిస్ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. పిల్లల్లో ఎదుగుదల లోపిస్తోంది. ప్రతి ఒక్కరూ కీళ్ల, ఒంటి నొప్పులతో బాధపడటం సహజంగా మారింది.

వందలాది మందికి కిడ్నీ వ్యాధులు 25 మంది వరకు మృత్యువాత !

ఎ.కొండూరు మండలం దీప్లానగర్, మాన్‌సింగ్‌నగర్, మత్రియా తండాలు, రామచంద్రాపురం పంచాయతీ శివారు లక్ష్మీపురం గ్రామాల్లో సిపిఎం బృందం ఇటీవల పర్యటించింది. ఈ సందర్భంలో కిడ్నీ వ్యాధులతో 25 మంది వరకూ మృతి చెందినట్లు ఆయా గ్రామాల ప్రజలు సిపిఎం బృందం దృష్టికి తీసుకువచ్చారు. వందలాది మంది కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న పరిస్థితిని బృందం ప్రత్యక్షంగా పరిశీలించింది. పేదరికంలో ఉండటంతో వేలాది రూపాయలు ఖర్చు చేయలేక మధ్యలోనే మందులు మానివేయడంతో మృతుల సంఖ్య పెరిగిపోతోంది. ఈ క్రమంలో సమీపంలోని ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసి, ప్రభుత్వం ఉచితంగా మందులు ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. రక్తంలో శీరం క్రియాటిన్ సాధారణ స్థాయిలో 1.4 ఉండాలి. ఈ నేపథ్యంలో జనవిజ్ఞాన వేదిక, ప్రజారోగ్యవేదిక, పర్యావరణ పరిరక్షణ వేదిక ఆధ్వర్యాన జనవరి 26న దీప్లానగర్, మాన్‌సింగ్ నగర్ తండాల్లో 51 మందికి రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో 27 మందికి క్రియాటిన్ అధికంగా ఉందని గుర్తించారు.

సంక్షిప్తం

27, 28 తేదీల్లో అంచనాల కమిటీ పోలవరం పరిశీలన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

శాసనసభ అంచనాల కమిటీ ఈ నెల 27, 28 తేదీల్లో పోలవరాన్ని సందర్శించాలని నిర్ణయించింది. ఈ మేరకు అక్కడి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని శాసనసభ సచివాలయం ఆదేశాలు చేసింది. కమిటీ పర్యటనలో భాగంగా 26వ తేదీన మధ్యాహ్నం రైలు మార్గం ద్వారా రాజమండ్రికి చేరుకుంటుంది. 27న ఉదయం 9.30 గంటలకు పోలవరం ప్రాజెక్టుకు చేరుకుంటుంది.

ఐపిఎస్ అధికారుల సంఘం ఖండన

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావుపై వైసిపి ఎంపి విజయసాయిరెడ్డి చేసిన ఆరోపణలను రాష్ట్ర ఐపిఎస్ అధికారుల సంఘం ఖండించింది. ఈ మేరకు ఆ అధికారుల సంఘం కార్యదర్శి రాజీవ్‌కుమార్ మీనా శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. వైసిపి ఎంపి ఆరోపణలు పోలీస్ వ్యవస్థపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు సంఘం విమర్శించింది. ఎబి వెంకటేశ్వరావుకు పూర్తి మద్దతు ప్రకటించింది. తాము ఏ రాజకీయ పార్టీతోనూ సంబంధం లేకుండా శాంతి భద్రతల పరిరక్షణ కోసమే పాటుపడతామని, అన్ని పార్టీలు ఈ విషయాన్ని గుర్తించాలని సంఘం సభ్యులు కోరుతున్నట్లు మీనా ఈ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆనంద నగరాల సదస్సుకు స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా సిఎం

అమరావతిలో నిర్వహించనున్న ఆనంద నగరాల సదస్సు స్టీరింగ్ కమిటీ చైర్మన్‌గా ముఖ్యమంత్రి చంద్రబాబు, వర్కింగ్ కమిటీ చైర్మన్‌గా పురపాలక శాఖ మంత్రి నారాయణ వ్యవహరించనున్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 10 నుంచి 12వ తేదీ వరకూ ఆనంద నగరాల సదస్సును నిర్వహించేందుకు విధి విధానాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను విడుదల చేసింది.

ఎస్ఐపై దాడికి యత్నం

'ఆది' అనుచరులేనంటున్న పోలీసులు

కేసు నమోదుకు జంకు

ప్రజాశక్తి - కొండాపురం

కడప జిల్లా కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ బి.వి.కృష్ణయ్యపై మంత్రి ఆదినారా యణరెడ్డి అనుచరులు గురువారం రాత్రి దాడికి ప్రయ త్నం చేశారు. గురువారం రాత్రి మండలంలోని టి.కోడూరులో కొందరు బెల్ట్‌షాపు నిర్వహిస్తు న్నారని సమాచారం రావడంతో కంచెం ఆదినారాయణరెడ్డి, చిన్నపెద్దయ్య ఇళ్లల్లో ఎస్ఐ సోదాలు నిర్వహించారు. ఆదినారాయణరెడ్డి ఇంట్లో 31 మద్యం బాటిళ్లు, చిన్నపెద్దయ్య ఇంట్లో 25 బాటిళ్లు దొరికాయి. చిన్నపెద్దయ్యను ఎస్ఐ అదుపులోకి తీసుకొని వస్తుండగా మంత్రి అనుచరుడు చింతా పవన్‌కుమార్‌రెడ్డి తన అనుచరులు 15 మందితో వచ్చి ఎస్ఐ వాహనాన్ని తన వాహనంతో అడ్డగించాడు. ఎస్ఐని దూషించాడు. పత్రికల్లో రాయలేని విధంగా తిట్టాడు.

పోలీసుల అదుపులో ఉన్న బెల్ట్‌షాపు నిర్వాహకుడు చిన్నపెద్దయ్యను విడిపించుకొని పోయాడు. ఇదంతా గ్రామస్థుల సమక్షంలో జరిగింది. మంత్రి అనుచరులు కావడంతో ఎస్ఐ ఏమీ చేయలేకపోయారని తెలిసింది. పవన్‌కుమార్‌రెడ్డి కనిపించడం లేదని శుక్రవారం సాయంత్రం టి.కోడూరు గ్రామస్థులు ఆందోళనకు దిగారు. మీరే అరెస్టు చేశారంటూ పోలీసులతో గొడవకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు భారీగా మోహరించారు. ఎస్ఐపై తన అనుచరులు దాడికి యత్నించిన విషయం తెలుసుకున్న మంత్రి ఆదినారాయణరెడ్డి తన అనుచరులను పంపి కొండాపురం సిఐతో చర్చలు జరిపి కేసు లేకుండా మాఫీ చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. గతంలో టి.కోడూరు గ్రామానికి చెందిన మంత్రి అనుచరులు తాళ్ళ ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌పై రాళ్ల దాడికి పూనుకున్నారు. ఈ సంఘటనపై చర్యలు తీసుకోలేదు. కొండాపురం పోలీస్‌స్టేషన్‌పై, ఎస్ఐలపై కూడా దాడి జరిగినప్పటికీ చర్యలు తీసుకోకపోవడం చట్టాలకే అవమానకరమని పోలీసులు వాపోతున్నారు.

పీడితుల రాజ్యం కోసం పరితపించిన జరావత్ రెడ్డి :పాటూరు

ప్రజాశక్తి - చల్లపల్లి

నిరంతరం పేద ప్రజల రాజ్యం కోసం జరావత్‌రెడ్డి పరితపించేవారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్య కొనియాడారు. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం తెలుగురావుపాలెం మాజీ సర్పంచ్ కీర్తిశేషులు జరావత్‌రెడ్డి 18వ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం రాజకీయాలపట్ల అపారమైన విశ్వాసంతో పనిచేశారని, సర్పంచ్‌గా గ్రామ అభివృద్ధికి పాటు పడటంతోపాటు పార్టీ అభివృద్ధికి కూడా కృషి చేశారన్నారు. ఆయన సేవలు ప్రజలు ఎన్నటికీ మరువరని, ఆయన ఆశయాలను కొనసాగించటమే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల, చల్లపల్లి మండలాల కార్యదర్శులు వాకా రామచంద్రరావు, యద్దన పూడి మధు, జరావత్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం తెలుగురావు పాలెం మాజీ సర్పంచ్ కీర్తిశేషులు జరావత్‌రెడ్డి 18వ వర్ధంతి సందర్భంగా పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు పాటూరు రామయ్య



గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహిస్తున్న నందినాటకోత్సవాల్లో శుక్రవారం ప్రదర్శించిన 'సత్యహరిశ్చంద్ర' లో ఓ సన్నివేశం

పని బంగారం.. బతుకు నిస్సారం..

- వృత్తికి దూరమవుతున్న స్వర్ణకారులు
- రెడీమెడ్ ఆభరణాల జోరు
- కార్పొరేట్ వ్యాపారులదే హవా



ప్రజాశక్తి- నెల్లూరు సిటీ ప్రతినిధి

పని బంగారం అయినా వారి జీవితాలు మాత్రం నిస్సారంగా ఉన్నాయి. తక్కువ తూకంలో ఎక్కువ నాణ్యత గల బంగారు నగలు తయారు చేయడంలో నెల్లూరు జిల్లాలోని స్వర్ణకారులకు దేశంలోనే ప్రత్యేక గుర్తింపు ఉంది. వీరికి పోటీగా బెంగాల్ నుంచి కార్మికులు వస్తుండటంతో బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు, కార్పొరేట్ జ్యూయలరీ షాపులు క్రమంగా పెరగడం వంటి కారణాలతో స్వర్ణకారుల ఉపాధిపై తీవ్రప్రభావం చూపుతున్నాయి. ఫలితంగా కొందరు ఈ వృత్తికి స్వస్తి చెబుతున్నారు. ఇంకొందరు గత్యంతరం లేని పరిస్థితిలో ఇదే వృత్తిలో కొనసాగుతూ దుర్భర జీవనం గడుపుతున్నారు. ఈ రెండు దశాబ్దాలలో సగం మందికిపైగా వృత్తిదారులు ఈ వృత్తికి స్వస్తి చెప్పినట్లు సమాచారం.

నమ్మకం కలిగితేనే 'రా' మెటీరియల్

షాపుల యాజమాన్యాలు నమ్మకం ఉన్న స్వర్ణకారులకే 'రా' మెటీరియల్ ఇవ్వడం పరిపాటి. జిల్లాలో ఇప్పటివరకు 15 వేల మంది స్వర్ణకారులున్నారు. వారిలో 2,500 మందికే గుర్తింపు కార్డులున్నాయి. ఆయా కార్డులు సైతం 'రా' మెటీరియల్ ఇప్పించేందుకు దోహదపడటం లేదు. మెటీరియల్ తీసుకునే సందర్భంగా ఆభరణాల వివరాలు, డెలివరీపై నిర్దేశిత సమయం వంటి అంశాలను రాత పూర్వకంగా రాసివ్వడం తప్పనిసరి అవుతోంది. ఈ వివరాలు ఇవ్వలేని పక్షంలో పరపతిని కోల్పోతున్నారు. ఫలితంగా వేలాదిమంది స్వర్ణకారులు కూలీలుగా మిగిలిపోతున్నారు.

మార్కెట్‌పై కార్పొరేట్ జ్యూయలర్స్ పాగా

కార్పొరేట్ జ్యూయలరీ మాల్స్ జిల్లాలో 25 వరకు ఉన్నాయి. మాల్స్ నిర్వహకులు ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతిపైనే మక్కువ చూపిస్తున్నారు. బాంబే, కలకత్తా వంటి రాష్ట్రాల్లో కొత్త టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. ఆభరణంలో 70 శాతం మిషన్‌పైనే తయారవుతోంది. మిగిలిన 30 శాతం పనులను స్వర్ణకారులతో చేయిస్తున్నారు. కొనుగోలుదారులు సైతం నగదు చెల్లించిన వెంటనే ఆభరణాలు తీసుకునే వెసులుబాటు ఉండటంతో రెడీమేడ్ ఆభరణాలపైనే ఆసక్తి చూపుతున్నారు. ఫలితంగా చిన్న చిన్న దుకాణాల్లో వ్యాపారం సన్నగిల్లుతోంది. వాటిపై ఆధారపడిన స్వర్ణకారుల ఉపాధిపైనా తీవ్ర ప్రభావం చూపుతుంది.

కార్మికుల మధ్య పెరిగిన పోటీ

పదేళ్ల క్రితం వరకూ 30 వేల మంది స్వర్ణకారులు ఉండేవారు. బెంగాల్ నుంచి వలస కూలీలు ఎక్కువగా రావడంతో స్వర్ణకారుల మధ్య పోటీ పెరిగింది. 100 గ్రాముల బంగారంలో 5 శాతం మిగులు ఉంటోంది. ఈ మిగులులో 2 శాతం తరుగు పోతుంది. మిగిలిన 3 శాతంతో స్వర్ణకారులు పనిచేస్తుండేవారు. బెంగాల్ నుంచి వచ్చిన స్వర్ణకారులు 3 శాతానికే పనులు ఒప్పుకోవడంతో వారి మధ్య పోటీ పెరిగింది. నమ్మకంగా పనిచేసే కార్మికులు తక్కువ శాతానికి చేయలేకపోతున్నారు. ఫలితంగా ప్రస్తుతం 15 వేల మంది స్వర్ణకారుల్లో 12 వేల మంది దుకాణాలకు అనుసంధానంగా పని చేస్తున్నారు. 3 వేల మంది సొంతగా పనులు ఒప్పుకుని చేసుకుంటున్నారు.

బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు

బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు స్వర్ణకారుల ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారంపై పెట్టుబడులు పెరగడం, డాలర్ విలువ పడిపోవడం, వంటి కారణాలతో ఇటీవల కాలంలో బంగారం ధరలు పెరిగాయి. సవర(10గ్రాములు) రూ.28 వేలకు చేరింది. శూన్యమాసం కావడంతో రెండు నెలలుగా పనులు లేవు. మార్చి నుంచి పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సీజన్ కావడంతో ఈ పాటికే హడావుడి మొదలవ్వాల్సి ఉంది. బంగారం ధరలు తగ్గుతాయన్న ఆశతో కొనుగోలుదారులు వేచి చూస్తున్నారు.

"ఆరోగ్య సమస్యలతో అవస్థలు



16 సంవత్సరాలుగా స్వర్ణకారునిగా పనిచేస్తున్నాను. ఈ వృత్తిపై ఆధారపడిన మాకు గ్యాస్ట్రబుల్, నడుం నొప్పులు, మానసిక ఒత్తిడి, ఎక్కువ వేడి వల్ల ఇతరాత్ర ఆరోగ్య సమస్యలు అధికంగా వస్తుంటాయి. ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లలేం. ప్రైవేట్ ఆస్పత్రుల ఫీజులు భరించలేక మందులతో జీవనం సాగిస్తున్నాం. పెద్ద జబ్బులొస్తే అప్పులే దిక్కు."

- పందిగుంట నారాయణరెడ్డి

"ఏడాదిలో 6 నెలలే ఉపాధి..



ఏడాదిలో 6 నెలలు మాత్రమే ఉపాధి ఉంటుంది. మార్చి నుంచి మే వరకూ, సెప్టెంబరు నుంచి నవంబరు వరకూ, ఆరు నెలలు మాత్రమే పనులు ఉంటాయి. ఆషాడం, బంగారం ధరల్లో హెచ్చుతగ్గులు వంటి కారణాలతో మిగిలిన ఆరు నెలలు అరకొర పనులతో కాలం వెల్లదీస్తున్నాం. వృత్తిని చేయలేక, వదలి వెళ్లలేక మానసికంగా తీవ్ర అవస్థలు పడుతున్నాం."

- కాపులూరి సుబ్రహ్మణ్య ఆచారి

పడకేసిన 'రాష్ట్రీయ బాల స్వస్థ్య'

వైద్య సిబ్బంది, మౌలిక వసతులు కల్పించని రాష్ట్ర ప్రభుత్వం
పక్క రాష్ట్రాల్లో అమలవుతున్నా రాష్ట్రంలో అమలు కాని వైనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు 2013లో కేంద్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం (ఆర్‌బిఎస్‌కె) రాష్ట్రంలో అమలుకు నోచుకోవడం లేదు. విద్యార్థుల్లో బాల్య దశలోనే వ్యాధులను గుర్తించి సత్వర వైద్య సేవలందించాలన్నది ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం అమలుకు ప్రత్యేకంగా వైద్యులు, ఇతర సిబ్బంది నియామకానికి ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చినా ఇప్పటి వరకు వారిని విధుల్లోకి తీసుకోలేదు. ఆ కార్యక్రమం అమలుపై నీలినీడలు నెలకొన్నాయి. ఆర్‌బిఎస్‌కె కింద ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు ప్రభుత్వ కళాశాలల విద్యార్థులకు రోగనిర్ధారణ పరీక్షలు చేయాల్సి ఉంది. 30 రకాల వ్యాధులను గుర్తించి చికిత్స అందించాలి. వ్యాధి లక్షణాలను బట్టి స్థానికంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రం, జిల్లా కేంద్రాస్పత్రి, ఎన్‌టిఆర్ వైద్య సేవలు అందుబాటులో ఉన్న ఆస్పత్రుల్లో వైద్య సేవలందించాల్సి ఉంది. ఇందుకయ్యే ఖర్చును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో భరించాల్సి ఉంది. ఆర్‌బిఎస్‌కె అమలుకు వైద్యులు, ఇతర సిబ్బంది నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం 2016లో నోటిఫికేషన్ విడుదల చేసింది. మెడికల్ ఆఫీసర్లు, ఆయుష్ మెడికల్ ఆఫీసర్లు, ఫార్మసిస్టులు, ఎఎన్ఎం తదితర 1,800 పోస్టులతో నోటిఫికేషన్‌ను వెలువరించింది. అదే ఏడాది డిసెంబర్‌లో నియామక ఉత్తర్వులు జారీ చేసింది. అంతలోనే వారిని విధుల్లోకి చేర్చుకోవద్దంటూ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగాల్లోకి తీసుకోకుండా ఇప్పటివరకు వారందరినీ గాల్లోనే ఉంచింది. పక్క రాష్ట్రాలైన తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం అమలవుతుండగా, మన రాష్ట్రంలో అమలు కాకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయ. ఆర్‌బిఎస్‌కెను ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో నడిపించాలని ప్రభుత్వం తొలుత భావించింది. వాహనాలు, నిర్వహణను కామినేని, అపోలో సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. ఈ ప్రక్రియ కూడా నిలిచిపోయినట్లు తెలిసింది.

కోటి మంది విద్యార్థులకు ప్రయోజనం

ఆర్‌బిఎస్‌కె అమలైతే రాష్ట్రంలోని కోటి మంది విద్యార్థులకు ప్రయోజనం కలగనుంది. ఈ కార్యక్రమం నిర్వహణకు అన్ని జిల్లాల్లో ఒక మొబైల్ టీమును ఏర్పాటు చేసుకోవాలని కేంద్రప్రభుత్వం తన మార్గదర్శకాల్లో సూచించింది. ఈ టీములో ఇద్దరు వైద్యులు, ఒక ఎఎన్ఎం, ఒక ఫార్మసిస్టు ఉంటారు. అటువంటి టీములు రాష్ట్ర వ్యాప్తంగా 450 ఉంటాయి. ఈ టీములు తమకు కేటాయించిన ప్రాంతాల్లోని పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయాల్సి ఉంటుంది. ఈ టీములకు అందించే ప్రత్యేక ట్యాబుల్లో విద్యార్థుల రోగనిర్ధారణ పరీక్షల నివేదికలను పొందుపరచాలి. ఎక్కడ వైద్య సదుపాయం అందించాల్సి ఉందో కూడా ట్యాబులోనే నమోదు చేసి ప్రభుత్వానికి ఈ టీములు సమాచారం అందిస్తాయి. దీనివల్ల విద్యార్థులకు సత్వర వైద్య సేవలందుతాయి. ఈ కార్యక్రమం అమలుకు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



సిక్కోలు సంబరాల్లో నృత్యం చేస్తున్న కళాకారులు

వైభవంగా 'సిక్కోలు సంబరాలు'

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో శుక్రవారం వైభవంగా సిక్కోలు సంబరాలు ప్రారంభమయ్యాయి. రాష్ట్ర రవాణా, విద్యుత్‌శాఖల మంత్రులు కె.అచ్చెన్నాయుడు, కమిడి కళావెంకటరావు సంబరాలను ప్రారంభించారు. ఉదయం స్వచ్ఛాంధ్రప్రదేశ్ - స్వచ్ఛ శ్రీకాకుళం కార్యక్రమం నిర్వహించారు. మైదానంలో పుష్ప ప్రదర్శణ, ఫుడ్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. సాంస్కృతిక, సాంప్రదాయ క్రీడలు, ఆటల పోటీలను నిర్వహించారు. మధ్యాహ్నం నగరంలో కళాజాతా నిర్వహించారు. సాయంత్రం సంగీత, సాంస్కృతిక నృత్యాలు, ప్రదర్శనలు ఇచ్చారు. ప్రముఖ నేపథ్య గాయకుడు కార్తీక్ సంగీత విభావరి, శాండ్‌యానిమేషన్, మిమిక్రీ, తదితర కార్యక్రమాలు జరిగాయి. ప్రజాశక్తి పుస్తక ప్రదర్శనను మంత్రి అచ్చెన్నాయుడు, కలెక్టర్ ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్‌పి చైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, ఎంపి రామ్మోహన్‌నాయుడు, శ్రీకాకుళం ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, కలెక్టర్ కె.ధనంజయరెడ్డి, జెసి-2 పి.రజనీకాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

'ఆహార భద్రతా చట్టం' సమావేశం రసాభాస

- తహసీల్దార్ల పనిపై విరుచుకుపడ్డ కమిషనర్
- నిరసనగా తహసీల్దార్ల వాకౌట్

ప్రజాశక్తి-గుంటూరు

'జాతీయ ఆహార భద్రతా చట్టం'పై శుక్రవారం గుంటూరు జెడ్పి సమావేశ మందిరంలో రాష్ట్ర ఆహార భద్రతా సంఘం నిర్వహించిన అవగాహనా సమావేశం గందరగోళానికి దారి తీసింది. ఆర్‌డిఒలు, తహసీల్దార్లు పౌరసరఫరాల విభాగాన్ని సరిగా పట్టించుకోవట్లేదని, గుంటూరు జిల్లాలో రేషన్ మాఫియా రాజ్యమేలుతోందని, అధికారులు మాత్రం ఈవెంట్ మేనేజర్లుగా మిగిలిపోతూ, విధుల నిర్వహణలో అలసత్వం వహిస్తున్నారని పౌరసరఫరాల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ బి.రాజెఖర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆహార భద్రతా చట్టం అమలులో ఇదే నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తే తానే నేరుగా సంబంధిత అధికారుల్ని అరెస్ట్ చేసి, జైల్లో పెట్టిస్తానన్నారు. నర్సరావుపేట రొంపిచర్ల మండలంలో రేషన్ అక్రమాలపై సంబంధిత ఆర్‌డిఒ, తహసీల్దారుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రాజశేఖర్ వ్యక్తిగతంగా అధికారుల్ని దూషించటం తగదని నిరసన తెలుపుతూ రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. రాష్ట్ర ఆహార భద్రతా సంఘం చైర్మన్ జెఆర్ పుష్పరాజ్ జోక్యంతో కొద్దిసేపటి తర్వాత వారు సమావేశ మందిరంలోకి తిరిగి వచ్చారు. ఇటీవల గుంటూరు జిల్లాలో ఐదు మండలాల్లో సోషల్ ఆడిట్ నిర్వహించగా తీవ్ర అవకతవకలు వెలుగు చూశాయని, వాటిని సరిదిద్దటానికి కమిషన్ కృషి చేస్తుందని పుష్పరాజ్ పేర్కొన్నారు.



సమావేశం నుండి వాకౌట్ చేసిన తహసీల్దార్లు

న్యాయంచేసే వరకూ పోరాటం : తోట

ప్రజాశక్తి - కాకినాడ

కేంద్ర బడ్జెట్‌లో ఎపికి అన్యాయం జరిగిందని, న్యాయం జరిగే వరకూ పోరాడతామని కాకినాడ ఎంపి తోట నరసింహం అన్నారు. తూర్పుగోదావరి జిల్లా కాకినాడ ఐటిఐ ప్రాంగణంలో ఎంపి నిధులు రూ.19.60 లక్షల తో నిర్మించిన జిల్లా ఉపాధి శిక్షణా కార్యాలయాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఎంపి మాట్లాడుతూ రాష్ట్రానికి నిధులు సాధించేందుకు కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. వచ్చేనెల 5 నుంచి నిర్వహించే పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి నిధులు సాధిస్తామన్నారు. కాకినాడ, పిఠాపురం రైల్వే మెయిన్ లైన్‌కు సంబంధించి బడ్జెట్‌లో పెట్టినప్పటికీ నిధులు కేటాయించలేదని తెలిపారు. కడపకు స్టీల్‌ప్లాంట్, ప్రత్యేక రైల్వేజోన్ వంటి అంశాలపై మరింత ఒత్తిడి తెస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, మేయర్ సుంకర పావని, ఉపాధి శిక్షణా ప్రాంతీయ సంచాలకులు పి.బాలసుబ్రహ్మణ్యం, ఐటిఐ ప్రిన్సిపల్ వాడ్రేవు శ్రీనివాసరావు, కార్పొరేటర్ కె.బాలాప్రసాద్ పాల్గొన్నారు.

నూర్పిడి యంత్రం బోల్తా

ఇద్దరు వ్యవసాయ కార్మికులు మృతి

ప్రజాశక్తి - పోలాకి (శ్రీకాకుళం జిల్లా)

శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం వెదుళ్లవలస గ్రామంలో నూర్పిడి యంత్రం బోల్తాపడి ఇద్దరు వ్యవసాయ కార్మికులు శుక్రవారం మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడగా, వారిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. అదే గ్రామానికి చెందిన భార్యభర్తలు యడ్ల అప్పన్న, పాపమ్మ, యడ్ల లక్ష్మి, పాలబోయిన లక్ష్మీనర్సమ్మ, డొంకాన అప్పలనర్సమ్మ వ్యవసాయ కూలీలు. రోజూ మాదిరిగానే కనుగుల చిట్టి పంట పొలంలో నూర్పు చేసేందుకు ఉదయం 10 గంటలకు వెళ్లారు. మధ్యాహ్నం 12.34 గంటల సమయంలో నూర్పిడి యంత్రాన్ని ఒక పొలం నుంచి మరో పొలానికి తరలిస్తుండగా వెనుక కూర్చున్న వారిపై యంత్రం బోల్తా పడింది. యడ్ల లక్ష్మి(42), యడ్ల పాపమ్మ(45) అక్కడకక్కడే మృతి చెందారు. మిగతా ముగ్గురు గాయపడ్డారు. వీరిలో అప్పన్న పరిస్థితి విషమంగా ఉంది. సమీప కూలీలు నరసన్నపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యడ్ల అప్పన్నను మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. పోలాకి ఎస్ఐ చంద్రమౌళి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తిరుపతిలో ఎస్‌సి కమిషన్ సభ్యులు శ్రీరాములు పర్యటన

పలువురి నుంచి వినతులు స్వీకరణ

ప్రజాశక్తి-తిరుపతి సిటి

జిల్లా పర్యటనలో భాగంగా జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు శ్రీరాములు పలువురి నుంచి వినతులను స్వీకరించారు. తిరుపతి పద్మావతి అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంలో అనేక మంది ఆయనకు వినతులు అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతికి చెందిన టి.లక్ష్మీపతి మాట్లాడుతూ తాను స్విమ్స్‌లో 12 సంవత్సరాలుగా ఎలక్ట్రీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నానని, యాజమాన్యం టైమ్ స్కేల్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నెల్లూరు జిల్లా కొడవలూరుకు చెందిన సిహెచ్ అన్వేష్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకులో విధులు నిర్వహిస్తున్నానని, సివిల్ కోచింగ్ కోసం ఆరు నెలలు సెలవు పెట్టి ఢిల్లీకి వెళితే ఉద్యోగం నుంచి తీసేశారని, తనకు న్యాయం చేయాలని కోరారు. టిటిడిలో పని చేసే ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగులకు రిజర్వేషన్ ప్రకారం ప్రమోషన్లు కొనసాగేటట్లు ఉత్తర్వులు ఇప్పించాలని ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి ఎవి.శేషగిరి వినతి చేశారు.

ప్రత్యేక హోదా కోసం ఐక్య పోరాటం

దేశంలో బిజెపి బలం తగ్గిపోతుంది
పిసిసి రాష్ట్ర అధ్యక్షుడు రఘువీరారెడ్డి

ప్రజాశక్తి-మార్కాపురం

ఎపికి ప్రత్యేక హోదా కోసం.. విభజన చట్టంలోని హామీలన్నీ అమలు చేసేందుకు కాంగ్రెస్ పార్టీ ఆఖరి పోరాటాన్ని చేపట్టిందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రఘువీరారెడ్డి అన్నారు. ఈ పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలను, ప్రజాసంఘాలను కలుపుకుపోతామని ఆయన అన్నారు. ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష' శుక్రవారం సాయంత్రం మార్కాపురంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట జరిగింది. ఈ కార్యక్రమానికి మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి షేక్ సైదా అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హజరైన రఘువీరారెడ్డి మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా ఉద్యమిస్తే హోదా సాధించడం పెద్ద కష్టమేమీ కాదన్నారు. హోదా కోసం ఏప్రిల్ 5వ తేదీ లోగా ఉద్యమం తీవ్రరూపం దాల్చితే ప్రయోజనం ఉంటుందన్నారు. దేశంలో బిజెపి బలం తగ్గిపోతోందన్నారు. కాంగ్రెస్ వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతోనే మైనార్టీ ప్రజలకు రక్షణ ఉంటుందని చెప్పారు. హోదా కోసం ఈ నెల 28వ తేదీ వరకు ఆంధ్రుల ఆత్మ గౌరవ దీక్షలు కొనసాగుతాయని, మార్చి 2వ తేదీన జాతీయ రహదారుల దిగ్బంధనం, మార్చి 6,7,8 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం ఉందన్నారు. ఢిల్లీలో మూడు రోజుల పాటు ఉద్యమిస్తామన్నారు. అవసరమైతే పార్లమెంటును ముట్టడించేందుకు వెనుకాడేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎసిసి మానిటరింగ్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ యాదవ్, పిసిసి ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ వాహిద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఈదా సుధాకర్ పాల్గొన్నారు.



ఆంధ్రుల ఆత్మగౌరవ దీక్ష మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

ఎల్‌ఎన్‌టి గోడౌన్‌లో అగ్నిప్రమాదం

రూ.6.20 కోట్ల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

అనంతపురం జిల్లా ఓబుళదేవరచెరువు మండలం ఎల్‌ఎన్‌టి గోడౌన్‌లో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో సుమారు రూ.6.20 కోట్ల విలువ చేసే విద్యుత్ పరికరాలు కాలిపోయాయి. కంపెనీ అధికారుల కథనం ప్రకారం.. మండల పరిధిలోని వడ్డివారిపల్లి వద్ద ఎల్‌ఎన్‌టి కంపెనీ గోడౌన్‌ను ఏర్పాటు చేసింది. కడప నుంచి కర్నాటక రాష్ట్రం మదుగిరి వరకు పవర్‌గ్రిడ్ లైను పనులు జరుగుతున్నాయి. ఈ పనుల నిమిత్తం గోడౌన్‌లో కోట్ల రూపాయల విలువ చేసే విద్యుత్ వైర్లు, పరికరాలను నిల్వ ఉంచారు. గోడౌన్ వెనుక గుర్తు తెలియని వ్యక్తులు గడ్డికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు పరిసర ప్రాంతాల్లో వ్యాపించాయి. గోడౌన్‌లో నిలువ ఉన్న 86 అల్యూమినియం విద్యుత్ డ్రమ్ములు కాలిపోయాయి. వీటి విలువ రూ.6.20 కోట్లు ఉంటుందని ఎల్‌ఎన్‌టి అకౌంట్స్ అడ్మిస్టేషన్ మేనేజర్ వెంకటరాముడు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే ఇన్‌ఛార్జీ తహశీల్దార్ సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ మహబూబ్‌పీరా, సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. జరిగిన నష్టాన్ని మేనేజర్‌ను అడిగి తెలుసుకున్నారు.

సంక్షిప్తం

ఎసిబికి చిక్కిన మైన్స్ సర్వేయర్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

విశాఖ నగరంలోని ఎంవిపి కాలనీలోని మైనింగ్ కార్యాలయంలో సర్వేయరు మురళీ కృష్ణ రూ. 50వేలు లంచం తీసుకుంటుండగా శుక్రవారం ఎసిబికి పట్టుబడ్డాడు. ఎసిబి డిఎస్పీ రామకృష్ణ ప్రసాద్ తెలిపిన వివరాలు ప్రకారం.. విశాఖ మైన్స్ ఏడీ కార్యాలయంలో మురళీకృష్ణ సర్వేయరుగా పనిచేస్తున్నాడు. రావాడ గ్రామంలో మట్టి క్వారీకి అనుమతులు కావాలంటూ డి.నీలకంఠరావు అనే వ్యాపారి దరఖాస్తు చేసుకున్నాడు. సర్వే అనుకూలంగా చేసి క్వారీ మంజూరయ్యేలా నివేదిక ఇచ్చేందుకు రూ. 50వేలు ఇవ్వాలని సర్వేయరు డిమాండ్ చేశాడు. అంత ఇచ్చుకోలేనని చెప్పినా వినకపోవడంతో నీలకంఠరావు ఎసిబిని ఆశ్రయించాడు. ఎసిబి అధికారుల పథకం ప్రకారం.. నీలకంఠరావు శుక్రవారం మైనింగ్ కార్యాలయంలో సర్వేయర్ మురళీకృష్ణకు రూ.50 వేలు లంచం ఇస్తుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నగదు స్వాధీనం చేసుకొని మురళీకృష్ణను అరెస్టు చేశారు.

ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య

కృష్ణా : జిల్లాలోని గుడివాడ ఎన్టీఆర్ కాలనీలో రాజా(22) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు దుకాణం తెరిచే సరికి రాజా విగత జీవుడై వేలాడుతూ ఉండటంతో కుటుంబ సభ్యులు, స్నేహితులు బోరున విలపిస్తున్నారు. ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉంది.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 16 మందికి శిక్ష

పశ్చిమగోదావరి : తణుకు సర్కిల్, పెరవలి పోలీసులు గురువారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఎక్కువగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 16 మందిపై కేసులు నమోదు చేశారు. వీరిని శుక్రవారం తణుకు కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయమూర్తి ఒక్కొక్కరికి ఒకరోజు జైలు శిక్షతోపాటు రూ.2000 జరిమానా విధించారు.

సంపాదకీయం

అవినీతి, అసమానతలు

భారత్‌లో అవినీతి రాజ్యమేలుతోందని, ఆర్థిక అసమానతలు ఆకాశమే హద్దుగా అంతకంతకూ విస్తరించిపోతున్నాయని అంతర్జాతీయ ప్రతిష్టాత్మక సంస్థలు ఇటీవల నివేదించడం ఆందోళన కల్గిస్తోంది. ప్రపంచంలోనే అత్యంత తీవ్రమైన అవినీతి పరులున్న 180 దేశాల జాబితాలో భారత్ 81వ స్థానంలో నిలిచిందని ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్ సంస్థ గురువారం విడుదల చేసిన నివేదిక.. అవినీతిని అంతం చేయడానికి తాము పంతం పట్టి ఉన్నామని ప్రతిరోజూ ప్రచారం చేసుకుంటున్న మోడీ పరివారానికి చెంపపెట్టు. మరోవైపు భారత్‌లో శతకోటీశ్వర్ల సంపద దేశ స్థూల జాతీయోత్పత్తిలో 15 శాతానికి పెరిగిందని, పేదలు మరింత పేదరికంలో నెట్టబడుతున్నారని ఆక్స్‌ఫాం వెల్లడించిన వాస్తవాలు మోడీ పాలనలో ప్రజలకు 'అచ్చే దిన్' మరింత దూరమైపోతున్నాయని తెలియజేస్తోంది. ఆదాయం, వినియోగం, సంపద వంటి అన్ని ప్రామాణీకాల్లోనూ ప్రపంచంలోని అత్యంత అసమానతలున్న దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచిందని, కార్పొరేట్‌లకు అనుకూలంగా ప్రభుత్వాలు ఏకపక్షంగా అమల్జేస్తున్న విధానాలే దీనికి ప్రధానకారణమని ఆక్స్‌ఫాం నివేదించింది. ఏడు దశాబ్దాల గణతంత్ర భారతావని నేటికీ ఇంతటి ఆర్థిక అసమానతలు, ఇంతటి తీవ్రమైన అవినీతి ఉక్కు సంకెళ్లలో బంధీగా ఉండిపోయిందంటే దానికి ప్రధానకారణం పాలక పక్షాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద ఆర్థిక సంస్కరణలే తప్ప మరొకటి కాదు.

ప్రతి ఐదేళ్ల కోసారి ఎన్నికల వేళ పాలక పక్షాలు 'పేదరికం నిర్మూలిస్తాం..అవినీతి అంతు చూస్తాం' అంటూ పోటాపోటీ నినాదాలు, వాగ్దానాలు చేయడం అధికారంలోకి వచ్చాక వాటి ఊసే ఎత్తకపోవడం అనవాయితిగా మారిపోయింది. పని చేసే సామర్థ్యమున్న ప్రతి ఒక్కరికి ఉపాధి కల్పించేందుకు చర్యలు చేపట్టడం, కార్పొరేట్ ప్రపంచంపై పన్నులు పెంచడం ద్వారా ప్రజా సంక్షేమానికి బాటలు వేయాల్సిన పాలకులు పెట్టుబడిదారీ వర్గాల ప్రయోజనం కల్గించేలా తీసుకుంటున్న చర్యల వల్ల దేశంలో ఆర్థిక అసమానతలు మరింతగా విస్తరిస్తున్నాయి. ఈ వినాశకర విధానల వల్లే పేదలు మరింత పేదరికంలో నెట్టివేయబడుతున్నారని, శతకోటీశ్వర్ల సంపద అంతకంతకూ పెరిగిపోతోందని ఆక్స్‌ఫాం నివేదించిన అంశాలు అక్షర సత్యాలు. ఈ విషయంలో గతంలో కాంగ్రెస్‌కు కానీ, ఇప్పుడు బిజెపి ప్రభుత్వానికి కానీ తేడా లేదు. మతతత్వ అజెండాతో ప్రజలను విభజించే ప్రమాదకరవ్యూహంతో ఆశ్రిత పెట్టుబడిదారివర్గ సేవలో తరిస్తుండటమే బిజెపికి అదనంగా ఉన్న ప్రత్యేకత.

యుపిఎ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని, కార్పొరేట్‌వర్గాన్ని తప్ప అట్టడుగు ప్రజలను అస్సలు పట్టించుకోలేదంటూ ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన బిజెపి ఇప్పుడు చేస్తున్నదేమిటి? ఇచ్చిన హామీలన్నిటినీ అటకెక్కించేయడమే గాక ఇదేంటని ప్రశ్నిస్తే దేశద్రోహులంటూ నయవంచనకు పాల్పడుతోంది. ఏటా కోటి ఉద్యోగాలిస్తామన్నారు కదా అంటే 'పకోడీలు వేసుకోండంటూ' వెటకారపు ఉచిత సలహాలిస్తోంది. అవినీతి అంతు చూస్తామని, విదేశాల్లో మగ్గిపోతున్న నల్లధనాన్ని భారత్ తీసుకొచ్చి ప్రతి ఒక్కరి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామంటూ వాగ్దానం చేసిన కాషాయ నేతలు..రుణాలు ఎగ్గొట్టి బ్యాంకులను గుల్ల చేసి విదేశాల్లో జల్సాలు చేస్తున్న ..కార్పొరేట్ నల్ల ధనులతో కలిసి ఫోటోలకు ఫోజులిస్తున్నారంటే ప్రజలకు ఇచ్చిన హామీల పట్ల, ప్రజాస్వామ్యం పట్ల బిజెపికి ఉన్న చిత్తశుద్ధి ఏ పాటితో అర్థం చేసుకోవచ్చు.

అవినీతిపై అన్నా హాజరే సాగించిన ఆందోళనల నేపథ్యంలో గద్దెనెక్కిన బిజెపి నాడు ఇచ్చిన హామీలన్నిటినీ తుంగలో తొక్కడమేగాక కార్పొరేట్ బడా పెట్టుబడిదారులు, రాజకీయ పార్టీల అనైతికమైత్రికి ఎన్నికల బాండ్ల పేరుతో రాచబాట వేస్తుండటం చూస్తున్నాం. తీవ్ర అవినీతిలో ఇలా భ్రష్టుపట్టి భారత పాలక వ్యవస్థలో నిజాలను వెలుగులోకి తీసుకొచ్చే పాత్రికేయులపై దాడులు పెరిగాయని ట్రాన్స్‌పరెన్సీ సంస్థ ఆందోళన వ్యక్తం చేయడం భారత్‌లో కాషాయ కూటమి పాలన అరాచకత్వానికి దర్పణం పట్టేదే. కర్నాటకలో గౌరీ లంకేశ్, త్రిపురలో భౌమిక్ హత్యలు ఇటీవల ఆధార్ లోపాలను వెలుగులోకి తీసుకొచ్చిన జర్నలిస్టుపై వేధింపులు ప్రశ్నించే గళాలను నులిమేస్తున్న బిజెపి సర్కార్ నిరంకుశత్వానికి నిదర్శనం. ప్రజాస్వామ్య గొంతుకులను నొక్కిపడేస్తూ పేదలపై భారాలు వేస్తూ జాతి సంపదను కార్పొరేట్‌లకు దోచిపెట్టడమే నరేంద్ర మోడీ నాయకత్వంలోని కాషాయ పాలకుల కర్తవ్యంగా మారిపోయినప్పుడు ప్రజల ముందున్న ఏకైక మార్గం పోరాటమే.

ఇదీ విషయం



యుద్ధం మొదలైందిక
మాటల తూటాలతో...
ఒకరిపైన మరొకరు
వాడి వేడి ఈటెలతో!

రంగు బయటకొస్తున్నది
పసుపూ కాషాయాలది...
ఎక్కడాగుతుందో మరి
లాలూచీ పోరు ఇది!

- కొల్లూరు వెంకట్

నేతలూ 'హోదా' నాటకాలూ

విశ్లేషణ

- కె అంజన

ఫిబ్రవరి ఒకటవ తేదీన కేంద్ర బడ్జెట్ ప్రవేశ పెట్టిన నాటి నుంచి రాష్ట్ర రాజకీయాలు పూటకో మలుపు తిరుగుతూ ఉత్కంఠ భరితంగా మారుతున్నాయి. ప్రత్యేక హోదా, విభజన హామీలు ఒక్కసారిగా తెర మీదకు వచ్చాయి. 'ప్రత్యేక హోదా ఏమైనా సంజీవనా?' అని ప్రశ్నించిన చంద్రబాబు తిరిగి హోదా రాగం అందుకున్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో జరిగిన అన్యాయానికి వ్యతిరేకంగా వామపక్షాలు చేపట్టిన బంద్, అందుకు సహకరించి కదలి వచ్చిన ప్రజానీకాన్ని చూశాక పాలక నేతల్లో కదలిక అనివార్యమైంది. అప్పటి వరకు రాష్ట్రంలో చంద్రబాబు వర్సెస్ జగన్ అన్నట్లుగా వున్న పరిస్థితి మారిపోయింది. ఎవరు మిత్ర పక్షమో, ఎవరు శత్రు కూటమో తెలీకుండా వాగ్బాణాలు సంధించుకుంటూ, కపట నాటకాలు ఆడుతూ పబ్బం గడుపుకోసాగారు. వీరి నటనా చాతుర్యాన్ని, వాక్పటిమను, వల్లెవేస్తున్న అబద్దాలను చూస్తుంటే 'రాజకీయ నాయకులా! రంగస్థల నటులా!' అన్న సందేహం కలగక మానదు. నిమిషానికో మాట మారుస్తూ క్షణానికో అబద్దం చెప్తూ ప్రజలను మోసగిస్తూ... ప్రతిపక్షంలో కూర్చోడానికి కూడా పనికి రారని నిర్ధారణ అయిన వీరిని ... నందులు, ఆస్కారులతో సత్కరించి ఇళ్లకు సాగనంపాల్సిందే.

అబద్దాల బాబు

రాష్ట్ర ముఖ్యమంత్రిగా వున్న చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు నుంచి కమలనాథులు ఎత్తుకున్న రాగానికి అనుగుణంగా ఫ్లూట్ ఊదడంలో ఆరితేరారు. బిజెపి హోదా అంటే హోదా. కాదు ప్యాకేజీ అంటే ప్యాకేజీ. అది కూడా కాదు ప్రత్యేక నిధుల కేటాయింపులంటే వాటికీ వినయంగా తలూపారు. నిన్నటి దాకా రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవని కాదన్న చంద్రబాబు...తాజాగా హోదాతోనే అభివృద్ధి, అఖిల పక్షం అంటూ గతంతో పొంతన లేని మాటలు చెప్తున్నా ... అందులోనూ కేంద్రంతో లోపాయికారీ ఒప్పందం వుండే వుంటుందన్న కథనాలు విన్పిస్తున్నాయి. ఆయన నోటి నుంచి వెలువడిన పరస్పర విరుద్ధమైన మాటల్లో వేటిని విశ్వసించాలో, వేటిని విస్మరించాలో తెలియని గందరగోళం లోకి ప్రజలను నెట్టివేశారు. రాష్ట్ర విభజన నాటి నుంచి గమనించినట్లయితే నేటి వరకు చంద్రబాబు మాట మార్చిన సందర్భాలు అన్నీ ఇన్నీ కావు. ఎన్నికల ముందు తిరుపతి వెంకన్న సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఐదేళ్ల చాలదు. పదిహేనేళ్ల కావాలంటూ డిమాండ్ చేశారు. హోదాపై రాజీ పడేది లేదంటూనే అడుగడుగునా రాజీ పడుతూనే వచ్చారు. హోదాను మించి ప్యాకేజీ ఇస్తామనగానే...'హోదాతో ఏమొస్తుంది? ప్యాకేజీతో అయితే నిధులొస్తాయిగాని!' అంటూ మోడీ మనోభావాలకు అనుగుణంగా తాళం వేశారు. బాబు అంగీకారంతోనే కేంద్ర ఆర్థిక మంత్రి జైట్లీ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. మోడీ మిధ్యా ప్యాకేజీని అర్ధరాత్రి మీడియాను పిలిచి మరీ స్వాగతించారు. ఓ వైపు హోదా ఇవ్వబోమంటూ ఐదున్నర కోట్ల ఆంధ్రులకు అన్యాయం చేస్తున్నా ...నవ్వుతూ కేంద్ర మంత్రులకు సన్మానాలు చేసి వినయాన్ని చాటుకున్నారు. ఏనాడూ కేంద్రం రాష్ట్రాన్ని మోసం చేసిందని మాత్రం పన్నెత్తి మాట అనలేదు. ఎంతసేపూ మిత్ర పక్షం. ఆచితూచి అడుగులు వేద్దాం. తొందర పడొద్దు. ఇంకా టైముంది గదా... అంటూ నీతి సూత్రాలు వల్లించడంతోనే నాలుగేళ్లు నెట్టుకొచ్చేశారు. ఇన్ని సంవత్సరాల్లో ఏ ఒక్క కేంద్ర బడ్జెట్‌లోనూ ఆంధ్రప్రదేశ్ ఊసే లేకున్నా...ఎన్నికల ముందరి విభజన హామీల అమలు లేకున్నా...ఓట్లేసి గెలిపించిన ప్రజానీకాన్ని భ్రమల్లో ముంచే ప్రయత్నం చేస్తున్నారు.

ఇంత జరిగినా బిజెపితోనే ఎందుకు అంటకాగుతున్నారు? మిత్ర పక్షం నుంచి బయటకొచ్చి రాష్ట్ర ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చవచ్చుగా? అన్నది ప్రశ్న. తాము బయటికి వస్తే తమ ప్రత్యర్థిగా వున్న వైఎస్‌ఆర్‌సిపి ఎక్కడ కేంద్రంతో జత కడుతుందోనన్న భయం ఒక వైపు...కేంద్రానికి దూరమైతే ఓటుకు నోటు కేసు ఎక్కడ తిరిగి మెడకు చుట్టుకుంటుందో నన్న బెంగ మరోవైపు...బాబును వెంటాడుతున్నాయా? సొంత అజెండా తప్ప రాష్ట్ర ప్రజలు, వారి బాగోగులు చంద్రబాబు అజెండాలో లేవా?

జగన్నాటకం

రాష్ట్ర యవనికపై జరుగుతున్న రాజకీయ నాటకంలో వైఎస్ జగన్ రూటే సపరేటు. ప్రత్యేక హోదా విషయమై గతంలోనూ రాజీనామా అస్త్రాలను ప్రయోగించినా ఆ తర్వాత ఆ ఊసే ఎత్తలేదు. మళ్లీ ఇన్నాళ్లకు అప్పుడు దాచి పెట్టిన అదే అస్త్రాన్ని తిరిగి బయటకు తీశారు. రాజీనామాల ప్రకటన-వాయిదా ఎందుకో వారికే తెలియాలి! కేంద్ర బడ్జెట్‌కు ముందు ఏ ఒక్క సభలోనూ హోదా విషయమై బిజెపి మాట తప్పిందనిగాని, రాష్ట్రానికి ద్రోహం చేసిందని కాని ప్రస్తావించకుండా పలు విన్యాసాలు చేశారు. ప్రకటించిన నవరత్నాలలో ప్రత్యేక హోదా, విభజన హామీలు లేకుండా జాగ్రత్త పడ్డంలో వున్న ఆంతర్యం ఏమిటో వారికే తెలియాలి. తమతోపాటు రాజీనామాలు చేయాల్సిందిగా టిడిపిని కూడా అడుగుతానంటారే గానీ...బిజెపి వైపు మాత్రం గురి పెట్టరు. హోదాపై చంద్రబాబు మోడీకి అల్టిమేటమ్ ఎందుకివ్వరంటారే గానీ తను మాత్రం కేంద్రాన్ని ఇరకాటంలో పెట్టేలా మాట్లాడరు. పైగా హోదా ఇస్తే బిజెపితో ఎన్నికల్లో కలిసి వెళ్లేందుకు రెడీ అంటారు. అంటే బాబు అవుట్ అయితే...జగన్ ఇన్ అన్నమాట. మోడీ సైతం ప్రభుత్వ భాగ స్వామిగా వున్న చంద్రబాబుకు అప్పాయింట్‌మెంట్ ఇవ్వరు గాని...వైఎస్ జగన్‌కు మాత్రం టక్కున ఇచ్చేస్తారు ఎందుకో? ఇరు పక్షాలకూ మధ్య ఏదైనా రహస్య ఒప్పందం కుదిరిందా? కేసులూ-కోర్టులూ-శిక్షల భయంతోనే బిజెపి పట్ల భయ భక్తులు ప్రకటిస్తున్నారా? రాజీనామాలు చేయడానికి ఏప్రిల్ 6 వరకు వ్యవధి తీసుకోవడం దేనికి? ముందే రాజీనామాలు చేసి ఉప ఎన్నికలను ఎదుర్కోవచ్చుగా? జంకు దేనికి?

> **ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయమై ప్రజలు తీవ్ర అసంతృప్తితో, ఆగ్రహావేశాలతో వున్నారన్న సంగతి 8వ తేదీ బంద్ నాడే స్పష్టం అయింది. ఈ స్థితిలో ఆ ప్రజాబలాన్ని ఉపయోగించుకొని కేంద్రంపై ఉద్యమించాలి. నిజాయితీ, చిత్తశుద్ధి వుంటే చేయాల్సింది అదే. కాని అటు టిడిపిగాని ఇటు వైఎస్సార్‌సిపి గాని ప్రజలను ప్రత్యక్ష పోరాటాలలోకి తీసుకొచ్చే ఉద్యమాలను ఎందుకు చేపట్టడం లేదు? ఎందుకు కాలయాపన చేస్తున్నాయి?**



బిజెపి పన్నాగం

పార్లమెంటు సాక్షిగా మన్మోహన్ సింగ్ రాష్ట్రానికి ఐదేళ్ల పాటు ప్రత్యేక హోదాను ప్రకటించినప్పుడు..'కాదు కాదు కనీసం పదేళ్లు కావాల్సిందే'నన్నారు బిజెపి నేత వెంకయ్య నాయుడు. ఆ తర్వాత ఎన్నికల ప్రచార సభల్లో మోడీ ఇదే విషయాన్ని పొల్లు పోకుండా అత్యంత రసవత్తరంగా తనదైన శైలిలో కంఠస్తం చేశారు. తాము అధికారంలోకి వస్తే పదేళ్లపాటు హోదా ఇస్తామని, విభజన చట్టం లోని అంశాలన్నిటినీ అమలు చేస్తామని విశాఖ వేదిక నుంచి ప్రకటించారు. ఎన్నికల ప్రణాళిక లోనూ పేర్కొన్నారు. హామీలు, వాగ్దానాల వర్షంతో ప్రజలను భ్రమల్లో ముంచి గద్దెనెక్కాక హోదాను ప్యాకేజీగా మార్చేశారు. తన నలభయ్యేళ్ల రాజకీయ జీవితంలో ఎవరికీ ఇంత సాయం అందలేదంటూ ప్యాకేజీని ఆకాశానికెత్తిన వెంకయ్య నాయుడు ఇప్పుడు హోదాను గొర్రె మెడ కింద గంటలతో పోల్చేశారు! పైగా ఐదు బడ్జెట్లు ప్రవేశ పెట్టినా ఆంధ్ర అన్న మాటే లేకుండా నెట్టుకొచ్చేశారు. సాంకేతిక కారణాల రీత్యా ఆంధ్రాకు హోదా ఇవ్వడం కుదరదన్నారు. ప్యాకేజీలో ఏమిచ్చారో, ఏం పుచ్చుకున్నారో, ఏమొచ్చిందో, ఎంతొచ్చిందో ఎవరికీ తెలీదు. రాష్ట్రంలో చంద్రబాబు వుండగా బలపడడం కష్టమన్న విషయం కమలనాథులకు మాబాగా తెలుసు. అటువంటప్పుడు రాష్ట్రానికి హోదాలు, ప్యాకేజీలు ఇస్తే అది కాస్తా బాబు ఖాతాలో పడే అవకాశం వుంది. దానివల్ల కొరివితో తల గోక్కోవడమే అవుతుంది. అందుకే మిత్రపక్షంగా వున్నప్పటికీ టిడిపితో ఢీ అంటే ఢీ అన్నట్టు నాటకమాడుతోంది బిజెపి. తాజాగా 'హోదా'ను పక్కదోవ పట్టించేందుకు 'సీమ' నాటకం కూడా మొదలెట్టింది.

ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు విషయమై ప్రజలు తీవ్ర అసంతృప్తితో, ఆగ్రహావేశాలతో వున్నారన్న సంగతి 8వ తేదీ బంద్ నాడే స్పష్టం అయింది. ఈ స్థితిలో ఆ ప్రజాబలాన్ని ఉపయోగించుకొని కేంద్రంపై ఉద్యమించాలి. నిజాయితీ, చిత్తశుద్ధి వుంటే చేయాల్సింది అదే. కాని అటు టిడిపిగాని ఇటు వైఎస్సార్‌సిపి గాని ప్రజలను ప్రత్యక్ష పోరాటాలలోకి తీసుకొచ్చే ఉద్యమాలను ఎందుకు చేపట్టడం లేదు? ఎందుకు కాలయాపన చేస్తున్నాయి?

ఈ విషయంలో జనసేన నేత కూడా ఇంకా సందిగ్ధావస్థలోనే వున్నట్టు కనపడుతోంది. ఏడాది క్రితమే ప్రత్యేక హోదాపై పోరాడతానని కాకినాడ సభలో ప్రకటించిన పవన్ కళ్యాణ్ ఇంత కాలం తర్వాత నిజ నిర్ధారణ కమిటీని ప్రకటించడం వెనక ఆంతర్యం ఏమిటి? ఆ నిజనిర్ధారణ కమిటీకి సూత్రధారిగా వున్న జెపిని రాజ్యసభకు తమ పార్టీ తరపున పంపాలని చంద్రబాబు ఆలోచిస్తున్నట్టు 'లీకులు' వచ్చాయి. పరోక్షంగా టిడిపికి గాని, బిజెపికి గాని, రెండింటికీ గాని తోడ్పడేందుకే పవన్ కళ్యాణ్ రంగం మీదకు వచ్చాడని వస్తున్న విమర్శలను కొట్టి పారెయ్యగలమా? జనసేన నేత విమర్శలన్నీ ప్రధానంగా ప్రతిపక్ష వైఎస్సార్‌సిపి మీదనే గురి పెట్టడాన్ని బట్టి ఆ విమర్శలకు ప్రాతిపదిక వున్నట్టు కనిపించడం లేదా! నిజనిర్ధారణ కమిటీ తవ్వి తీయబోయే కొత్త వాస్తవాలేమిటి? వామపక్షాలు, ఇతర ప్రజాస్వామిక వాదులు 'ప్రత్యేక హోదా-విభజన హామీల సాధన సమితి' పేరుతో ప్రజలను ప్రత్యక్ష కార్యాచరణలోకి దించి కార్యక్రమాన్ని చేపట్టాయి. ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన పట్ల నిజాయితీ వుంటే పవన్ కళ్యాణ్ ఈ కార్యక్రమాలతో చేయి కలపాలి. ప్రజలు ఎప్పుడూ మోసపోతూనే వుంటారని, ఏమీ తెలుసుకోలేరని ఎవరైనా భావిస్తే అంతకన్నా పొరపాటు ఇంకొకటి వుండదు.

సోషల్ మీడియా

ప్రధానిది పరీక్షలపై చర్చేనా?




'పరీక్షలపై చర్చ' పేరుతో ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ఇటీవల దూరదర్శన్ ప్రత్యక్ష ప్రసారంలో గంటకు పైగా విద్యార్థులతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 6 లక్షల హైస్కూళ్లు 35 వేల కాలెజీల్లోని 10 కోట్ల మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నట్టు కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రకాష్ జవదేకర్ చెప్పారు. పరీక్షలంటే భయపడవద్దని, వాటిని వినోదంగా భావించాలని, పండుగలా పాల్గొనాలని, పరీక్షా యోధుల్లా సన్నద్ధం కావాలని ప్రధాని ఉపోద్ఘాతంలో ఉద్బోధించారు. ఆ తర్వాత జరిగిన సంభాషణలో పరీక్షల మాటున ప్రధాని చేసిన ప్రసంగ చాతుర్యంలో నాలుగు ముఖ్యమైన విషయాలు తెలుస్తాయి.

ఒకటి, ఢిల్లీలోని తాల్కతోరా స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వారితో పాటు వివిధ ప్రాంతాల నుండి విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రధాని సమాధానాలు ఇచ్చారు. ఆ సమాధానాల్లోని కొన్ని మాటల్లో మోడీ సైద్ధాంతిక భావజాలం స్పష్టంగా తొణికిసలాడింది. అహం బ్రహ్మాస్మి, ఆత్మ విశ్వాసం, యోగా, ధ్యానం, గురు శిష్య పరంపర వగైరా మాటలు ఆ కోవకు చెందినవే. చదువు కోసం సరస్వతీ దేవిని పూజించినట్టే పరీక్షల సమయంలో హనుమంతుడిని తలచుకోవాలని చెప్పటంలో అంతరార్థం తెలిసిందే. రెండు, ఇప్పుడు పబ్లిక్ పరీక్షలు రాయాల్సిన (10, 12 తరగతులు) విద్యార్థులు 2019 ఎన్నికల్లో తొలిసారి ఓటు వేయాల్సిన వారు. కాబోయే ఓటర్లను అడ్వాన్స్‌గా కలుసుకుంటున్న రాజకీయ వ్యూహంగా కూడా దీన్ని అర్థం చేసుకోవచ్చు. మూడు, చర్చా కార్యక్రమంలో ప్రధాని అంతా హిందీలోనే మాట్లాడారు. ఇంగ్లీషులో ప్రశ్నలడిగిన విద్యార్థులకు కూడా హిందీలోనే సమాధానాలు చెప్పారు. దక్షిణాది రాష్ట్రాల విద్యార్థులు, ఉపాధ్యాయులకు హిందీ అర్థం కాకపోయినా నిర్బంధంగా గంటకు పైగా టీవీల ముందు కూర్చోవాల్సి వచ్చింది. నాలుగు, నరేంద్ర మోడీ ప్రధాని హోదాలో ప్రభుత్వ ఖర్చుతో ఎంత పెద్ద ప్రచారం చేసుకున్నారో ఈ కార్యక్రమం తేటతెల్లం చేసింది.

నాగటి నారాయణ
సెల్: 9490300577

దోమ బడాయి



మగ దోమ ఆడ దోమతో -
డార్లింగ్, నేను నీ కోసం సింహాన్ని వేటాడి తీస్కొస్తా....

ఆడ దోమ -
సర్లే ఇక పడుకో..

మగ దోమ -
ఏనుగుని కుట్టి దాని రక్తాన్ని నీ కోసం తీస్కొస్తా..

ఆడ దోమ -
సర్లే ఇక పడుకో..

మగ దోమ -
నిన్ను బెంజి కారులో ప్యారిస్ తీస్క పోతా...

ఆడ దోమ -
సర్లే ఇక పడుకో..

మగ దోమ -
ఏటి నమ్మకం లేదా.. నీ కోసం 100 గ్రాముల బంగారు గొలుసు తీస్కొస్తా..

ఆడ దోమ -
నీకెన్ని సార్లు చెప్పాల? ఆ చంద్రబాబుని కుట్టి ఇంటికి రావద్దని.

జన వాక్యం

దేశభక్తులు

ఓ ముఖ్యమంత్రిగారూ ... ఆధార్ కార్డులు లేక రేషన్ సరుకులు రాక ఆకలితో అలమటిస్తూ, ప్రాణాలొదులు తున్న అట్టడుగు అభాగ్యులు కారా అమరవీరులు. బ్యాంకు ఖాతాలు లేక, పెన్షన్ డబ్బులు రాక, చేతిలో చిల్లిగవ్వ లేక మందులు కొనలేక మరణిస్తున్న అవ్వాతాతలు కారా ఆదర్శ వంతులు. గిట్టుబాటు ధరలు లేక రుణమాఫీలు రాక అప్పులతో అవమానం పాలై అసువులు బాస్తున్న అన్నదా తలు కారా త్యాగధనులు. పెద్ద నోట్లు లేక, చిన్న నోట్లు కూడా రాక ఎటిఎంల ఎదుటే నేలకొరుగుతున్న అమాయకపు జనం కారా దేశోద్ధారకులు. కొత్త పన్నులు కట్టలేక, సరుకు కొనేవారు రాక, ఆస్తులు అమ్ముకుంటూ చితికి పోతున్న చిరు వ్యాపారులు కారా కర్మ వీరులు. ప్రత్యేక హోదా లేక రావాల్సిన నిధులు రాక అభివృద్ధి అడుగంటుతుంటే అచేతనంగా వుండిపోతున్న ఆంధ్ర ప్రజలు కారా దేశ భక్తులు.

ఈదర శ్రీనివాసరెడ్డి,
గుంటూరు.

వ్యాసాలు, ఉత్తరాలు రాయవల్సిన చిరునామా
editpageps@gmail.com

విద్యా సామాజిక వ్యవస్థల విధ్వంసంలో చంద్రబాబు

దర్పణం



డాక్టర్ కత్తి పద్మారావు

ఒక పక్క చంద్రబాబు విదేశీ బడాబాబులతో నిరంతరం మంతనాలు జరుపుతుంటారు. మరొక పక్క పదవ తరగతి విద్యార్థులు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు పరీక్షలకు సన్నద్ధమయ్యే క్రమంలో స్పృహ తప్పి పడిపోతుంటారు. ఇదంతా చూస్తుంటే అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్‌లో ఒక పక్క రాజసం మరొక పక్క దు:ఖంతో అసమ సమాజపు నీరసపు ధ్వనులు వినిపిస్తున్నట్లుగా వుంది. రాష్ట్రంలో వృద్ధులు, శిశువులు, విద్యార్థులు నిస్సత్తువతో పౌష్టిక ఆహారం లేక నీరసపడి పోతున్నారు. గర్భవతులు రక్తలేమితో పిల్లల్ని కనలేక మరణిస్తున్నారు. సరైన ఆహారం అందక గర్భస్థ శిశువులు కడుపులోనే మరణిస్తున్నారు. మరణిస్తున్న వారిని పూడ్చడానికి శ్మశానంలో చోటులేక బడుగు జీవులు గుండెలు బాదుకొంటున్నారు. తాగుడు విపరీతమై కళ్ళ ముందే బిడ్డ మరణించిన ఘట్టాలు తల్లుల గుండెలను పిండేస్తున్నాయి. మూలవాసుల జీవనాధారమైన అటవీ భూములను పెద్ద పెద్ద కంపెనీలకు లీజులకిస్తున్నారు. లక్షా ఏభై ఆరు వేల కోట్ల ఆర్థిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం పుష్కరాలకు వేల కోట్లు ఖర్చు పెడుతోంది. జీర్ణావస్థలో ఉన్న దేవాలయాల పునరుద్ధరణలకు వందల కోట్లు వెచ్చిస్తోంది. పాలకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు వందల కోట్లు వెచ్చించి మరీ విదేశాలకు ప్రయాణిస్తున్నారు. మన ముఖ్యమంత్రిగారైతే హెలికాప్టర్లు, ప్రత్యేక విమానాల్లో మాత్రమే పర్యటిస్తారు. ఇటువంటి రాష్ట్ర ప్రభుత్వం సర్కారీ బడుల్లో పదవ తరగతి చదివే పిల్లలకు కొన్ని శనగలు, ఒక గ్లాసు పాలు, వేరుశనగ వుండలు, ఒక అరటి పండు ఇవ్వలేదా? అంటే తప్పకుండా ఇవ్వగలుగుతుంది. మరి ఎందుకు ఇవ్వడం లేదు?


తనకు కూత వేటు దూరంలో వున్న జి.జి.హెచ్‌లో సెల్‌ఫోన్ లైట్లతో వైద్యం జరుగుతుంటే, అంబానీని ప్రత్యేక విమానంలో రప్పించి, డిజిటల్ పాలనా నిర్మాణంలో అన్ని రాష్ట్రాలకు మా రాష్ట్రమే ఆదర్శమని చెప్పుకొంటున్న ఘనులు మన ముఖ్యమంత్రి. తనకు సమీపంలో వున్న ఎన్నో జడ్‌పి, మున్సిపల్ స్కూళ్ళలో విద్యార్థులు, తన మంత్రి మండలిలోని నారాయణ కాలేజీ బట్టీ వ్యవస్థతో పోటీ పడలేక జీవితమే యుద్ధంగా బతుకుతున్నారు. ఒకవైపు ఆడ పిల్లకు రుతుక్రమంలో సరైన ప్యాడ్లు ఇవ్వకుండా వారు ధరించిన వస్త్రాలకు మరకలై ఇతర పిల్లలు గోల చేస్తుంటే... మరొక వైపు ముఖ్యమంత్రిగారు పెద్ద హోటళ్ళల్లో విదేశీ ప్రతినిధులకు డిజిటల్ దృశ్య ప్రజెంటేషన్లు చేసి ముసిముసి నవ్వులు నవ్వుతుంటారు. రాతి గుండె గలవాణ్ణని తానే గొప్పలు చెప్పుకొంటున్న ముఖ్యమంత్రి రాష్ట్ర బడ్జెట్‌లో ప్రకటించిన మొత్తాన్ని దేనికి ఖర్చుపెట్టారో



చెప్పలేని స్థితిలో ఉన్నారు. పక్కా వ్యాపారులు, బ్రోకర్లు, లిక్కర్ వ్యాపారులు, మాఫియా గ్యాంగ్‌లతో ఆయన మంత్రిమండలి నిండిపోయింది. అటువంటి వారి పర్యవేక్షణలో పాలన చేస్తున్న చంద్రబాబుకు పేద ప్రజల 'జీవించే హక్కుల'ను కాలరాస్తున్న అంశాల పట్ల ఎలా శ్రద్ధ ఉంటుంది? ఎన్నికల కోసం కూడగొట్టుకొన్న వేల కోట్ల రూపాయలతో ఓటుకు నోటుతో గెలవమంటారు. ఏమీ భయపడొద్దు. మళ్ళీ మనమే గెలుస్తామని మంత్రులకు, ఎమ్మెల్యేలకు బోధిస్తారు. ఇంత ప్రగల్భాలు పలికే ముఖ్యమంత్రికి 200 మంది ఆడ పిల్లలు చదువు కుంటున్న బడిలో, మూడు మూత్రశాలలు మాత్రమే వుంటే వారి దైనందిన కార్యక్రమాలు ఎలా తీర్చుకొంటారనే ఇంగిత జ్ఞానం వుండదా! తన పూర్వ రాజ్యంలో బుద్ధి పూర్వకంగా ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు కాలేజీ హాస్టళ్లు రద్దు చేసి బిఎల వల్ల, ఎంఎల వల్ల ప్రయోజనం లేదని చెప్పి విపరీతంగా ఇంజనీరింగ్ కాలేజీలు పెట్టించారు. చివరకు సాధారణ విద్యను ధ్వంసం చేశారు. సాంకేతిక విద్యకు విలువ లేకుండా చేశారు. ఇప్పుడేమో ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టి రాష్ట్రానికి ప్రాజెక్టులు, పరిశ్రమలు లేకుండా చేయడం నిజం కాదా! విద్యార్థినులకు 18 వేల మూత్రశాలలు కట్టవలసిన పని ముఖ్యమైంది కాదా! దానికి ప్రభుత్వం దగ్గర డబ్బు లేదా! దేశ వ్యాప్తంగా పెట్టుబడి దారులుగా ప్రఖ్యాతి చెందిన టాటా, ముఖేష్ అంబానీ, బిర్లా, అనిల్ అంబానీ, భారతి తదితర కార్పొరేట్ సంస్థలకు ఏపిలో ఎన్నో విలువైన భూములను ధారాదత్తం చేస్తున్నారు. విద్య పట్ల, విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి వుంటే అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారాన్ని సరఫరా చేయరా! ఆడపిల్లలకు విద్యాలయాల్లో మూత్రశాలలు నిర్మించరా! తన హెరిటేజ్ ఫుడ్స్‌ను అమ్ముకోవడానికి ప్రభుత్వంలో వుండే అన్ని శాఖలను ఉపయోగించుకొంటున్న ముఖ్యమంత్రికి మధ్యాహ్న భోజనానికి ఐదారు రూపాయలు చాలవని తెలియదా! రోజుకు పది గంటలు చదువుకొనే విద్యార్థినులకు శక్తిమంతమైన ఆహారం ఇవ్వడం బాధ్యత కాదా! చంద్రబాబు నిర్లక్ష్యం వల్ల, నిర్దాక్షిణత వల్ల, కేవలం రాజకీయ ప్రయోజనాలనే ఆశించడం వల్ల రాష్ట్రంలోని శిశువులతోపాటు, అనేక జీవులు కూడా మరణిస్తున్నాయి. ముఖ్యంగా పశుగ్రాసం లేక, నీళ్ళు లేక పశువులు మరణిస్తున్నాయి. చిరు ధాన్యాలను పండించండని నినాదం ఇస్తున్న చంద్రబాబు, ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుండి 10వ తరగతి చదివే విద్యార్థులకు ఎందుకు చిరు ధాన్యాలు అందించడం లేదు? 'ఉదయాన్నే సూర్య నమస్కారాలు చేయండి' అని పిలుపునిస్తున్నారు. ఏ ఆహారం తీసుకోకుండా నమస్కారాలు చేస్తే కళ్ళు తిరిగి పడటం తప్ప ఇంకేమీ వుండదు. అన్ని విటమిన్లతో పాటు డి విటమిన్ కావాలి. అయితే మాత్రం సూర్యుని ముందు నిలబడితేనే అంత శక్తి వస్తుంది అనుకోవడం అజ్ఞానం.

చంద్రబాబు పాలనలో విద్యా పునాదులు కూలుతున్నాయి. విద్యార్థుల అంతఃశక్తి తగ్గుతోంది. విద్యార్థుల్లో మనో వైకల్యం పెరుగుతోంది. దానికి కారణం ఏంటి? సరైన ఆహారం లేకపోవడమా? లేదా ఆహారేతర అంశాల మీద శ్రద్ధ ఉండటం వల్లా? సెల్‌ఫోన్లు, సినిమాలు, కూల్ డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌లు, ఇలా జ్ఞానేతర వస్తువులు, శక్తి హీనమైన ఆహారాలు పిల్లలకు అలవాటు కావడం వల్ల కూడా వైపరీత్యాలు సంభవిస్తున్నాయి. మధ్యాహ్న భోజనం వికటించి విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారంటే ఆయనకు బాధ కలగదు. మూడు కిలోమీటర్లు నడవలేక ఎంతోమంది పిల్లలు బడికి రావడం లేదు. డ్రాపౌట్లు పెరుగుతున్నారంటే 'ఇంగ్లీషు కాన్వెంట్లకు పంపుకోండి, చిన్నప్పటి నుండే డిజిటల్ విద్యను అభ్యసించండి' అని బోధ చేస్తున్నారాయన. తన అనుంగు మంత్రి నారాయణ కాలేజీల్లో మేడల మీద నుంచి దూకి, ఫ్యాన్లకు ఉరి వేసుకొని చనిపోతున్న విద్యార్థుల శవాలను ఆయన ముందు పెట్టినా ఇవి మామూలే! నారాయణ చాలా నిర్మాణకర్త అని కితాబులిస్తున్నారు. కనీసం ఒక్క కేసు కూడా ఆయన మీద పెట్టలేదు. ఒక్క కాలేజీ అనుమతులు కూడా రద్దు చేయలేదు. ఈ విపరీతాల వల్ల ఎంతోమంది బాలబాలికలు మధ్యలో చదువు ఆపేస్తున్నారు. బాలికలు బాల్య వివాహాలకు బలౌతున్నారు. ఈ విధంగా మన రాష్ట్రంలో విద్యా విధ్వంసం జరుగుతోంది. ఇది చిన్న విషయం కాదు. ఇది రాజకీయంగా కూడా ఆలోచించాల్సిన విషయం. రాజ్యాంగం విద్యకు ప్రధాన పాత్ర ఇచ్చింది. సమాజ పరిణామానికి విద్య మూలం. విద్యా పునరుజ్జీవనం కోసం లౌకిక వాదులందరూ నడుం కట్టాలి.

(రచయిత నవ్యాంధ్ర పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సెల్ : 9849741695)



ఒకరినొకరు అర్థం చేసుకోవాలి

ఫ్యామిలీ కౌన్సెలింగ్

వాళ్లిద్దరికీ పెళ్లయ్యి.. రెండేళ్లు కాలేదు. అతని కుటుంబంలో ఆమె ఇమడలేకపోతోంది. అలా.. ఆమె ఎందుకు ప్రవర్తిస్తుందో..ఆమెను ఎలా మార్చుకోవాలో అతనికి అర్థంకావడం లేదు. ఇదిలా ఉంటే.. ఆమె మానసికంగా మరింత కుంగిపోతోంది. ఆమె పరిస్థితికి అతని మరింత తల్లడిల్లుతున్నాడు. ఆమెకు అర్థం అయ్యేలా చేసే ప్రయత్నంలో అతను కొన్ని పొరపాట్లు చేస్తున్నాడు. ఫలితంగా వారి మధ్య దూరం పెరుగుతోంది. ఈ సమస్యను ఎలా చక్కదిద్దుకోవాలో తెలియక అతను భార్యతో కలిసి 'ఐద్వా అదాలత్'కు వచ్చాడు. చివరికి ఏమైందో తెలుసుకోవాలంటే ఈ వారం 'కేస్‌స్టడీ' చదవండి.

ఆమె పేరు అనిత. అతని పేరు అనురాగ్.

అనిత మధ్యతరగతి కుటుంబంలో పుట్టింది. తనతోపాటు ఒక తమ్ముడు ఉన్నాడు. ఆమె ఆ ఇంట్లో కాస్త గారాబంగా పెరిగింది. ఆమె చదువులో నెంబర్ వన్. మంచి తెలివితేటలున్న అమ్మాయి.

అనురాగ్ తండ్రి సోదరులూ ఒక దగ్గరే ఉంటారు. కలిసి ఉండకపోయినా, అందరివీ దగ్గర దగ్గర ఇళ్లే. అందరిపిల్లల్లో అనురాగ్ ఒక్కడే మగపిల్లవాడు కావడంతో అక్కచెల్లెళ్లకు సోదరుడంటే అమితమైన ప్రేమ.

అనితకు అంతమంది మధ్య కలవలేక ఉక్కిరిబిక్కిరి అవుతుంది. అతనికేమో నలుగురిలో ఉంటేనే ఆనందంగా ఉంటుంది. ఇక్కడే మొదట వీరిద్దరికీ తేడా వచ్చింది. అనురాగ్‌కు తిండిపట్ల అభిరుచి గలవాడు. ఆమెకు అంత ఇంట్రెస్ట్ ఉండదు. అనురాగ్ అభిరుచి తెలిసిన అక్కచెల్లెళ్లు ప్రేమగా వడ్డించేవారు. అదీ అనిత లేకుండా. ఇది వారి మధ్య అభిప్రాయ భేదాలకు తెరలేపింది. ఇలా మొదలైన వారి మధ్య గొడవ.. చిలికి చిలికి గాలివానగా మారింది. ఆమెకు అర్థమయ్యేలా చెప్పటానికి అనురాగ్ చేసేవన్నీ విఫల ప్రయత్నాలే అవుతున్నాయి. అనిత విపరీతంగా బాధపడక మునుపే ఆమె మనసు తెలుసుకుని, పుట్టింట్లో అతనే తీసికెళ్లి, నాలుగురోజులు ఉంచేవాడు. అక్కడే ఆమె ప్రవర్తన వాళ్ల అమ్మానాన్నలకు తెలియజెప్పేవాడు. వాళ్లు 'మా అమ్మాయి చాలా తెలివైనది. 90% స్టూడెంట్.. అలా ఎందుకు అయ్యిందో అర్థం కావడంలేదు.. నువ్వే సర్దుకుపోవాలి' అనేవారు. కొన్నిరోజుల తర్వాత అతనే ఆమెను తీసుకొచ్చుకునేవాడు. ఆమె ఇంటికి వచ్చాక మళ్లీ యథాప్రకారం జరుగుతుండేది. దీంతో అనురాగ్ అనితను ఎలా మార్చుకోవాలో అర్థంకాక ఆమెను తీసుకుని 'ఐద్వా అదాలత్'కు వచ్చాడు.

అడ్రస్
కుటుంబ న్యాయ సలహా కేంద్రం
మోటూరు ఉదయం ట్రస్టు
ఎంబి భవన్ హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఫోన్ 9494383220

అనిత : అతను ఇంటికి రాత్రి ఎప్పటికో వస్తాడు. వచ్చినా ఆయన ఫోన్ చేసుకుంటూ ఉంటాడు. గంటలు గంటలు గేమ్స్ ఆడుతూ కూర్చుంటాడు. నాతో అసలు మాట్లాడు. ఎప్పుడైనా తొందరగా వచ్చినా వాళ్ల అక్కల దగ్గరకు వెళ్దాం అంటాడు. తీరా అక్కడికి వెళ్లాక వాళ్ల అక్కలు కంచంలో ఆయనకొక్కడికే అన్నం పెట్టుకుని వస్తారు. వాళ్లలా తేవడం ఎంతవరకు కరెక్టు? ఆయన అయినా చెప్పాలి కదా? నాకూ తనతో పాటు పెట్టాలి కదా?! బండిమీద తీసికెళ్లేప్పుడుగానీ, ఏదైనా ఫంక్షన్లలోగానీ కనిపించే అమ్మాయిలను చూపించి, 'వాళ్ల హెయిర్ స్టయిల్ చూడు ఎంత బాగుందో..! వాళ్ల డ్రెస్సింగ్ ఎంత చక్కగా ఉందో..!' అంటూ నాతో చెప్తుంటే నాకు ఎలా అనిపిస్తుంది..? అలాగే వాళ్ల అక్కలతో తను చాలా క్లోజ్‌గా ఉంటారు. నాతో కూడా అంత క్లోజ్‌గా ఉండరు. వాళ్లతో అలా ఉండటమేమిటి? మా తమ్ముడు ఒకసారి వచ్చినప్పుడు నా ఒడిలో తలపెట్టుకుని పడుకున్నాడు. 'మరి మీ తమ్ముడు అలా నీతో ఉండొచ్చా?' అని అడుగుతున్నారు. అది ఎంత వరకు కరెక్టు? నేను మొదటి నుంచీ ఫస్టు క్లాస్ స్టూడెంట్‌ని. ఇంజనీరింగ్‌లో 90 పర్సంట్ వచ్చింది. ఇప్పుడేదైనా జాబ్ చేద్దామన్నా నా మైండ్ అంతా బ్లాంక్ అయిపోయినట్లు ఉంటుంది. ఏమీ ఆలోచించలేకపోతున్నా. నా తెలివితేటలన్నీ ఏమైపోయాయి? కొత్తల్లో మాత్రం నేను అతన్ని చాలా ఇబ్బంది పెట్టినమాట వాస్తవం. ఈ మధ్యే పెద్దవాళ్ల దగ్గర కూర్చోబెట్టి చెప్పారు. నావైపు నుండి కొన్ని పొరపాట్లు ఉన్నాయని తెలుసుకున్నా. ఇప్పుడలా లేను.



అనురాగ్ : నేను రాత్రి చాలా పొద్దుపోయి ఇంటికి వచ్చేసరికి ఆమె అలిగి పడుకుంటుంది. నేను రెండున్నర గంటలకు పైగా ఆమెను బతిమిలాడినా కన్విన్స్‌కాదు. ఇక నేను బయటకు వెళ్లిపోవడానికి సిద్ధమై, బైక్ స్టార్ట్ చేస్తే అప్పుడు వచ్చి, లోపలికి రమ్మని బతిమిలాడుతుంది. నేను అప్పుడున్న కండిషన్‌లో అంతంతసేపు ఆమెను బతిమిలాడటం సాధ్యమా? ఇలా ప్రతిసారీ బతిమిలాడటం కుదరదు కదా?! అలాగే ఇద్దరం కలిసే ఎవరింటికైనా వెళ్తాం. నేను మా కుటుంబంలో నేనొక్కడినే మగపిల్లవాడిని.. మా అక్కచెల్లెళ్లందరికీ నేనంటే చాలా ఇష్టం. వాళ్లు ఏం చేసినా, నాకు పెట్టాలని చూస్తారు. నేను వెళ్లగానే వంట అయిపోతే వెంటనే పళ్లెంలో పెట్టుకుని వచ్చేసి.. "వేడి వేడిగా తినరా!" అంటూ ఆప్యాయంగా పెడుతుంటారు. అప్పటికీ వాళ్లకి చెబుతాను. తను అప్పుడు అక్కడ కాకుండా పక్కనే మరో అక్క దగ్గర ఉందనుకోండి నేను తనొస్తే ఎలాగా అని గిల్టీగా ఫీలవుతా! "ఏంట్రా? మీ ఆవిడ ఏమైనా అంటుందని భయమా? మా ఇంట్లో తింటే మీ ఆవిడ ఏమంటుంది?" అని అడుగుతారు. నేను ఏమీ చెప్పలేక తినేయబోతుంటే.. అప్పుడే అనిత వస్తుంది. ఇక అప్పుడు నా పరిస్థితి ఎలా ఉంటుందో మీరే అర్థం చేసుకోండి. నా అవస్థల గురించి ఏం చెప్పమంటారు? చెప్పండి. అలాగే రోజంతా ఇంట్లోనే తీరుబడిగా ఉంటుంది. బయటకు వెళ్దామన్నప్పుడు చక్కగా రెడీ అవ్వొచ్చు కదా?! అలా ఉండదు. ఎడముఖంపెడముఖంగా ఉంటుంది. అందుకే నేను అలా వాళ్లనీ వీళ్లనీ చూపించి చెప్తున్నా. అలా అయినా తను మారుతుందేమోనని. వాళ్ల ఇంటికి తను అడగకుండానే, అర్థంచేసుకుని నేనే తీసుకెళ్లి వదిలిపెడతాను. అక్కడా ఇలాగే ప్రవర్తిస్తుంటుంది. వాళ్లవాళ్లు 'ఆమె బ్రిలియంట్.. ఇలా అయిపోయిందేమిటి?' అంటారు. నాకేం చేయాలో పాలుపోవడం లేదు.

బాధ్యులు ఏమన్నారంటే ...

అనితా! అనురాగ్! మీ ఇద్దరూ వేర్వేరు కుటుంబాల నుంచి వచ్చిన వాస్తవ పరిస్థితిని ముందుగా అర్థం చేసుకోవాలి. ఒకరివైపు నుంచి ఒకరు ఆలోచించినప్పుడే ఇద్దరి మధ్య వచ్చే అభిప్రాయభేదాలు సమసిపోవడానికి వీలవుతుంది. ప్రధానంగా భార్యాభర్తల మధ్య మరింతగా ఈ దృష్టి కోణం ఉండాలి. కొత్తగా వేరే కుటుంబంలోకి వచ్చినప్పుడు అక్కడ పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. అందుకు భాగస్వామి తోడ్పాటు చాలా అవసరం. లేకపోతే ఆమె ఒంటరి అయిపోతుంది. మన ఇంటికి వచ్చిన అమ్మాయిని కుటుంబసభ్యులు కూడాకలుపుకునే ప్రయత్నం చేయాలి తప్ప, ఆమె బలహీనత మరింత బలపడేలా చేయకూడదు. ఆమెలో మార్పు కోరినప్పుడు తనకే అర్థమయ్యేలా చెప్పాలి తప్ప, వేరొకరితో పోలిక సరైన అప్రోచ్ కాదు. అందులోనూ బయట కనబడిన మహిళల్ని చూపెట్టి అలా ఉండాలని చెప్పడంవల్ల తను తప్పుగా భావించే అవకాశం ఉంటుంది. అలాగే అనిత కూడా గంటల తరబడి అలగడం సరైన పద్ధతి కాదు. బయటపనులతో అలసిపోయిన అతనికి అంత ఓపిక కూడా ఉండదు. మీ ఇద్దరూ ఒకరంటే ఒకరికి ప్రేమాభిమానాలు ఉన్నాయి. అలా అని అతను ఓపికకు పరీక్ష పెట్టి, విసిగి వేసారేలా చేయకూడదు. మీ ఇద్దరిలో ఎవరికి సమస్య వచ్చినా ఎదుటివారి వైపు నుంచి ఆలోచించండి. అవతల వ్యక్తి బాధ కనీసం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు సమస్య పరిష్కారం తేలికవుతుంది. ఇద్దరి బలహీనతలను అధిగమించడానికి ఎవరికి వారేకాకుండా, ఒకరికొకరు సహకరించుకోవాలి. ఇద్దరూ.. మీకుగల సోదరీ సోదరుల మధ్య అనుబంధాలను అర్థంచేసుకోవాలి తప్ప, అపార్థాలు చేసుకోకూడదు. మా దగ్గరకు వచ్చే వాటితో పోలిస్తే మీ సమస్యలేమీ పెద్దవి కాదు. మీ ఇద్దరి మధ్య అవగాహనా లోపమే ఎక్కువగా ఉంది. కొన్ని వారాలు మా వద్ద కౌన్సెలింగ్‌కు వస్తే మీ సమస్యలు పరిష్కారమవుతాయి. అనిత కూడా ఏదైనా ఉద్యోగం చేస్తే మంచిది. బయట ప్రపంచం తెలుసుకోవడానికి, బయటవారితో కలిసినప్పుడు కొన్ని విషయాలు అవగాహన కావడానికీ వీలవుతుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంట్లో ఒంటరితనం కూడా ఆమె అలా డిస్టర్బ్‌డ్‌గా ఉండటానికి ఓ కారణం కావొచ్చు. అవన్నీ తను అధిగమించలేనప్పుడు డాక్టర్ సహకారం తీసుకోవాల్సి వస్తుంది. మన శరీరానికి వచ్చినట్లే మనసుకూ అనారోగ్యం కలుగుతుంది. ఒకప్పుడు మెంటల్ అనేవాళ్లుగానీ, ఇది మానసిక అనారోగ్యం. దాన్ని ఇప్పుడు అధిగమించడం తేలిక. మీకు అలాంటి సమస్యలేమీ లేవు. మీకు ఎలాంటి సమస్య వచ్చినా కొన్నాళ్లు మాతోనే సంప్రదించి, కౌన్సెలింగ్ తీసుకోండి.

మీ ఇద్దరిలో ఎవరికి సమస్య వచ్చినా ఎదుటివారి వైపు నుంచి ఆలోచించండి. అవతల వ్యక్తి బాధ కనీసం అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. అప్పుడు సమస్య పరిష్కారం తేలికవుతుంది.

బాధ్యులు చెప్పిన దానికి ఇద్దరూ అంగీకరించి, రిజిష్టర్‌లో సంతకాలు చేశారు. ప్రస్తుతం ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్నారు.

- శాంతిశ్రీ

అదేమీ పరువు తక్కువ పనికాదు

భారతీయ సమాజంలో ఇంటి పనిలో భార్యకు సహాయపడటం పరువు తక్కువ పనిగా భావించే పురుషుల శాతం చాలా ఎక్కువ. మహిళలు వంట, పిల్లలను కనిచ్చే యంత్రంగా మాత్రమే పనికివస్తారనే దురభిప్రాయం కొంతమందిలో ఉంది. ఇంటి పనిలో భార్యలకు సహాయపడేవారిని ఎద్దేవా చేయడం కూడా మనం తరచూ చూస్తూనే ఉంటాం. అయితే భార్యాభర్తలనేవారు సంసారం అనే ఎద్దులబండికి కట్టబడిన



జోడెద్దులువంటివారనే విషయాన్ని విస్మరిస్తున్నారు. రెండు ఎద్దులు సక్రమంగా నడిచినపుడే బండి ప్రయాణం సజావుగా సాగుతుంది. అదేవిధంగా భార్యాభర్తలు ఇరువురూ పరస్పరం ఇంటి పనిలో సహరించుకొంటే ఆ ఇల్లు నందనవనం అవుతుంది. ఈ విషయాన్ని గుర్తించి ఆచరణలో చేసి చూపుతున్న ఘనత స్లోవేనియా దేశంలోని పురుషులకే దక్కుతుంది. ఇంటి పనిలో భార్యలకు సహకరిస్తున్న భర్తలు అనే అంశంపై గతంలో ఐక్యరాజ్య సమితికి చెందిన 'ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్' అనే సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో సర్వే నిర్వహించింది. ఈ సర్వేలో స్లోవేనియా దేశంలోని పురుషులు ఇంటి పనిలో తమ భార్యలకు రోజుకు సగటున 114 నిమిషాలు సహాయపడుతున్నారట. డెన్మార్క్‌లోని పురుషులు 107 నిమిషాలు, ఫ్రాన్స్‌లోని పురుషులు 98 నిమిషాలు, ఆస్ట్రియాలోని పురుషులు 93 నిమిషాలు తమ భార్యలకు సగటున రోజూ సహాయపడుతున్నారు. మన దేశంలో మాత్రం రోజుకు సగటున 19 నిమిషాలు మాత్రమే భర్తలు తమ భార్యలకు ఇంటిపనిలో సహాయపడుతున్నారని తేలింది. మనదేశంలో గత రెండు దశాబ్దాల కాలంగా మహిళలు ఉద్యోగాలు చేయడం ఎక్కువ అయింది. సాఫ్ట్‌వేర్‌రంగం బాగా అభివృద్ధి చెందిన తరువాత, ఉద్యోగాలు చేసే మహిళల శాతం బాగా పెరిగింది. దీంతో భర్తలు తప్పనిసరి పరిస్థితులలో కొంతవరకు తమ భార్యలకు ఇంటి పనిలో సహకరించాల్సిన అనివార్య పరిస్థితులు ఏర్పడ్డాయి. మన దేశంలో మహిళా ఉద్యోగినులు తీవ్రమైన వత్తిడికి గురవుతూ పలు ఆరోగ్య సమస్యలను కొనితెచ్చుకొంటున్నారు. ఇంటి పని సకాలంలో పూర్తిచేసుకొని తమ విధులకు హాజరవ్వడం వారికి తలకు మించిన భారంగా మారింది. మహిళలు ఉద్యోగాలు చేయని కాలంలో అయితే పురుషులు, మహిళలకు సహాయపడే సమయం ఇంకెంత దారుణంగా ఉండేదో ఊహించుకోవచ్చు. ఇకనైనా మన దేశంలోని పురుషులు అనవసర భేషజాలను విడనాడి స్లోవేనియా పురుషులను ఆదర్శంగా తీసుకొంటే చాలా బాగుంటుంది. మహిళా ఉద్యోగులు చాలావరకు వత్తిడికి దూరమై, ప్రశాంత జీవనం గడుపుతారు. వారు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలు కూడా చాలావరకు తగ్గిపోతాయి. ★

ఆకట్టుకునే.. ఇంటి అలంకరణ



చూడటానికి అందంగా, చూడముచ్చటగా కనిపించే బొమ్మలు లేదా సేకరించిన విలువైన వస్తువులను లివింగ్‌రూమ్ షెల్ఫ్‌లలో అమర్చితే ఆకర్షణీయంగా కనిపిస్తాయి. అంతేకాదు, ఇలాంటి వాటిని టీ పాయ్ పైన ఆకట్టుకునే విధంగా డిస్‌ప్లే చేస్తే బాగుంటాయి. అలా చేస్తే, ఆవస్తువులను చూసిన వారు మిమ్మల్ని అభినందించకుండా ఉండలేరు. అలాగే, పుస్తకాలులేని ఇల్లు ఉండదు. కాబట్టి వాటిని అందమైన బుక్‌షెల్ఫ్‌లో ఆకట్టుకునే పుస్తకాలతో నింపేయవచ్చు. చూడగానే గ్రంథాలయాన్ని తలపించేలా ఉండాలి మరి. బుక్‌షెల్ఫ్‌కి మంచి ఉడెన్ కలర్ వేస్తే చాలా బావుంటుంది. గోడలకు అందమైన పెయింటింగ్స్ లేదా మనకు నచ్చిన ఫోటోలను ఆర్ట్ గాలరీ మాదిరిగా గోడపై చేర్చారంటే చాలా ఆకర్షణగా ఉంటుంది. అన్నీ ఒకేలా పెట్టకుండా కొంచెం క్రాస్‌గా పెట్టడం ద్వారా మరింత అందంగా కనిపిస్తుంది. ఇంట్లోని సోఫాను అలా వదిలేయకుండా, ఒక మంచి రంగున్న లేదా మంచి డిజైన ఉన్న తలగడ పెడితే చాలా బావుంటుంది. చూడగానే ఆకట్టుకుంటుంది. సోఫాలకు విడిగా తలగడలు మార్కెట్‌లో దొరుకుతున్నాయి. వాటిని పెడితే ఇంకా బావుంటుంది. స్ట్రాస్ తో తయారు చేసిన బుట్టలు లేదా ఐస్‌క్రీమ్ పుల్లలతో చేసిన బుట్టలు టీ పాయ్ మీద పెట్టి, అందులో ఆర్టిఫిషియల్ పూలమొక్కలు పెడితే చాలా అందంగా ఉంటుంది. ★

జీవన సౌరభం

దురదృష్టమని దిగులుపడేకంటే.. స్వయంకృషిని, కష్టాన్ని నమ్ముకొని పైకెదగాలి.

మీ కోసం



కొబ్బరిచిప్ప నుంచి కొబ్బరిని వేరు చేయాలంటే చిప్పల్ని ఓ పది నిమిషాలు వేడినీళ్ళలో ఉంచండి.

బ్రేక్ ఫాస్ట్ ఇలా!



ప్రతిరోజు మనం ఉదయంపూట తినే ఆహారమే రోజంతా మనలో ఉత్సాహాన్ని నింపుతుంది. కనుక తప్పనిసరిగా బ్రేక్‌ఫాస్ట్ తీసుకోవాలి. అయితే ఉదయం పూట కేకులు తినడం సరికాదు. చక్కెర, వెన్నతో చేసినవి పొద్దున్నే తినడం వల్ల శరీరంలోకి ఎక్కువ క్యాలరీలు చేరతాయి. వేయించిన బంగాళాదుంపల్నీ అల్పాహారంలో తీసుకుంటే అరుగుదల అంతగా ఉండదు. పొట్టలో ఇబ్బందితో అసౌకర్యానికి గురవుతారు. ప్రయాణ సమయాల్లో ఫ్రెంచ్ ఫ్రైస్, బంగాళాదుంపలతో చేసిన స్నాక్స్‌కి దూరంగా ఉండటం ఉత్తమం. త్వరగా తయారవుతాయని నూడుల్స్‌ను ఆల్పాహారంగా తినకూడదు. వాటిలో సోడియం అధికం. ఇలాంటి మసాలా కలగలిసిన వాటిని తీసుకుంటే ఎండలోకి వెళ్ళినప్పుడు వికారంగా ఉంటుంది. సమయం చూసుకొని తేలిగ్గా అరిగే మామూలు అల్పాహారం తీసుకోవడం మంచిది. కొందరు రాత్రి మిగిలిన చికెన్ వంటకాలను మర్నాడు వేడి చేసి తింటారు. ఇలా చేస్తే హాని చేసే ట్రాన్స్ ఫ్యాట్లు శరీరంలోకి చేరిపోతాయి. ముందురోజు చేసిన జ్యూస్‌లను మర్నాడు ఉదయం తాగడంవల్ల పొట్టలో బ్యాక్టీరియా చేరుతుంది. పోషకాలు సరిగా అందవు. ఇక ఉదయం పూట గుడ్డు తినడం మంచిదే. అయితే నూనెలో ఫ్రై చేయకుండా తినవచ్చు. మధ్యాహ్నం, రాత్రిపూట అలా తీసుకోవడం బాగానే ఉంటుంది. ఉదయం తీసుకోవడం వల్ల అధిక శాతం కొవ్వు శరీరానికి చేరుతుంది. అందుకే ఉడికించిన గుడ్డు తీసుకొంటే చాలు. ★

ఆమెకు.. అనుమానం ఎక్కువ!

సైకాలజీ

మా పెళ్లయి 25 సంవత్సరాలు అవుతుంది. నేను మెకానిక్‌గా పని చేస్తాను. ఇద్దరు మగపిల్లలు. పెద్దోడు పెళ్లీడుకు వచ్చాడు. ఇప్పటికీ నా భార్య నేను ఎవరితో మాట్లాడినా వారితో సంబంధం అంటగట్టి అనుమానిస్తోంది. ఆమె మాటలు భరించలేకపోతున్నాను. బూతులు తిడుతుంది. నేను, పిల్లలు ఆమె మాటలవల్ల చాలా బాధ పడుతున్నాం. ఆమె ఎందుకలా ప్రవర్తిస్తుందో అర్థం కావడం లేదు. ఆమెను ఎలా మార్చుకోవాలో అర్థంకాక తాగుడుకు అలవాటు పడ్డాను. నా సమస్యకు పరిష్కారం చెప్పండి?

- ఓ సోదరుడు



మీ భార్య సమస్యాత్మకంగా ప్రవర్తిస్తున్నారు కదా అని ఆమె పద్ధతి మార్చడం చేతకాక మీరు తాగుడు అనే ఊబిలో కూరుకుపోయారు. ఒక సమస్య మీద నుంచి దృష్టి మళ్లించుకోవడానికి మరో సమస్యను సృష్టించుకున్నారను. మీరు కొత్తగా తెచ్చుకున్న సమస్య ఆమె ధోరణిని తగ్గించదు సరికదా ఆమె ఆలోచనలకి మరింత బలాన్ని ఇస్తుంది. ఆమె మిమ్మల్ని పదేపదే ఎందుకలా అనుమానిస్తూ మాట్లాడుతుందో, ఆ అనుమానం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవడం అవసరం. కేవలం అపోహతోనే తను అలా అనుమానిస్తూ మాట్లాడితే, మీరు దాపరికం లేకుండా పారదర్శకంగా మాట్లాడి ఆమెలోని అనుమానాన్ని పోగొట్టగలిగేవారు. అలాంటి ప్రయత్నాలు మీరెంతవరకు చేశారో తెలియదు. మరొకస్థాయిలో అనుమానం ఆమె వ్యక్తిత్వంలో భాగం అయితే, ఆ వ్యక్తిత్వ ధోరణి మార్చుకోవడానికి మీరు ప్రేమ పూర్వకంగానూ, నిపుణుల సహాయంతోనూ ఆ ప్రయత్నం చెయ్యవచ్చు. అయితే అనుమానం తీవ్రస్థాయిలో ఉండి, దాని నియంత్రణ దాటిపోయి, ఆధారంలేని భ్రమలను నిజంగా భావిస్తుంటే అప్పుడు కుటుంబ సభ్యులందరూ కలిసి మాట్లాడుకోవాలి. ఆమె ఆలోచనల నిజనిజాలు విశ్లేషించుకుని, అవి పూర్తిగా నిరాధారం, అవాస్తవికం అని అందరూ నమ్ముతుంటే తగిన వైద్యనిపుణుల ద్వారా చికిత్స అందించవలసి ఉంటుంది. కాబట్టి అటు ఆమె అనుమానధోరణి, ఇటు మీ ప్రవర్తన ధోరణి రెండువైపులా ఎవరికి వారు విశ్లేషించుకుని ఇద్దరూ చేసుకోవాల్సిన మార్పుల గురించి ఆలోచించుకోండి. ఎంత ప్రయత్నం చేసినా మార్పు రాకపోతే అటు ఆమె అనుమాన ధోరణికి, ఇటు మీ తాగుడు వ్యసనానికి కూడా తగిన సహకారం మానసిక నిపుణుల సహాయంతో పొంది, మీ ప్రవర్తనలు మార్చుకోడానికి ప్రయత్నం చేయండి. అంతేగానీ ఆమె అనుమానించారని మీరు తాగుడుకు బానిసై మీ తాగుడును బట్టి, తన అనుమానాలు నిజమేనని ఆమె నిర్ధారించుకునే ప్రమాదం ఉంది. అలా ఇద్దరూ అవతలి వారి ధోరణిని పరోక్షంగా బలపరిచే విషవలయంలో చిక్కుకుపోకండి. ఇద్దరూ కలిసి మానసిక నిపుణులను సంప్రదించండి. ★




డా. పద్మజ, సైకాలజిస్టు

సెన్సెక్స్ ⬆ 323
34,142

నిఫ్టీ ⬆ 108
10,491

రూపాయి ⬆ 33 పై॥
అమెరికా డాలరుకు రూ.
64.71



ఎన్‌బిసిసికి ఆర్డర్..

ఇండియన్ ఎకనామిక్ సర్వీస్ (ఐఇఎస్) అధికారుల కోసం ఢిల్లీలో ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నారు. ఆర్థిక వ్యవహారాల శాఖ ఈ నిర్మాణ పనుల ఆర్డర్‌ను ఎన్‌బిసిసికి అప్పజెప్పింది. ఈ ప్రాజెక్టు ఒప్పందంలో మంత్రి అరుణ్ జైట్లీ, ఎన్‌బిసిసి సిఎండి అనూప్ కుమార్, ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణ్యన్ తదితరులు పాల్గొన్నారు.



అతిపెద్ద 'ఉడ్ ట్రేడ్' ఫెయిర్

బెంగళూరులో అతిపెద్ద ఉడ్ వర్కింగ్, ఫర్నీచర్ తయారీ రంగానికి సంబంధించిన అతిపెద్ద ట్రేడ్ ఫెయిర్ 'ఇండియా ఉడ్ 2018'ను ఏర్పాటు చేస్తున్నారు. మార్చి 8-12 వరకు జరుగనున్న ఈ ట్రేడ్‌కు 40 దేశాలకు చెందిన 850 మంది ప్రదర్శకులు పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. కొత్తగా 200కు పైగా ఉత్పత్తుల ఆవిష్కరణ ఉండబోతుందన్నారు

ఎయిర్‌సెల్ సేవల నిలిపివేత

న్యూఢిల్లీ: వచ్చే నెల 30వ తేది నుంచి ఎయిర్‌సెల్ కంపెనీ ఆరు టెలికం సర్కిళ్లలో తన కార్యకలాపాలను నిలిపివేయనుంది. గుజరాత్, మధ్య ప్రదేశ్, మహారాష్ట్ర, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్ టెలికం సర్కిళ్లలో జనవరి 30 నుంచి మొబైల్ సర్వీసులను నిలిపేస్తామని ఎయిర్‌సెల్ వెల్లడించింది. తీవ్రమైన పోటీ నెలకొన్న ప్రస్తుత తరుణంలో వ్యాపారం నిర్వహించలేమంటూ స్పష్టం చేసింది. ఈ కంపెనీకి ఆరు సర్కిళ్లలో 40 లక్షల మంది ఖాతాదారులున్నారు. అందరికీ యూనిక్ పోర్టింగ్ కోడ్స్‌ను పంపించామని వివరించింది. కాగా వేరే నెట్‌వర్క్‌ను మారాలనుకుంటున్న ఎయిర్‌సెల్ వినియోగదారుల అభ్యర్థనలను వచ్చే ఏడాది మార్చి 10 వరకూ అంగీకరించాలని ఇతర టెల్కోలను ట్రాయ్ ఆదేశించింది.

రోడ్డున పడ్డ 5000 మంది

టెలికం కంపెనీ ఎయిర్‌సెల్ ఉద్యోగులకు చాలా కష్టకాలమే వచ్చింది. ఆ కంపెనీ నిర్వహణ క్లిష్టతరంగా మారడంతో దాదాపు 5000 మంది సిబ్బంది పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. రిలయన్స్ జియో రాకతో టెలికం పరిశ్రమలో నెలకొన్న పోటీ వల్ల ఈ రంగం తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటుంది. ముఖ్యంగా ఎయిర్‌సెల్ లాంటి చిన్న టెల్కోలకు నిధుల సమీకరణ కష్టంగా మారడంతో సంక్షోభంలో చిక్కుకున్నాయి. దీంతో వేరే ఉద్యోగాలు వెతుక్కోవాలని ఆ కంపెనీ సిబ్బందికి సమాచారమిచ్చింది. కాని బయట టెలికం రంగంలో ఎలాంటి ఉద్యోగాలు లేకపోవడంతో వారి పరిస్థితి దీనంగా తయారయ్యింది.

అర్థోపెడిక్ ఉత్పత్తుల్లోకి మైక్రోపోర్ట్



ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

మైక్రోపోర్ట్ భారత మోకీళ్ళ ఇంప్లాంట్ ఉత్పత్తుల మార్కెట్లోకి ప్రవేశించింది. తాము ఇప్పటికే దేశంలో స్టెంట్‌లను విక్రయిస్తున్నామని మైక్రోపోర్టు ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ రియాజ్ దేశాయ్ తెలిపారు. శుక్రవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ గతేడాది భారత మార్కెట్లోకి స్టెంట్‌లను విడుదల చేశామని, కొత్తగా మోకిళ్ల ఇంప్లాంట్‌లను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. వీటిని అమెరికా నుంచి దిగుమతి చేసుకుంటున్నామని చెప్పారు. భారత్‌లో రూ.40-80 కోట్లతో ప్లాంట్ నెలకొల్పే యోచనలో ఉన్నామన్నారు. గతేడాది రూ.30 కోట్ల టర్నోవర్ సాధించామని, ఈ ఏడాది రూ.60 కోట్లు అంచనా వేస్తున్నామని తెలిపారు. దేశంలో ఇప్పటి వరకు సన్‌షైన్, కిమ్స్, కేర్, ఆపోలో తదితర 55 వరకు హాస్పిటళ్లతో ఒప్పందం చేసుకున్నామన్నారు.

పిఎన్‌బి స్కాంపై పిడబ్ల్యుసి విచారణ..!

- నీరవ్ బ్యాలెన్స్ షీట్ల పరిశీలన
- ఆస్తులు, రికవరీలపై ఆడిటింగ్
- బోగసు ఆస్తుల గుర్తింపు
- తదితర బాధ్యతల అప్పగింత



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంకు (పిఎన్‌బి)లో చోటు చేసుకున్న దాదాపు రూ.11,500 కోట్ల కుంభకోణంపై ఆడిటర్ పిడబ్ల్యుసి విచారణ జరపనుందని సమాచారం. ఆర్థిక నేరగాళ్ల నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీ చేసిన ఘరాన మోసంపై పిడబ్ల్యుసి అధారాలు సేకరించి ఇవ్వనుందని ఆ వర్గాలు తెలిపాయి. ప్రధానంగా అంతర్జాతీయ ఆర్థిక నేరాలపై పిడబ్ల్యుసి విచారణ చేస్తుంది. నీరవ్ మోసాలపై పిఎన్‌బి 15 పాయింట్లతో కూడిన డాక్యుమెంట్ పనిని ఫిబ్రవరి 21న పిడబ్ల్యుసికి అందజేసింది. ఇందులో ముఖ్యంగా నీరవ్ మోడీకి బ్యాంకర్లు ఎల్ఒయు ఎలా అందజేశారు. దీన్ని మోడీ ఎలా తప్పుడుగా వాడుకున్నాడు అనే దానిపై విచారణ చేయనుంది. అదే విధంగా మోడీ కంపెనీ బ్యాలెన్స్ షీట్స్, రికవరీ అప్పులు, ఆయన ఆస్తులపై పిడబ్ల్యుసి ఆడిటింగ్ చేయనుంది. ఈ విషయమై పిఎన్‌బి, పిడబ్ల్యుసిలు స్పందించలేదు.

నష్టంపై అంచనా..


ఢిల్లీ కేంద్రంగా పని చేస్తున్న పిడబ్ల్యుసి యూనిట్‌కు దినేష్ ఆనంద్ హెడ్‌గా ఉన్నారు. ఈ సంస్థ మోడీ గ్రూపునకు చెందిన ఐదు సంస్థలు ఫైర్‌స్టార్ డైమాండ్స్, ఫైర్‌స్టార్ ఇంటర్నేషనల్, సోలార్ ఎక్స్‌పోర్టు, స్టెల్లర్ డైమాండ్, డైమాండ్‌ఆర్ హజ్‌లపై విచారణ చేయనుంది. 2011 నుంచి ఆ కంపెనీ ఆర్థిక లావాదేవీలను విశ్లేషించనుంది. ఆ కంపెనీ బ్యాలెన్స్ షీట్లలో చూపని ఆస్తులు, బోగస్ లావాదేవీలను గుర్తించడం చేయనుంది. మోడీ వల్ల బ్యాంకుకు ఎంత నష్టం జరిగిందో అంచనా వేయనుంది. ఈ సమాచారాన్ని సిబిఐతోనూ ఆ సంస్థ పంచుకోవడం ద్వారా మోడీ, ఆయన సంస్థలు, అనుచరులపై కోర్టులో వ్యతిరేకంగా ఆధారాలు ప్రవేశపెట్టనుంది. అదే విధంగా అంతర్జాతీయ బ్యాంకింగ్ విధా నంలో ఎలా బలోపేతం కావాలో పిఎన్‌బికి పిడబ్ల్యుసి సూచించనుంది.

1,415 సిబ్బంది బదిలీ..

పిఎన్‌బిని నీరవ్ నిండా ముంచడంతో ఆ బ్యాంకు నష్ట నివారణ చర్యలు చేపట్టింది. దీర్ఘకాలంగా ఒకే దగ్గర సిబ్బంది ఉండటం ద్వారా అక్రమాలు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా తాజా కుంభకోణం నేపథ్యంలో ఆ బ్యాంకు 1,415 మందిని బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకుంది. 257 మంది సబ్ స్టాఫ్, 437 మంది క్లర్కులు, 721 మంది అధికారులను రొటేషనల్ ట్రాన్స్‌ఫర్ పాలసీలో భాగంగా ఫిబ్రవరి 19న సిబ్బందిని ట్రాన్స్‌ఫర్ చేసినట్లు తెలిపింది. కాగా 18వేల మందిని బదిలీ చేసిందని వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని పిఎన్‌బి స్పష్టతనిచ్చింది. దీర్ఘకాలంగా ఒకే చోట పని చేస్తున్న సిబ్బందిని బదిలీ చేయాలని గత వారం సెంట్రల్ విజిలెన్స్ శాఖ పిఎన్‌బికి ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే.

ప్రియాంక తెగదెంపులు..

బడా మోసగాడు నీరవ్ మోడీ జువెల్లరీలకు బ్రాండు అంబాసిడరీగా ఉన్న బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా ఆ కంపెనీతో తెగదెంపులు చేసుకున్నారు. పిఎన్‌బికి నీరవ్ వేల కోట్లు ఎగనామం పెట్టి విదేశాలకు పరిపోయిన విషయం తెలిసింది. దీంతో ఆయన ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సిబిఐలు సీజ్ చేయడంతో ప్రియాంక ఈ నిర్ణయం తీసుకు న్నారు. నీరవ్‌తో కాంట్రాక్ట్‌ను రద్దు చేసుకున్నట్లు ప్రియాంక అధికార ప్రతినిధి వెల్లడించారు. దీనిపై కొన్ని రోజుల క్రితమే ఆమె న్యాయ నిపుణులు సలహా తీసుకున్నా రన్నారు. గతం లో ప్రియాంక చోప్రా హీరో సిద్ధార్థ్ మల్హోత్రాతో కలిసి నీరవ్ మోడీకి చెందిన జువెల్లరీ కంపెనీ ప్రకటనలో నటించారు. ఇందుకు సంబంధించి పారితోషకాన్ని సదరు కంపెనీ పూర్తిగా చెల్లించలేదని కూడా ప్రియాంక ఆరోపించారు.



'లేడీ లెజెండ్స్'కు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళ ఔత్సాహికవేత్తలను గుర్తించి వారిని సత్కరించనున్నట్లు రాజా రతన్ హెల్త్ కేర్ ఎడ్యూకేషనల్ ట్రస్టు హెడ్ సత్యా యెర్రా, ట్యూటర్స్ ఫ్రైడ్ ఇండియా హెడ్ డాక్టర్ అంకమ్ తెలిపారు.
శుక్రవారం హైదరాబాద్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ ఇందుకోసం విశిష్టత కలిగిన మహిళల నుంచి మార్చి 3 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నామన్నారు. ఏప్రిల్ 22న హైదరాబాద్‌లో అవార్డుల ప్రదానోత్సవం ఉంటుందన్నారు. ఇప్పటికే తాము 122 మంది విశిష్ట మహిళలను గుర్తించామని చెప్పారు.

హాస్పిటల్ ఉపకరణాల ప్రదర్శన

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

మెడ్‌ఎక్స్‌పర్ట్ బిజినెస్ కన్సల్టెంట్స్ అతిపెద్ద బి2బి హాస్పిటల్ ఉపకరణాల ప్రదర్శన 'మెడికాల్'ను శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభించింది. ఈ నెల 25 వరకు ఈ ప్రదర్శన జరుగనుందని మెడ్‌ఎక్స్‌పర్ట్ సిఇఒ డాక్టర్ మనివణ్ణన్ తెలిపా రు. వివిధ తయారీ సంస్థలు ఇక్కడ 5000కు పైగా ఉత్పాదనలను ప్రదర్శించా యన్నారు.

సర్జికల్ కాటన్ మొదలుకొని అధునాతన ఇమేజింగ్ ఉపకరణాలు, సర్జికల్ టూల్స్ వరకు హాస్పిటల్‌కు సంబంధించిన అన్ని అవసరాలపై ఈ ట్రేడ్ ఫెయిర్ దృష్టి సారించిందని తెలిపారు. ఆసుపత్రుల యాజమాన్యాలు ఇక్కడ సులభంగా తమకు కావాల్సిన ఉత్పత్తుల కొనుగోలుకు సంప్రదింపులు చేసుకోవచ్చన్నారు.

డిఎస్సీ, ఆర్ఆర్‌బి, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

మానవుడి స్థిర జీవనానికి దారితీసిన సంఘటన?

విజేత



టి.ఎం.దాస్
ఎపి మోడల్ స్కూల్ & జూనియర్ కళాశాల
మహానంది,
సెల్ : 90002 50127

1. యంత్రాలు నడపడానికి కావాల్సిన ఇంధన వనరు?
ఎ. పెట్రోల్ బి. డీజిల్
సి. విద్యుత్ డి. ఏదీకాదు

2. భారతదేశంలో అల్యూమినియం శుద్ధి కర్మాగారాల సంఖ్య?
ఎ. ఐదు బి. ఆరు
సి. ఏడు డి. ఎనిమిది

3. జనపనార వస్తువులు ఉత్పత్తిలో.. ఏ దేశానిది మొదటి స్థానం?
ఎ. బంగ్లాదేశ్ బి. బర్మా
సి. భారత్ డి. ఇటలీ

4. సహకార రంగంలో నిర్మించిన ఎరువుల కర్మాగారం ఎక్కడ ఉంది?
ఎ. గుజరాత్‌లోని హజీరా
బి. మహరాష్ట్రలోని ముంబాయి
సి. ఢిల్లీ
డి. హైదరాబాద్

5. విదేశీ మారక ద్రవ్య ఆదాయంలో వస్త్ర పరిశ్రమ నుంచి వచ్చే ఆదాయం శాతం?
ఎ. 24 % బి. 24.6 %
సి. 27 % డి. 28 %

6. మొదటి జనపనార మిల్లు స్థాపించిన ప్రదేశం?
ఎ. కాన్పూర్ బి. రిష్రా
సి. ముంబాయి డి. ఢిల్లీ

7. ఈ సంవత్సరం తరువాత దేశంలో పారిశ్రామిక ప్రగతికి అనేక చర్యలు తీసుకున్నారు?
ఎ. 1940 బి. 1945
సి. 1947 డి. 1950

8. మొదటి సిమెంట్ కర్మాగారాన్ని చెన్నైలో నిర్మించిన సంవత్సరం?
ఎ. 1900 బి. 1902
సి. 1904 డి. 1906

9. భారతదేశం ఈ దేశానికి నూలు ఎగుమతి చేస్తుంది?
ఎ. జపాన్ బి. జర్మనీ
సి. ఇటలీ డి. అమెరికా

10. ఉక్కు ఉత్పత్తిలో ప్రపంచంలోని ముడి ఉక్కు ఉత్పత్తిదారులలో భారతదేశం స్థానం ఎంత?
ఎ. ఎనిమిది బి. తొమ్మిది
సి. పది డి. 11

11. బందరు కాలువకు నీరు సరఫరా చేసే రిజర్వాయర్?
ఎ. నాగార్జున సాగర్ బి. శ్రీశైలం
సి. పులిచింతల డి. ప్రకాశం బ్యారేజ్

12. ప్రకాశం బ్యారేజ్ నిర్మించిన సంవత్సరం?
ఎ. 1851 బి. 1853
సి. 1855 డి. 1860

13. విజయవాడ కృష్ణానదికి ఈ ఒడ్డున ఉన్నది?
ఎ. తూర్పు బి. పశ్చిమ
సి. ఉత్తర డి. దక్షిణ

14. స్వయం మట్టి మార్పిడి విధానాన్ని అనుసరించే నేలలు?
ఎ. ఎర్రనేలలు బి. ఒండ్రునేలలు
సి. నల్లనేలలు డి. ఇసుకనేలలు

15. ఒండ్రు నేలలు వీటి వల్ల ఏర్పడతాయి?
ఎ. నదులు బి. గాలి
సి. అగ్నిపర్వత లావా డి. రూపాంతర శిలలు

16. ఈ కింది వానిలో నైరుతీ ఋతుపవన కాలాన్ని గుర్తించండి?
ఎ. నవంబర్-జనవరి బి. జూన్-అక్టోబర్
సి. ఆగస్టు-డిసెంబర్ డి. మే-ఆగస్టు

17. కృష్ణానదికి.. పెద్దస్థాయిలో వరదలు వచ్చిన సంవత్సరం?
ఎ. 1997 బి. 2006
సి. 2009 డి. పైవన్నీ

18. శీతాకాల పంట కాలాన్ని ఈ విధంగా వ్యవహిస్తారు.
ఎ. సాల్వ బి. దాల్వా
సి. ఖరీఫ్ డి. జయాద్

19. స్వర్ణ, 2716, యంటియు ఇవన్నీ ఈ పంటకు సంబంధించిన వంగడాలు.
ఎ. గోధుమ బి. జొన్న
సి. మొక్కజొన్న డి. వరి

20. ఈ కింది వానిలో అత్యంత దీర్ఘకాల పంట?
ఎ. వరి బి. చెరకు
సి. మొక్కజొన్న డి. అరటి

21. ప్రకాశం బ్యారేజ్ ఎక్కడ ఉంది?
ఎ. రాజమండ్రి బి. విజయవాడ
సి. బందరు డి. ఉయ్యూరు

22. బాగా చలిగా ఉండి, మంచు కురిసే ప్రాంతాలలో ఈ చెట్లు పెరుగుతాయి?
ఎ. వెదురు బి. దేవదారు
సి. మద్ది, టేకు డి. తుమ్మ

23. కేరళ, అండమాన్‌లలో ఏ రకమైన అడవులు ఉన్నాయి?
ఎ. సతత హరిత బి. ఆకురాల్చే
సి. ముళ్ల డి. మడ

24. మడ అడవులు ఏ ప్రాంతంలో ఎక్కువ ఉన్నాయి?
ఎ. సముద్ర తీర బి. ఎడారులు
సి. పీఠభూములు డి. కొండలున్న

25. అడవుల రక్షణ, పునరుద్ధరణ, అభివృద్ధిలో గిరిజన ప్రజలను భాగస్వామ్యం చేయడం ప్రధాన కర్తవ్యంగా గుర్తించిన జాతీయ అటవీ విధానం?
ఎ. 1864 బి. 1968
సి. 1878 డి. 1940

26. అడవుల హక్కుల చట్టం ఈ సంవత్సరంలో చేశారు?
ఎ. 2004 బి. 2000
సి. 2006 డి. 2003

27. చాలా తక్కువ వర్షపాతం, అధిక ఉష్ణోగ్రతలు ఉండే పొడి ప్రాంతంలో ఈ రకమైన అడవులు పెరుగుతాయి?
ఎ. ఆకురాల్చే అడవులు
బి. సతత హరిత అడవులు
సి. ముళ్ల అడవులు
డి. మడ అడవులు

28. తెలంగాణలోని ఉత్తర జిల్లాల్లో ఈ తెగ వారు స్థిర వ్యవసాయం చేసేవారు?
ఎ. చెంచులు
బి. కొండరెడ్లు
సి. బంజారులు
డి. గోండులు

29. ఈ కింది ఉన్న ఏ ప్రాంతంలో అడవులు పెరగడానికి అనుకూల పరిస్థితులు విస్తృతంగా ఉన్నాయి?
ఎ. ఆర్కిటెక్ ప్రాంతం
బి. ఎడారులు
సి. ఇసుకతో కూడిన తీరప్రాంతం
డి. భూమధ్యరేఖ ప్రాంతం

30. గిరిజనులకు అడవి ప్రాంతంపై వారికిగల హక్కులను పునరుద్ధరించిన అటవీ హక్కుల చట్టం ఎప్పుడు రూపొందించారు?
ఎ. 1920 బి. 1988
సి. 2006 డి. 2009

31. రాష్ట్ర భూభాగంలో అడవుల శాతం...?
ఎ. 26% బి. 23%
సి. 15% డి. 18%

32. మానవుడి స్థిర జీవనానికి దారితీసిన సంఘటన?
ఎ. నిప్పును కనుగొనడం
బి. చక్రాన్ని కనుగొనడం
సి. వ్యవసాయం ప్రారంభించడం
డి. ఆయుధాల తయారీ

33. ఈ కింది వానిలో మొదటిసారి వ్యవసాయం చేసిన ప్రాచీన స్థావరం?
ఎ. నాగార్జున కొండ బి. బీహార్
సి. బెలూచిస్థాన్ డి. కాశ్మీర్

34. శిలాయుగానికి చెందిన బూడిద కుప్పలు దీనికి చిహ్నాలు?
ఎ. పశుపోషణ బి. వ్యవసాయం
సి. ఆహార ధాన్యాల నిల్వ డి. వేట

35. ఆదిమ మానవుడు ఉపయోగించిన పురాతన రాతి గొడ్డలి ఇక్కడ లభించింది?
ఎ. చింతకుంట, కడప జిల్లా
బి. కామకూరు, నెల్లూరు జిల్లా
సి. బేతంచెర్ల, కర్నూలు జిల్లా
డి. పైవన్నీ

36. ఆది మానవుడు ఉపయోగించిన సూక్ష్మ రాతి పరికరాలు లభించిన గుడియం గుహలు ఈ రాష్ట్రంలో ఉన్నాయి?
ఎ. ఆంధ్రప్రదేశ్ బి. కేరళ
సి. తమిళనాడు డి. కర్ణాటక

37. బేతంచర్ల, బనగానపల్లి గుహలు ఈ జిల్లాలో ఉన్నాయి?
ఎ. కర్నూలు బి. కడప
సి. చిత్తూరు డి. ప్రకాశం

38. కర్నూలు జిల్లా ముచ్చట్లు చింతమాను గవిగుహలో ఆదిమానవుడికి సంబంధించి లభించిన వస్తువులు ఏవి?
ఎ. రాతి పరికరాలు బి. ఎముకలతో చేసిన పరికరాలు
సి. కాంస్య పరికరాలు డి. మట్టితో చేసిన పరికరాలు

39. పూర్వ చారిత్రక యుగానికి చెందిన చిత్రకళ బయల్పడిన పాండవుల గుట్ట ఈ జిల్లాలో ఉంది?
ఎ. ఖమ్మం బి. వరంగల్
సి. ఆదిలాబాద్ డి. కరీంనగర్



40. మానవుడు పంటలు పండించడం సుమారు ఎన్ని సంవత్సరాల క్రితం ప్రారంభించాడు?
ఎ. 8000 సంవత్సరాల క్రితం
బి. 9000 సంవత్సరాల క్రితం
సి. 10,000 సంవత్సరాల క్రితం
డి. 12,000 సంవత్సరాల క్రితం

41. పురావస్తు శాస్త్రవేత్తలు ఈ కింది వాటిని అధ్యయనం చేస్తారు?
ఎ. పురాతన సామగ్రి
బి. ప్రాచీన ఎముకలు
సి. ప్రాచీన భవనాలు, పాత్రలు
డి. పైవన్నీ

42. భారతదేశంలో మొదటిసారిగా వ్యవసాయం చేసిన ప్రదేశం ఎక్కడ ఉంది?
ఎ. కాశ్మీర్ బి. బెలూచిస్థాన్
సి. బీహార్ డి. తెలంగాణ

43. బూడిద కుప్పలు ఆది మానవుడి ఈ కార్యకలాపాలకు చిహ్నం?
ఎ. పోడు వ్యవసాయం బి. పశుపోషణ
సి. ఆహారధాన్యాల నిల్వ డి. వేట

44. ఆదిమ మానవుడు బొమ్మలకు రంగులు వేయడానికి ఉపయోగించినవి?
ఎ. జంతువుల కొవ్వులు
బి. రాళ్లపొడి
సి. చెట్ల నుంచి తీసిన రసం
డి. పైవన్నీ

సమాధానాలు : 1.సి, 2.డి, 3.సి, 4.ఎ, 5.బి, 6.బి, 7.సి, 8.సి, 9.ఎ, 10.బి, 11.డి, 12.బి, 13.సి, 14.సి, 15.ఎ, 16.బి, 17.డి, 18.ఎ, 19.డి, 20.బి, 21.బి, 22.బి, 23.ఎ, 24.ఎ, 25.బి, 26.డి, 27.సి, 28.డి, 29.డి, 30.సి, 31.ఎ, 32.సి, 33.సి, 34.ఎ, 35.బి, 36.సి, 37.ఎ, 38.బి, 39.బి, 40.డి, 41.డి, 42.బి, 43.బి, 44.బి.

★

ఉద్యోగాలు

మంగళగిరి ఎయిమ్స్‌లో 52 ఖాళీలు

గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ **(ఏఐఐఎంఎస్: ఎయిమ్స్)**లో 52 ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతూ ప్రకటన వెలువడింది. ఈ నోటిఫికేషన్‌ను ఎయిమ్స్ మంగళగిరికి మానిటరింగ్ ఇన్‌స్టిట్యూట్‌గా వ్యవహరిస్తున్న పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (జిప్‌మెర్) విడుదల చేసింది.

పోస్టు-ఖాళీలు: ప్రొఫెసర్-8, అడిషనల్ ప్రొఫెసర్-4, అసోసియేట్ ప్రొఫెసర్-4, అసిస్టెంట్ ప్రొఫెసర్-16, సీనియర్ రెసిడెంట్-12, ట్యూటర్/ డిమానిస్ట్రేటర్-8.

వేతనశ్రేణి: ప్రొఫెసర్-రూ.1,59,100, అడిషనల్ ప్రొఫెసర్-రూ.1,39,600, అసోసియేట్ ప్రొఫెసర్-రూ.1,31,400, అసిస్టెంట్ ప్రొఫెసర్-రూ.1,01,500, సీనియర్ రెసిడెంట్-రూ.67,700, ట్యూటర్/ డిమానిస్ట్రేటర్-రూ.56,100. దీంతోపాటు నిబంధనల మేర ఇతర అలవెన్సులు.

విభాగాలు: అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, కమ్యూనిటీ మెడిసిన్, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫార్మకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ.

అర్హతలు: సంబంధిత పోస్టులు, విభాగాలను అనుసరించి ఎంబీబీఎస్/ ఎండీ/ ఎంసీహెచ్/ ఎంఎస్/ డీఎన్‌బీ/ ఎంఎస్సీ/ పీహెచ్‌డీ. అలాగే నిబంధనల మేర ఉద్యోగానుభవం తదితర అర్హతలు ఉండాలి.

వయసు: దరఖాస్తు గడువు ముగిసే నాటికి ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్‌కు 58 ఏళ్లు, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు 50 ఏళ్లు, సీనియర్ రెసిడెంట్‌కు 33 ఏళ్లు, ట్యూటర్/ డిమానిస్ట్రేటర్‌కు 35 ఏళ్లు మించకూడదు. రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ఎంపిక: సీనియర్ రెసిడెంట్, ట్యూటర్/ డిమానిస్ట్రేటర్ పోస్టులకు రాతపరీక్ష, ఇంటర్వ్యూ. మిగిలిన పోస్టులకు ఇంటర్వ్యూ.

దరఖాస్తు ఫీజు: జనరల్/ ఓబీసీ-రూ.500, ఎస్సీ/ ఎస్టీ-రూ.250. వికలాంగుల కేటగిరీకి ఫీజు లేదు.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు పత్రం డౌన్‌లోడ్ చేసుకొని అందులో వివరాలు నింపాలి. దానికి సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు, ఫీజు డీడీ జతచేసి కవరులో ఉంచి 'ది డైరెక్టర్, జిప్‌మెర్, అడ్మిన్-1 (రిక్రూట్‌మెంట్ సెల్), ధన్వంతరి నగర్, పుదుచ్చేరి-605006' చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.

దరఖాస్తు చేరడానికి చివరి తేదీ: మార్చి 16, 2018.

పూర్తి వివరాలు: వెబ్‌సైట్‌లో చూడొచ్చు

వెబ్‌సైట్: www.jipmer.puducherry.gov.in

భవన నిర్మాణ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎపి బిల్డింగ్ అండ్ అదర్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం కార్మికశాఖ కార్యాలయం వద్ద భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ధర్నాలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సిహెచ్.మజుందర్ మాట్లాడుతూ వెల్ఫేర్‌బోర్డులో నమోదు చేసుకున్న కార్మికులకు సంవత్సరాల తరబడి కార్డులు ఇవ్వడం లేదని విమర్శించారు. అనంతరం డిసిఎల్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సంఘం నగర కార్యదర్శి ఎస్‌డి.హుస్సేన్, సంఘం నగర అధ్యక్షులు వి.బాలాజీ పాల్గొన్నారు.



కాకినాడకు సమీపంలో సాల్ట్ కమీషన్ పరిధిలోని భూములను కబ్జాదారుల నుంచి కాపాడి, పేదలకు పంపిణీ చేయాలని సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కాకినాడ కమిటీ కార్యదర్శి కెఎస్.శ్రీనివాస్ శుక్రవారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలను సిఎం పంచుకోమన్నారంతే..

వైసిపి నేతలపై మంత్రి ఆదినారాయణరెడ్డి వివరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డితో సఖ్యతగా ఉంటూ సంక్షేమ పథకాలను పంచుకుని పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారని, అధికారుల సమక్షంలోనే బహిరంగంగా సిఎం చేసిన ఈ వ్యాఖ్యలు అభివృద్ధి కోసమేనని మంత్రి ఆదినారాయణరెడ్డి తెలిపారు. సచివాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కోటి రూపాయల పనులు వస్తే తన ప్రాంతంలో ఒక రూ.50 లక్షలు, రామసుబ్బారెడ్డి ప్రాంతంలో రూ.50 లక్షలు పనులు ముఖ్యమంత్రి చేయించుకోమన్నారని వివరణ ఇచ్చారు. ప్రతి శుక్రవారం తాను ప్రజల కోసం సెక్రటేరియట్‌లో విధుల్లో ఉంటే, జగన్, విజయసాయిరెడ్డి ఎసిబి కోర్టుకు హాజరవుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల నామినేషన్‌కు ముందే వారిపై కేసులన్నీ ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు బదిలీ అవుతాయని చెప్పారు. టివిని, పత్రికను అడ్డం పెట్టుకుని చేసే నీచ ఆరోపణలు మానుకోవాలన్నారు. తన కుటుంబానికి వైఎస్ కుటుంబానికి అసలు పోలికే లేదన్నారు. జగన్ సిఎం అయ్యేదీ లేదు, ప్రజలకు సహాయం చేసేదీ లేదని అన్నారు. పగలు పాదయాత్రలు చేస్తూ రాత్రిళ్లు చందాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక హోదా ముగిసిన అధ్యాయమని వెంకయ్యనాయుడు రాష్ట్ర పర్యటనలో భాగంగా గతంలో నాలుగుసార్లు చెప్పారని, హోదా ఏ రాష్ట్రానికి ఉండదని అన్నారని, అందుకే ప్యాకేజీ అడిగామన్నారు. ఇతర రాష్ట్రాలకు హోదా కొనసాగిస్తుండటంతో ఇప్పుడు మన రాష్ట్రానికి కావాలని కోరుతున్నట్లు చెప్పారు. ప్యాకేజీతో పాటు హోదా కూడా కావాలన్నారు.

భూముల్లాక్కుంటే ప్రతిఘటనే

- 'చింతలపూడి' భూసేకరణలో ప్రభుత్వ తీరు దుర్మార్గం
- 2013 చట్టప్రకారం పరిహారం ఇవ్వాల్సిందే
- రైతులపై అక్రమకేసులు ఎత్తివేయాలి
- త్వరలో అన్ని పార్టీలు, సంఘాలతో సదస్సు
- చింతలపూడి పర్యటనలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి. మధు

ప్రజాశక్తి-ఏలూరు ప్రతినిధి

'చింతలపూడి ఎత్తిపోతల పథకం భూసేకరణలో ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తోంది. ఒక పద్ధతి లేకుండా అతి తక్కువ పరిహారం ఇచ్చి రైతుల నుంచి భూములు లాక్కోవాలని చూస్తోంది. 2013 భూసేకరణ చట్టప్రకారం పరిహారం ఇవ్వాలి. బలవంతంగా భూములు లాక్కోవాలని చూస్తే ప్రతిఘటిస్తాం.. రైతులకు న్యాయం చేసే వరకూ పోరాటం ఆగదు' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గత రెండు రోజులుగా తమకు న్యాయం చేయాలని దీక్షలు చేస్తున్న చింతలపూడి ఎత్తిపోతల పథకంలో భూములు కోల్పోతున్న రైతులను మధు శుక్రవారం పరామర్శించి, సంఘీభావం తెలిపారు. అనంతరం రైతులతో కలిసి చింతలపూడి, ఎర్రగుంటపల్లి, కాంతంపాలెం, ప్రగడవరంల్లో పర్యటించారు. ఈ సందర్భంగా తమకు జరుగుతున్న అన్యాయాన్ని రైతులు మధుకు వివరించారు. ఎకరా రూ.40 లక్షల నుంచి రూ.50 లక్షలు ఖరీదు చేసే భూములకు ఒకచోట రూ.12.50 లక్షలు, మరోచోట రూ.16 లక్షలు ఇస్తామని ప్రభుత్వం చెబుతోందని, ఒప్పుకోకపోవడంతో బలవంతంగా తమ భూముల్లో కాలువ తవ్వకం పనులు సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అడిగితే అక్రమ కేసులు బనాయించి చిత్రహింసలకు గురిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం ఇచ్చిన తర్వాతే పనులు ప్రారంభించాలన్నారు. 'పట్టిసీమ' రైతులకు ఒక పరిహారం, 'చింతలపూడి' రైతులకు మరోవిధమైన పరిహారం ఏవిధంగా ఇస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతులపై అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు. రైతుల సమస్యలపై ముఖ్యమంత్రికి లేఖ రాస్తానని, కేసులపై డిజిపితో మాట్లాడతానని చెప్పారు. ఇదే విధంగా వ్యవహరిస్తే టిడిపికి జనం వచ్చే ఎన్నికల్లో సరైన బుద్ధిచెబుతారని హెచ్చరించారు. చింతలపూడి మండలంలో పెద్దఎత్తున భూములు లాక్కుంటూ స్థానికులకు తాగు, సాగు నీళ్లివ్వకుండా ప్రణాళిక రూపొందించడం దారుణమని మధు విమర్శించారు. పనులు ఆపకపోతే పెద్దఎత్తున ప్రతిఘటిస్తామన్నారు.



ప్రభుత్వం బలవంతంగా స్వాధీనం చేసుకుని కాలువ తవ్వకం చేపట్టిన రైతుల భూములను పరిశీలిస్తున్న మధు

అన్ని పక్షాలతో పెద్దఎత్తున సదస్సు

వైసిపి, కాంగ్రెస్, జనసేన, వామపక్ష పార్టీలు, రైతుసంఘాలన్నింటినీ కలుపుకుని చింతలపూడిలో పెద్దఎత్తున సదస్సు నిర్వహిస్తామని మధు చెప్పారు. 'చింతలపూడి' కాల్వ వెళ్తున్న ఏడు నియోజకవర్గాల్లోని రైతులనూ సమీకరిస్తామన్నారు. రైతు సంఘం రాష్ట్ర నాయకులు నర్సింగరావు మాట్లాడారు. ఈ పర్యటనలో ప్రాజెక్టు నిర్వాసితుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంతెన సీతారాం, సిపిఎం నాయకులు ఆర్‌విఎస్.సత్యనారాయణ, సిపిఐ నాయకులు సోమశేఖర్, రైతు నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, బసవరాజు, రాఘవులు, ఎర్రగుంటపల్లి సర్పంచి సాదరబోయిన వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోదా ఉద్యమంలో బాబు కోవర్టు: పద్మ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక హోదా ఉద్యమంలో కోవర్టుగా మారి, వెనుపోటు పొడిచేందుకు చంద్రబాబు నాయుడు కుయుక్తులు పనున్నతున్నారని వైసిపి అధికార ప్రతినిధి వాసిరెడ్డి పద్మ ఆరోపించారు. నాలుగేళ్లుగా హోదాపై రకరకాల బాష్యాలు చెప్పి, ఇప్పుడు హోదా అనకపోతే జనం తంతారని నంగనాచి మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె నాలుగేళ్లుగా హోదా, విభజన హామీలను సాధించకుండా..వక్రభాష్యాలు చెబుతూ ప్రజలను తప్పుదోవ పట్టించారని అన్నారు. గతంలో హోదా అంటేనే పాపం అన్నట్లుగా కేసులు పెట్టించిన చంద్రబాబు, ఇప్పుడు హోదా గురించి ఎలా మాట్లాడతారని ప్రశ్నించారు. జగన్‌కు సంబంధించిన కేసుల్లో మారిషస్‌కు చెందిన కంపెనీ ప్రధానికి, కేంద్ర మంత్రులకు నోటీసులు ఇచ్చిందంటూ టిడిపి నేతలు తప్పుడు ప్రచారం చేస్తున్నారన్నారు. అసలు అంతర్జాతీయంగా రాష్ట్ర పరువు తీసిందే చంద్రబాబు నాయుడేనన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, మంత్రులు అవినీతిని తట్టుకోలేక పోతున్నామని జపాన్‌కు చెందిన మాకీ కంపెనీ ఏకంగా ప్రధానికే ఫిర్యాదు చేసిందని గుర్తు చేశారు.

శ్రీవారి ట్రస్టులకు 16లక్షలు విరాళం

ప్రజాశక్తి-తిరుమల

తిరుమల తిరుపతి దేవస్థానం విరాళాల ట్రస్టుకు శుక్రవారం రూ.16లక్షలు విరాళంగా దాతలు సమర్పించారని ఆ విభాగం డిప్యూటీ ఈవో బాలాజీ వెల్లడించారు. అన్నప్రసాదం ట్రస్టుకు 14లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు 1లక్ష, ప్రాణదానం ట్రస్టుకు 1.5లక్షలు విరాళంగా అందించారు. దాతలకు టిటిడి తరపున కృతజ్ఞతలు తెలిపి దర్శనం, బస ఏర్పాట్లను చేశామన్నారు.

బైక్ బోల్తా పడి వ్యక్తి మృతి

వాకాడు (నెల్లూరు) : బైక్ అదుపు తప్పి బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. చిల్లకూరు మండలంలోని పారిచర్లవారిపాలెం గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ నిరంజన్ రెడ్డి(52) కోట మండలంలోని విద్యానగర్ మెయిన్‌రోడ్డులో శుక్రవారం ఉదయం తన స్వగ్రామం నుండి వాకాడు ఆర్టీసీ డిపోకు వెళ్తుండగా ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కోట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మతిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కోట ఎస్సై నారాయణరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మృతదేహాన్ని పంచనామా నిమిత్తం వాకాడు మండలంలోని బాలిరెడ్డి పాలెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజ్ఞ

జవాబులు

1. మార్చి 1, 2018 నుంచి
2. మధ్యప్రదేశ్‌లోని ఛత్తార్‌పుర్
3. పెట్రో
4. తొలిసారిగా రాత్రివేళ పరీక్షించడం
5. పది లక్షల డాలర్లు

బోయలను ఎస్‌టిల్లో చేర్చొద్దని సంతకాల సేకరణ

ప్రజాశక్తి- పెదబయలు (విశాఖ)

బోయ వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతూ విశాఖ జిల్లా పెదబయలు మండల కేంద్రంలో గిరిజన సంఘం ఆధ్వర్యాన శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బొండా సన్నిబాబు మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం నిజమైన గిరిజనులకు అన్యాయం జరిగేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. బోయ వాల్మీకులు, వడ్డెరలను ఎస్‌టి జాబితాలో చేరుస్తూ నిర్ణయించడం అన్యాయమన్నారు. సేకరించిన సంతకాలను రాష్ట్రపతి, గవర్నర్‌లకు నివేదిస్తామని చెప్పారు. ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ ఈ నెల 25న విశాఖ గిరిజన భవన్‌లో నిర్వహించే సదస్సుకు గిరిజనులు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.మత్స్యవరప్రసాద్, ఎపిజిఎస్ నాయకులు పాల్గొన్నారు. అలాగే అరకులోయ టౌన్‌షిప్‌లో ఎపి గిరిజన సంఘం, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన సంతకాల సేకరణ చేపట్టారు.

తండాల్లోని కిడ్నీ బాధితులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాబూరావు డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

కృష్ణాజిల్లా ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లోని కిడ్నీ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు డిమాండ్ చేశారు. బాధితులను ఆదుకోకపోతే ఆందోళనకు దిగక తప్పదని హెచ్చరించారు. విజయవాడ సుందరయ్య భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కిడ్నీ బాధిత గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించిందని, దీప్లానగర్, మాన్‌సింగ్‌నగర్, మత్రియా తండాల్లో 25 మంది గిరిజనులు కిడ్నీ వ్యాధులతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారని వివరించారు. 19 గ్రామాల్లో వందలాది మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వం మాత్రం వ్యాధి తీవ్రతను కప్పిపుచ్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కిడ్నీ బాధితులకు రూ.2,500 పింఛను మంజూరుకు ప్రభుత్వం జారీ చేసిన జిఒ 418 లోపభూయిష్టంగా ఉందన్నారు. సిపిఎం పశ్చిమ కృష్ణా కార్యదర్శి డి.వి.కృష్ణ మాట్లాడుతూ ఎ.కొండూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ సెంటరు ఏర్పాటు చేయాలన్నారు. నెఫ్రాలజిస్టులను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఫ్లోరైడ్ సమస్య పరిష్కారానికి కృష్ణానది నీటిని పైప్‌లైన్ ద్వారా బాధిత ప్రాంతాలకు సరఫరా చేయాలన్నారు.



ఆత్మహత్యాయత్నం చేస్తున్న రైతును అడ్డుకుంటున్న తోటి రైతులు

సాగునీటి కోసం రైతుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - అవనిగడ్డ

దివిసీమ ప్రాంతంలో మొక్కజొన్న పంట కాపాడుకునేందుకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కృష్ణాజిల్లా అవనిగడ్డలో అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మరోవైపు అధికారులు, ప్రజాప్రతినిధుల వైఖరికి నిరసనగా రైతు ఆత్మహత్యయత్నం చేశాడు. దీంతో అక్కడే ఉన్న రైతులు అడ్డుకున్నారు. తొలుత రైతులు రాజీవ్ సెంటరు నుంచి కోర్టు సెంటరు వరకు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఎడ్లబండ్లతో నిరసన తెలిపారు. అనంతరం రాజీవ్ సెంటరులో ధర్నా చేశారు. ఆందోళన చేస్తున్న రైతులను పోలీసులు అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జి సింహాద్రి రమేష్‌బాబు, రైతు సంఘం జిల్లా నాయకులు ఆవుల బసవయ్య మాట్లాడుతూ అధికారుల సూచనల మేరకే రైతులు దివిసీమ ప్రాంతంలో మొక్కజొన్న పంటను సాగు చేశారని, ఇప్పుడు నీరు విడుదల చేయడం సాధ్యం కాదని చెప్పడం శోచనీయమన్నారు. డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్, జల వనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు స్పందించి నీరు విడుదల చేయకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మీడియాపై దాడులు మానుకోవాలి

ఎపిడబ్ల్యుజెఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో/ గుంటూరు జిల్లా విలేకర్లు

మీడియాపై అరాచక శక్తులు దాడులు మానుకోవాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యుజెఎఫ్) ప్రధాన కార్యదర్శి జి ఆంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మీడియాపై వరుసగా జరుగుతున్న దాడులు, దానిలో పనిచేస్తున్న వారికి వృత్తిపరమైన భద్రత లేదనే అభిప్రాయాన్ని మరింతగా బలోపేతం చేస్తున్నాయని పేర్కొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో పోలవరం ప్రజాశక్తి విలేకరి ఆదిశేషు, కృష్ణాజిల్లా మచిలీపట్నం, కానూర్‌లో టివి 5 విలేకర్లపై, విజయనగరంలో మహాటివి వాహనంపై దాడి, చర్చా కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంస్థలపై దాడులు అన్యాయమని తెలిపారు. ప్రత్యేక హోదాపై మీడియా సంస్థలు నిర్వహిస్తున్న చర్చాగోష్టులపై దాడులు పెరిగాయని, ఈ దాడులన్నింటిని ఎపిడబ్ల్యుజెఎఫ్ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. ఆయా జిల్లాల్లో దాడులకు వ్యతిరేకంగా ఇప్పటికే ఆందోళనలు సాగాయని, మిగిలిన జిల్లాల్లో కూడా దాడులను వ్యతిరేకిస్తూ జర్నలిస్టులకు సంఘీభావంగా ఆందోళన కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. దాడులకు పాల్పడుతున్న అరాచక శక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. విభిన్న అభిప్రాయాలను ప్రజలకు తెలిపేందుకు చర్చా కార్యక్రమాలను ఏర్పాటుచేస్తున్న మీడియా సంస్థలపై దాడి చేయడం సరికాదని రాజకీయపార్టీలకు విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని మీడియా రక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

దాడికి నిరసనగా జర్నలిస్టుల ప్రదర్శన

విజయనగరం జిల్లాలో మహా టివి ఛానల్ బృందంపై దాడికి నిరసనగా గుంటూరు జిల్లాలో పలు చోట్ల నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మంగళగిరిలో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి కార్యాలయంలో వినతిపత్రం అందించారు. దాడికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నరసరావుపేటలో ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. తెనాలిలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లతో నిరసన తెలిపారు.



లూలూకు భూకేటాయింపులు రద్దు చేయాలని ధర్నా చేస్తున్న అఖిలపక్ష నాయకులు

లూలూకు భూ కేటాయింపు రద్దు చేయాల్సిందే

విశాఖలో అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ కోసం రూ.1,000 కోట్ల విలువైన ఎపిఐఐసి భూమిని లూలూ సంస్థకు కేటాయిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని అఖిల పక్ష నాయకులు డిమాండ్ చేశారు. జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన ప్రభుత్వమే సిఆర్‌జెడ్ నిబంధనలకు తిలోదకాలిస్తూ తీర ప్రాంతంలో భారీ నిర్మాణాలను ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. ప్రజా ఆందోళనలను లెక్క చేయకుండా లూలూ సంస్థకు వేల కోట్ల విలువైన భూమిని కేటాయించడం ఓ భారీ కుంభకోణంగా మిగిలిపోతుందని విమర్శించారు. పార్కింగ్ కోసమే మూడు ఫ్లోర్లు నిర్మించనున్నారంటే కన్వెన్షన్ సెంటర్ వస్తే ఆర్కే బీచ్ రోడ్డులో ట్రాఫిక్ రద్దీ తీవ్రస్థాయిలో ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వంశీకృష్ణ శ్రీనివాస్, మళ్ల విజయప్రసాద్, సిపిఎం నాయకులు జ్యోతీశ్వరరావు, వి కృష్ణారావు, సిపిఐ నాయకులు మరుపిళ్ల పైడిరాజు, ఎ బాబూరావు, కాంగ్రెస్ నాయకులు సతీష్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదా కోసం ప్రజాబ్యాలెట్

ప్రజాశక్తి-యంత్రాంగం

ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరుతూ శుక్రవారం ఆయా జిల్లాల్లో ప్రజాబ్యాలెట్, సంతకాల సేకరణ, ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించారు. విజయవాడలో పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు, నిరసనలు, ప్రజాబ్యాలెట్‌లు నిర్వహిస్తున్నారు. విజయవాడలోని సింగ్‌నగర్, లెనిన్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ప్రజాబ్యాలెట్ నిర్వహించారు. విజయవాడ సెంట్రల్ ఎంఎల్‌ఎ బొండా ఉమామహేశ్వరరావు మధురానగర్‌లో సిపిఎం నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో ఓటు వేసి ప్రత్యేక హోదా ఇవ్వాలని కోరారు. డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ కళాశాలలో సంతకాల సేకరణ నిర్వహించారు. భీమిలిలో ప్రత్యేక హోదా కోసం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా నిర్వహించారు. పాత బస్టాండ్ నుంచి తహశీల్దారు కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి కోరాడ లక్ష్మణ్‌కుమార్ పాల్గొన్నారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కొడమంచిలిలో వైసిపి నేతలు సమావేశం నిర్వహించారు. ప్రత్యేకహోదా గళాన్ని ఢిల్లీస్థాయిలో వినిపించేలా పోస్టుకార్డు ఉద్యమాన్ని చేపడతామని తెలిపారు.

రౌండ్ టేబుల్

హామీల అమలు కోసం ఆందోళనలు

- మార్చి 1, 2, 3 తేదీల్లో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసనలు
- రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బి.నారాయణ

ప్రజాశక్తి - కడపఅర్బన్

కేంద్ర ప్రభుత్వం విభజన చట్టంలోని హామీలను వెంటనే అమలు చేయాలని, హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేయాలని పలు రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విభజన చట్టం హామీలు, ప్రత్యేక హోదా, స్టీల్‌ప్లాంట్ సాధన కోసం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉక్కు సాధన ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు బి.నారాయణ మాట్లాడుతూ.. విభజన చట్టంలోని హామీల అమలు కోసం మార్చి 1, 2, 3న జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నిరసనలు తెలియజేయాలన్నారు. అనంతరం చలో ఢిల్లీ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పార్టీలు, ప్రజాసంఘాలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పోరాటాలు చేద్దామని పిలుపు నిచ్చారు.

రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి ప్రజలను మభ్యపెట్టడం దారుణమన్నారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం నిర్వహించే పోరాటాల్లో భాగస్వాములమవుతామని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి కె.ఆంజనేయులు మాట్లాడుతూ.. విభజన హామీల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డ్రామాలు ఆడుతున్నాయని విమర్శించారు. రాయలసీమలో అభివృద్ధి చేయ లేదని ఎక్కడా నిరసనలు వ్యక్తమవుతాయోనని భయపడి సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నాయకులను ముందస్తు అరెస్టు చేస్తున్నారని విమర్శించారు.

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, రాయలసీమలో హైకోర్టు నెలకొల్పాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఈశ్వరయ్య మాట్లాడుతూ.. పోరాటాల్లో సిపిఐ పాల్గొంటుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలను మోసం చేస్తున్నాయని విమర్శించారు. బిజెపి, టిడిపిలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలను పిలుపు నిచ్చారు.

సంక్షిప్తం

బిజెపి దూరమవుతోందని బాబుకు ముస్లింలు గుర్తుకొచ్చారా..?

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మైనార్టీలపై చంద్రబాబు నాయుడు కపట ప్రేమ చూపుతున్నారని వైసిపి ఎమ్మెల్యే మహ్మద్ ముస్తాఫా షేక్ విమర్శించారు. బిజెపి దూరమవుతోందనే ముస్లింలకు దగ్గరయ్యేందుకు ఆయన ప్రయత్నాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ముస్లింలు టిడిపికి బాసటగా నిలవాల్సిన సమయమని చంద్రబాబు చెప్పడం సిగ్గుచేటన్నారు. నాలుగేళ్ల పాలనలో ముస్లింలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని విమర్శించారు. కేబినేట్‌లో ఒక్క ముస్లింకు కూడా స్థానం కల్పించలేదని గుర్తు చేశారు. వైఎస్‌ఆర్ హయాంలోనే మైనార్టీలకు న్యాయం జరిగిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధి నిధుల కోసమే తాను సిఎంను కలిశానని, పార్టీ మారే ఉద్దేశం తనకు లేదని తెలిపారు. పార్టీ మారిన చాంద్‌పాషా, జలీల్‌ఖాన్ మోసపోయినట్లే, తానూ మోసపోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు.

ఉపాధి నిధుల స్వాహాలో 9మంది సస్పెన్షన్

గుంటూరు జిల్లా ప్రతినిధి: గుంటూరు జిల్లా నూజెండ్ల మండలంలో ఉపాధి హామీ నిధులు రూ.1.7 కోట్లు స్వాహా చేసిన వ్యవహారంలో తొమ్మిది మంది తాత్కాలిక ఉద్యోగులను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు. 19 మంది ఉద్యోగులకు చార్జిమెమోలను జారీ చేశారు. ఎంపిడిఒ రవికుమార్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టర్ కోన శశిధర్ ఉన్నతాధికారులకు నివేదికను పంపారు. మండలంలో ఉపాధి హామీ పనులు చేపట్టడంలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఇటీవల ఆరోపణలు వచ్చాయి. దీనిపై సామాజిక తనిఖీలో నిధులు దుర్వినియోగమైనట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.



విజయ కేతనం చూపుతున్న అడ్మిన్ అడ్వైజర్ మోహన్, విద్యార్థులు

సిఎంఎ ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ ప్రభంజనం

ప్రజాశక్తి-కార్పొరేషన్ (గుంటూరు)

ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మోహన్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి శుక్రవారం గుంటూరులో మీడియాతో మాట్లాడారు. సిఎంఎ ఇంటర్ మొదటి 50 ర్యాంకుల్లో 33 ర్యాంకులను తమ విద్యార్థులే సాధించారని, ఫైనల్ ఫలితాల్లో మొదటి ర్యాంకులలో 19 ర్యాంకులను తమ విద్యార్థులు కైవశం చేసుకున్నారని తెలిపారు. ఇంటర్‌లో కూరపాటి వైష్ణవి అఖిల భారత స్థాయిలో మొదటి ర్యాంకు, ఫైనల్ ఫలితాల్లో జి.పూజిత మొదటి ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో మాస్టర్‌మైండ్స్, గుంటూరు ప్రతిష్టను ఉన్నతంగా నిలబెట్టారన్నారు. అఖిల భారత స్థాయిలో ప్రకటించిన ర్యాంకులలో కేవలం మాస్టర్ మైండ్స్ విద్యార్థులకే 50 శాతానికి పైగా ర్యాంకులు వచ్చాయని చెప్పారు. .

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన బిజెపి ఎంఎల్‌ఎ

అశోక్‌నగర్(ఎంపి) : మధ్యప్రదేశ్‌లోని అశోక్‌నగర్ జిల్లాలో ముంగోలిలో శనివారం జరగనున్న ఉప ఎన్నికల సందర్భంగా విధించిన ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారంటూ బిజెపి ఎంఎల్‌ఎపై కేసు నమోదు చేసినట్లు పోలీసు అధికారి తెలిపారు. పొరుగున గల సాగర్ జిల్లాకు చెందిన ఎంఎల్‌ఎ శైలేంద్ర జైన్ ముంగోలిలో ఎన్నికల ప్రచారానికి గడువు ముగిసినా తన వాహనంలో ప్రచారం నిర్వహించారని ఆయన తెలిపారు. జైన్ (55), ఆయన కారు డ్రైవర్ రకీబ్ ఖాన్ (26)లపై ఐపిసి 188 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు ముంగోలి పోలీసు స్టేషన్ ఇనస్పెక్టర్ కుశాల్ సింగ్ తెలిపారు.

పర్యటన



చైనాలోని యూనాన్ ప్రావిన్సులో ఉన్న డాలీ ప్రాంతాన్ని ప్రమోట్ చేసేందుకు బెంగాల్‌లో పర్యటించిన చైనా ప్రతినిధి బృందం

చైనా రండి.. డాలీ రమణీయతను ఆస్వాదించండి

ప్రజాశక్తి ప్రతినిధి - కొల్‌కతా

చైనాలోని యూనాన్ ప్రావిన్సులో ఉన్న అందమైన ప్రీఫెక్చర్ ప్రాంతం డాలీ. ఆహ్లాదకర కొండతీర ప్రదేశమైన ఈ ప్రాంతం ఎంతో రమణీయతతో పర్యాటకులను కట్టేపట్టేస్తుంటుంది. ఈ సుందర ప్రాంతాన్ని పర్యాటకంగా మరింతగా ప్రమోట్ చేసేందుకుగాను చైనా ప్రతినిధి బృందం పశ్చిమ బెంగాల్‌లో కొల్‌కతాలోని సిటీ హోటల్‌లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించింది. చైనా కమ్యూనిస్టు పార్టీ డాలీ ప్రీఫెక్చర్ కమిటీ కార్యదర్శి, డాలీ డైరెక్టర్ ఛెన్ జియాన్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చైనా భారత్ మధ్య వాణిజ్యపర సత్సంబంధాలను ఇలాంటి కార్యక్రమాలు మరింతగా సుస్థిరపరుస్తాయని జియాన్ తెలిపారు. అందమైన కొండతీర ప్రాంతమైన డాలీ అత్యంత సుందరమైనదని, డాలీని విద్యా, పర్యాటక రంగాల్లో మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావాలనే ఉద్దేశంతో, ఈ రంగాల్లో పెట్టుబడులను ఆహ్వానించే లక్ష్యంతో, పర్యాటకులను ఆహ్వానించేందుకు తాము ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. అత్యంత రమణీయమైన ఈ డాలీ ప్రాంతాన్ని ప్రతి ఏటా 6.3 కోట్ల మంది పర్యాటకులు సందర్శిస్తారని చెప్పారు. అమెరికా లాంటి కొన్ని దేశాలు భారత్, చైనాల మధ్య సత్సంబంధాలు లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నాయని, భారత్‌ను పొరుగుదేశమైన చైనా నుంచి దూరం చేయాలనే దురుద్దేశపూరితంగా అమెరికా విధానాలుంటున్నాయని ఆయన విమర్శించారు.

దాణా కుంభకోణం కేసులో లాలూకు బెయిల్ నిరాకరణ




రాంచీ : కోట్లాది రూపాయల పశుదాణా కుంభకోణానికి పాల్పడిన ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్‌కు డియోఘర్ జిల్లా ట్రెజరీ కేసులో శుక్రవారం జార్ఖండ్ హైకోర్టు బెయిల్ నిరాకరించింది. ఆయన ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని బెయిల్ మంజూరు చేయాలని లాలూ తరుపు న్యాయవాది సురేంద్ర సింగ్ విజ్ఞప్తి చేయగా, సిబిఐ వ్యతిరేకించింది. దీంతో కోర్టు బెయిల్‌కు నిరాకరించింది. అంతకు ముందు సిబిఐ స్పెషల్ కోర్టు ఈ కేసులో లాలూకు మూడున్నరేళ్ళ జైలు శిక్షతో పాటు 10 లక్షల రూపాయలను జరిమానా విధించింది. పశుదాణా కుంభకోణానికి సంబంధించి జార్ఖండ్‌లో ఐదుకేసులు, పాట్నాలో ఒక కేసు కలిపి మొత్తం ఆరు కేసుల్లో లాలూ విచారణను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం డియోఘర్, చైబాస ట్రెజరీ కేసులో నిందితులుగా ఉన్న లాలూ రాంచీలోని బిర్సా ముందా సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవిస్తున్నారు. 1992-93లో చైబాసా జిల్లా ఖజానా నుండి రూ.33.67 కోట్లను విత్ డ్రా చేశారని లాలూ ప్రసాద్‌తో పాటు బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా, మరో ఆరుగురిని సిబిఐ కోర్టు నిందితులుగా పేర్కొంది.

నీట్ వయోపరిమితిపై పిటిషన్‌ను తిరస్కరించిన సుప్రీం

సిబిఎస్ఇ నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని వ్యాఖ్య

న్యూఢిల్లీ : జాతీయ స్థాయిలో జరిగే నీట్ ప్రవేశ పరీక్షకు తమను కూడా అనుమతించేలా సిబిఎస్ఇని ఆదేశించాలని కోరుతూ నిర్ధారిత వయస్సు దాటిన కొందరు అభ్యర్థులు చేసుకున్న అభ్యర్థనను సుప్రీం కోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. నీట్ పరీక్షకు హాజరయ్యే జనరల్ కేటగిరి అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిని 25 సంవత్సరాలుగా నిర్ధారిస్తూ సిబిఎస్ఇ తీసుకున్న నిర్ణయంలో తాము జోక్యం చేసుకోలేమని న్యాయమూర్తులు ఆదర్శ్ గోయల్ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. దీనిపై విద్యార్థులు దాఖలు చేసిన పిటిషన్‌కు తగిన యోగ్యత లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. నీట్-2018కి హాజరయ్యే జనరల్ కేటగిరి విద్యార్థులకు 25 సంవత్సరాలు గరిష్ట పరిమితిని నిర్ధారిస్తూ సిబిఎస్ఇ నిర్ణయం తీసుకుంది. ఈ పరీక్షకు సంబంధించిన అడ్మిషన్ నోటిఫికేషన్‌ను ఈ నెల 9న సిబిఎస్ఇ విడుదల చేసింది. నీట్-2017 అడ్మిషన్ నోటిఫికేషన్‌లో స్వల్ప మార్పులు చేసి 2018లో మరో నోటిఫికెషన్ విడుదల చేసింది. సిబిఎస్ఇ విడుదల చేసిన నీట్-2018 నోటిఫికెషన్‌లోని నిబంధనల మేరకు 31 డిసెంబరు, 2018 నాటికి 17 సంవత్సరాలు వయస్సు నిండిన వారు ఈ పరీక్షకు హాజరు కావచ్చునని పేర్కొంది. అయితే జనరల్ కేటగిరి అభ్యర్థులకు గరిష్ట వయోపరిమితిని 25 సంవత్సరాలుగా నిర్ధారించింది. ఎస్సీ, ఎస్టీ, ఇతర వెనుకబడిన తరగతులతో పాటు, దివ్యాంగులకు 5 సంవత్సరాల సడలింపునిచ్చింది. మే 6, 2018 నాటికి 25 సంవత్సరాలు, అంతకన్నా తక్కువ వయస్సున్న వారు నీట్ 2018 పరీక్షకు హాజరయ్యేందుకు అర్హులు.

పిఎన్‌బి స్కామ్ బాధ్యత నుండి తప్పించుకోలేరు : యశ్వంత్ సిన్హా



న్యూఢిల్లీ : పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి) స్కామ్‌లో ప్రభుత్వం తన బాధ్యత నుంచి బిజెపి తప్పించు కోలేదని మాజీ ఆర్థిక మంత్రి యశ్వంత్ సిన్హా అన్నారు. "ఈ స్కామ్ బాధ్యత నుంచి బిజెపి తప్పించుకోలేదు. గత నాలుగు సంవత్సరాలుగా మేము పదవిలో ఉన్న సమయంలోనే ఈ స్కామ్ జరిగింది. అయితే ఆ స్కామ్ అంతకుముందే ప్రారంభమైన స్కామ్‌ను ఎందుకు కొనసాగించాల్సి వచ్చింది." అని సిన్హా ఒక పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రశ్నించారు. పిఎన్‌బి స్కామ్‌పై కాంగ్రెస్, బిజెపిల మధ్య జరుగుతున్న రాజకీయ పోరాటంలో వాస్తవం కనుమరుగవుతోందని యశ్వంత్ సిన్హాపేర్కొన్నారు. ఈ నెల 14న పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పిఎన్‌బి)స్కామ్ వెలుగుచూసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో ప్రధాన నిందితులైన నిరవ్‌మోడి, ఆయన అంకుల్ మెహుల్ చోక్సికి కంపెనీలకు చెందిన 12 మంది అధికారులను దర్యాప్తు సంస్థలు అరెస్టు చేశాయి. తీవ్ర స్థాయిలో జరిగిన ఈ స్కామ్ ఒక్క ఉద్యోగుల వల్ల మాత్రమే సాధ్యమయ్యేది కాదని సిన్హా పేర్కొన్నారు. వ్యవస్థలోని అత్యున్నత స్థాయి అధికారుల జోక్యం లేకుండా ఇంత పెద్ద మొత్తంలో మోసం జరగదని ఆయన చెప్పారు. సుప్రీం కోర్టు పర్యవేక్షణలో స్వతంత్ర విచారణ అవసరమన్నారు.

'తాపి' గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు పనులు ప్రారంభం

సెర్ఖతాబత్ (తుర్క్‌మెనిస్తాన్) : తుర్క్‌మెనిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, భారత్ (ఇండియా) భాగస్వాములుగా వున్న 'తాపి' గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు పనులు ఆఫ్ఘన్ భూభాగంలో శుక్రవారం నాడు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఈ గ్యాస్ పైప్‌లైన్ ప్రాజెక్టు పూర్తయితే దక్షిణాసియాలో ఇంధన కొరతను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఆఫ్ఘనిస్తాన్-తుర్క్‌మెనిస్తాన్ సరిహద్దు ప్రాంతంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆఫ్ఘనిస్తాన్ అధ్యక్షుడు అష్రఫ్‌ఘనీ, తుర్క్‌మెనిస్తాన్ అధ్యక్షుడు గుర్బన్‌గూలిబెర్డీ ముఖమెదోవ్, పాక్ ప్రధాని షాహిద్ ఖాకన్ అబ్బాసీ, భారత విదేశాంగశాఖ సహాయ మంత్రి ఎంజె అక్బర్‌లు పాల్గొన్నారు. వీరితో పాటు తుర్క్‌మెనిస్తాన్‌లోని వివిధ దేశాల దౌత్య ప్రతినిధులు, ప్రముఖులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆఫ్ఘన్ అధ్యక్షుడు అష్రఫ్‌ఘనీ మాట్లాడుతూ ఈ ప్రాజెక్టు దేశాలను ఒకేతాటిపైకి తెస్తుందన్నారు. ఈ ప్రాజెక్టుపై ఇప్పటి వరకూ నిరాశావాదం వినిపించినప్పటికీ ఇప్పుడు నిర్మాణ పనులు ప్రారంభం కావటం మనం అందరమూ చూస్తున్నామని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తుర్క్‌మెనిస్తాన్‌లోని సహజవాయు క్షేత్రం గాల్కినిష నుండి ప్రారంభమయ్యే ఈ పైప్‌లైన్ ప్రాజెక్టు మొత్తం 1,840 కి.మీ మేర నిర్మితమై 2020 ఆరంభం నాటికి అందుబాటులోకి వస్తుందని తుర్క్‌మెనిస్తాన్ ప్రభుత్వం చెబుతోంది.

ఔరంగాబాద్ జిల్లా మేజిస్ట్రేట్‌పై అవినీతి కేసు

న్యూఢిల్లీ : బీహార్‌లోని ఔరంగాబాద్ జిల్లా మేజిస్ట్రేట్ కన్వల్ తనూజ్‌పై సిబిఐ అవినీతి కేసు నమోదు చేసిందని శుక్రవారం అధికారులు పేర్కొన్నారు. ఎన్‌టిపిసికి చెందిన అనుబంధ సంస్థ భారతీయ రైల్ బిజ్లీ కంపెనీ లిమిటెడ్ (బిఆర్‌బిసిఎల్) విద్యుత్ ప్లాంట్ కోసం జిల్లాలోని నబీగర్ ప్రాంతంలోని భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొందని అధికారులు తెలిపారు. ఈ కేసులో సంబంధం కలిగి ఉన్నారన్న అనుమానంతో జిల్లా మెజిస్ట్రేట్ ఇంటిలో సిబిఐ సోదాలు నిర్వహించింది. ఏడు ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణ వెలువెత్తడంతో సిబిఐ గురువారమే ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. చనిపోయిన వ్యక్తికి బదులు గోపాల్ ప్రసాద్ సింగ్ అనే వ్యక్తి భూమిగా చూపించారు. ఈ కేసులో గోపాల్ ప్రసాద్ సింగ్‌తోపాటు మెజిస్ట్రేట్ తనూజ్, పలు వురు అధికారులను సిబిఐ నిందితులుగా పేర్కొంది.. గత సంవత్సరం ఏప్రిల్‌లో బిఆర్‌బిఎల్ సిబ్బంది, జిల్లా పాలనా అధికారులు స్థలం వద్దకు వెళ్ళగా, పలువురు గ్రామస్తులు సింగ్‌ను గుర్తించలేదు.

రాజస్థాన్‌లో రైతుల 'మహాపడావ్'

ఇండియా న్యూస్‌నెట్‌వర్క్, జైపూర్:

రాజస్థాన్‌లో వసుంధర రాజే నేతృత్వంలోని బిజెపి సర్కారు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక వైఖరిని, పోలీసు అణచివేతను నిరసిస్తూ అఖిల భారత కిసాన్ సభ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా రైతులు 'మహాపడావ్' పేరిట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వివిధ నగరాలలో జరిగిన బహిరంగ సభలకు అనూహ్య రీతిలో ప్రజాస్పందన వ్యక్తమయిందని నిర్వాహకులు చెప్పారు. రింగస్‌లో జరిగిన బహిరంగ సభలో కిసాన్‌సభ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, రాజస్థాన్ సభ కోశాధికారి గురుచరణ్‌సింగ్ మౌర్, సీనియర్ నేతలు హర్‌ఫూల్ సింగ్ తదితరులు ప్రసంగించారు. రాష్ట్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానా లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విజూ కృష్ణన్ వసుంధర రాజే సర్కారుకు రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. జైపూర్‌కు వచ్చేందుకు ప్రయత్నించిన వేలాది మంది రైతులను బిజెపి ప్రభుత్వం అడ్డుకుని వారిని అరెస్ట్ చేసిందన్నారు. రానున్న ఎన్నికల్లో బిజెపి శాసన సభలో ప్రవేశించకుండా అడ్డుకోవాలని ఆయన రైతులకు పిలుపునిచ్చారు. రైతుల పోరాటానికి కిసాన్ సభ తరపున సంఘీభావం ప్రకటించిన కృష్ణన్ రాష్ట్రంలో అక్రమంగా అరెస్ట్ చేసిన రైతులందరినీ బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రైతుల పట్ల రాజస్థాన్ ప్రభుత్వ అణచివేత చర్యలు

ఖండించిన ఎఐఎడబ్ల్యుయు

న్యూఢిల్లీ (ఇండియా న్యూస్ నెట్‌వర్క్) : రాజస్థాన్‌లోని బిజెపి ప్రభుత్వం రైతుల పట్ల అనుసరిస్తున్న అప్రజాస్వామిక, అణచివేత చర్యలను అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం (ఎఐఎడబ్ల్యుయు) తీవ్రంగా ఖండించింది. రాష్ట్రంలోని రైతులను జైపూర్‌లో అడుగుపెట్టనీయకుండా అడ్డుకుంటున్నదని పేర్కొంది. బిజెపి ప్రభుత్వం తన రైతు వ్యతిరేక విధానాలను విడిచిపెట్టాలని, రుణాల రద్దు, మద్దతు ధర పెంపు, రాష్ట్ర ప్రభుత్వమే తగినంతగా పంటను కొనుగోలు చేయడం, పెన్షన్లను పెంచడం వంటి డిమాండ్లకు ప్రభుత్వం ఇప్పటికే అంగీకరించినా అమలు చేయనందుకు నిరసనగా రాజస్థాన్ రైతులు ఆందోళన బాట పట్టారు. రాష్ట్ర రైతాంగం కరువుతో అల్లాడడానికి ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఎఐఎడబ్ల్యుయు ఆగ్రహం వ్యక్తం చేసింది. జైపూర్‌లోని సిపిఐ(ఎం) కార్యాలయం సమీపంలో జరుగుతున్న రైతు సదస్సులో ప్రసంగించడానికి వస్తున్న ఆల్ ఇండియా కిసాన్ సభ అధ్యక్షులు డాక్టర్ అశోక్ థావలే, జాయింట్ సెక్రటరీ విజూ కృష్ణన్, మరికొంత మంది ఇతర నేతలను అడ్డుకోవడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని ఎఐఎడబ్ల్యుయు విమర్శించింది. రైతు నేతలు అమ్రా రామ్, పెమా రామ్, హెట్ రామ్ బెనివాల్‌లను ఇప్పటికే అరెస్టు చేసినప్పటికి, వారు సభకు హాజరుకాకుండా ఆపలేక పోయిందని ఎఐఎడబ్ల్యుయు రాష్ట్ర అధ్యక్షుడు పవన్ దగ్గల్ తెలిపారు. రైతాంగ సమస్యలపై పోరాటాలకు ఇటువంటి చర్యలు అడ్డుకావని ఎఐఎడబ్ల్యుయు వ్యాఖ్యానించింది.

రైతు సమస్యలపై రాజస్థాన్ అసెంబ్లీలో గందరగోళం

సభ రెండు సార్లు వాయిదా

రాజస్థాన్ అసెంబ్లీలో శుక్రవారం గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. రైతు సమస్యలపై ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వాన్ని నిలదీయడంతో రెండు సార్లు సభ వాయిదా పడింది. రాష్ట్రంలో ఆందోళన చేస్తున్న రైతుల సమస్యలపై తాను మాట్లాడటానికి ప్రయత్నించానని, కాని తనను మాట్లాడనీయకుండా అడ్డుకున్నారని స్వతంత్ర ఎమ్మెల్యే రాజ్‌కుమార్ శర్మ తెలిపారు. రైతు సమస్యలపై ప్రభుత్వం నుంచి సమాధానం కావాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సభ్యులు కూడా ఇదే అంశంపై ఆందోళనకు దిగారు. శర్మతో చేతులు కలిపారు. ప్రతిపక్ష సభ్యులందరూ సభ మధ్యలోకి దూసుకెళ్ళి ఆందోళన చేయడంతో సభను గంటన్నరపాటు వాయిదా వేశారు. తిరిగి సభ సమావేశమైన తరువాత ఉపసభాపతి రూలింగ్ ఇస్తూ, ప్రభుత్వం సమాధానమిస్తుందన్నారు. రైతులకు సంబంధించిన పలు సమస్యల జాబితాపై చర్చించాల్సి ఉందని, సభను సక్రమంగా నిర్వహిస్తే అన్ని సమస్యలు చర్చకు వస్తాయని జల వనరుల శాఖ మంత్రి రామ్ ప్రతాప్ సభ్యులను కోరారు. తాగు, సాగు నీటికి నిధులు మంజూరు చేయాలన్న డిమాండ్లు చర్చించాల్సిన అంశాల జాబితాలో ఉన్నాయని, అవి రైతులకు ఎంతో అవసరమని, వాటిపై చర్చ సాగనీయకుండా గందరగోళం సృష్టిస్తే అది రైతు వ్యతిరేక విధానమవుతోందని రాం ప్రతాప్ తెలిపారు. దీంతో ఆగ్రహించిన శర్మ మంత్రితో వాగ్వివాదానికి దిగారు. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రాజేంద్ర రాథోర్, రవాణాశాఖ మంత్రి యూనస్ ఖాన్ జోక్యం చేసుకుని వారిద్దరి మధ్య వాగ్వివాదాన్ని అడ్డుకున్నారు. ఈ గందరగోళ పరిస్థితుల నేపథ్యంలో ఉపసభా పతి సభను వాయిదా వేశారు.



కేజ్రీవాల్ నివాసానికి పోలీసులు

అన్షు ప్రకాష్‌పై దాడికి సంబంధించి సిసిపుటేజ్‌ల సేకరణ

కేంద్రం అండతోనే ఈ చర్య : ఆప్ ఎమ్మెల్యేలు

న్యూఢిల్లీ : ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాష్‌పై జరిగిన దాడికి సంబంధించిన వివరాలు సేకరించేందుకు పోలీసుల బృందం శుక్రవారం ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్ నివాసానికి వెళ్ళింది. అక్కడ సిసిటివి ఫుటేజ్‌లను సేకరించింది. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఎమ్మెల్యేలు సోమవారం రాత్రి కేజ్రివాల్ నివాసంలో అన్షు ప్రకాష్‌పై దాడి చేసినట్లు వార్తలు వెలువడిన సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి దర్యాప్తులో భాగంగానే ముఖ్యమంత్రి నివాసానికి పోలీసులు వెళ్ళారని ఢిల్లీ పోలీసు ప్రతినిధి దీపేంద్ర పాఠక్ తెలిపారు.

ముందస్తు సమాచారం లేకుండా పోలీసులు కేజ్రివాల్ నివాసానికి వెళ్ళడాన్ని ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియా, మీడియా సలహాదారు అరుణో దయ్ ప్రకాష్ తప్పు పట్టారు. పెద్ద సంఖ్యలో పోలీసులు సిఎం నివాసానికి వెళ్ళారని, నగరంలో పోలీసులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఒక ట్విట్టర్‌లో ఆయన ఆరోపించారు. ఎన్నికైన ముఖ్యమంత్రి పట్లే వారు ఇలా ప్రవర్తిస్తే, ఇక పేదవారి పట్ల ఎలా ప్రవర్తిస్తారో ఊహించవచ్చునని ఆయన తనట్వీట్‌లో పేర్కొన్నారు. కేజ్రివాల్ నివాసానికి దాదాపుగా 60 మందికి పైగా పోలీసులు వెళ్ళారని ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌సెక్రట రీపై దాడి సంఘటనకు సంబంధించి ఆప్ ఎమ్మెల్యేలు అమానతుల్లా ఖాన్, ప్రకాష్ జర్వాల్‌ను పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే.



ఢిల్లీ పోలీసుల దాదాగిరి : ఆప్ ఎమ్మెల్యేలు

ఢిల్లీ పోలీసులు చట్ట విరుద్ధంగా ముఖ్యమంత్రి కేజ్రివాల్ నివాసానికి వెళ్ళడం పట్ల ఆప్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు దాదాగిరి పాల్పడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చేతిలో ఢిల్లీ పోలీసులు కీలుబొమ్మలా మారారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిని అవమానించి, అగౌరవ పరిచేందుకే వారు అక్కడికి వెళ్ళారని ఆప్ నేత అశుతోష్ ఇక్కడ విలేకరులతో అన్నారు. మోదీ ప్రభుత్వం ఆదేశాలు లేకుండా పోలీసులు ఇటువంటి దాదాగిరికి పాల్పడరని ఆప్ ఎంపి సంజయ్ సింగ్ ట్వీట్‌చేశారు.

ఆప్ ఎమ్మెల్యేల బెయిల్ అభ్యర్థన తిరస్కృతి

ఢిల్లీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్షు ప్రకాష్‌పై దాడికి పాల్పడిన ఆప్ ఎమ్మెల్యేలు అమానతుల్లా ఖాన్, ప్రకాష్ జర్వాల్ చేసుకున్న బెయిల్ అభ్యర్థనను ఢిల్లీ కోర్టు శుక్రవారం డిస్మిస్ చేసింది. మెట్రోపాలిటిన్ మెజిస్ట్రేట్ షెఫాలి బర్నాల టాండన్ వారిని పోలీసు కస్టడీకి అప్పగించేందుకు కూడా నిరాకరించారు. పోలీసు కస్టడీలో విచారించాల్సినంత కొత్త నేపథ్యమేమీ లేదన్నారు. కోర్టు గురువారం వారికి 14 రోజుల పాటు జ్యుడిషియల్ కస్టడీ విధించిన సంగతి తెలిసిందే.

బాత్‌టబ్‌లను తొలగించనున్న ఫైవ్ స్టార్ హోటళ్లు

ముంబయి : ఇక నుండి ఐదు నక్షత్రాల హోటళ్ళలో బాత్ టబ్‌లు (స్నానపు తొట్టెలు) ఉండకపోవచ్చు. వాటిని పునరుద్ధరించే పనిలో ప్రముఖ హోటళ్లు అడుగులు వేస్తున్నాయి. స్నానపు తొట్టెల ప్రదేశంలో స్నానపు గదులను ఏర్పాట్లు చేయనున్నారు. తాజ్, ఒబెరాయ్, ఐటీసీలతో సహా అన్ని పెద్ద స్టార్ హోటళ్ళ యజమానులు ఈ బాత్ టబ్‌లను పునరుద్ధరించడం కోసం నూతన నిర్మాణాలు చేపట్టనున్నారు. త్వరితంగా స్నానం ముగించే, తక్కువ సమయం వెచ్చించే పర్యాటకులకు తగ్గట్లుగా మార్చనున్నారు. అంతేకాకుండా, కొన్ని నియమాల్లో మార్పులు చేయనున్నారు. ముంబై లోని తాజ్ హోటల్, బెంగళూరులోని నోవా హోటల్‌లోని షవర్ క్యూబికల్స్ (స్నానపు గదులు)ను ఏర్పాటు చేసి కొత్త ఒరవడిని సృష్టించాయి. అయితే, కేరళలోని తాజ్‌కుమరకోమ్, జైపూర్ ఫెయిర్‌మాంట్ రెస్టారెంట్‌లో విలాసవంతంగా బాత్‌టబ్‌లను ఉంచారు. స్నానపు తొట్టెలను తొలగించాలనే నిర్ణయం హెూటల్ బ్రాండ్లు, అవి ఆకర్షించే అతిథులను బట్టి ఉంటుందని అకోర్ హోటల్స్ (నోవాటెల్, ఐబిస్, సోఫిటెల్) వైస్ ప్రెసిడెంట్ శివ కశ్యప్ పేర్కొన్నారు. భారతీయ ఆతిథ్య పరిశ్రమలో ఈ మార్పు అంతర్జాతీయ పోకడలను ప్రతిబింబిస్తుంది. మారియట్, హిల్టన్ వంటి హెూటళ్ళు ఇప్పటికే బాత్‌టబ్‌లను తొలగించాయి. నగర హెూటళ్లలో స్నానపు తొట్టెల వినియోగం 10% కంటే తక్కువగా ఉందని ఒక ఒబెరాయ్ హోటళ్ల ప్రతినిధి పేర్కొన్నారు. హెూటల్ వర్గీకరణ నిబంధనలలో మార్పు బాత్రూమ్ నిర్మాణాన్ని పునరుద్ధరించే అవకాశం ఉందని మరో ఐటిసి సిఇఒ దీపక్ హాస్కర్ పేర్కొన్నారు. తొట్టెలను తొలగిస్తూ, హెూటళ్ళు నూతనంగా స్నానపు గదులు పునఃరూపకల్పన చేయడానికి ఏర్పాట్లు చేయనున్నారు. గాజుతో చేసిన స్నానపు గదులను ఏర్పాటు చేస్తే షవర్ క్రింద నిలబడి స్నానం చేయడం ద్వారా తక్కువ నీరు వృథా అవుతుందని, స్నానపు తొట్టెలో చేస్తే ఎక్కువ నీరు వృథా అవుతుందని తెలిపారు.

యుపిలో శవమై కనిపించిన జర్నలిస్టు

బల్‌రామ్‌పూర్ (ఉత్తరప్రదేశ్) : ఉత్తరప్రదేశ్‌లోని బల్‌రామ్‌పూర్‌లో ఉత్రౌలా పోలీసు స్టేషన్ పరిధిలో జర్నలిస్టు అంజని మౌర్య(35) శుక్రవారం శవమై కనిపించాడని పోలీసులు తెలిపారు. లక్నో నుంచి ప్రచురితమయ్యే హిందీ దినపత్రికలో ఆయన పనిచేస్తున్నారు. గురువారం ఇంటి నుంచి వెళ్ళిన మౌర్య మళ్ళీ తిరిగి రాలేదని, అతని మృతదేహాన్ని ఈ ఉదయం స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి ప్రమోద్ కుమార్ తెలిపారు. మౌర్య కుటుంబం ఒక భూ వివాదంలో చిక్కుకున్నట్లు ప్రాథమిక విచారణలో తేలిందని ఆయన చెప్పారు.

భద్రతా ప్రమాణాలు లేని బైక్‌లకు సుప్రీం నో!

న్యూఢిల్లీ : చోదకులతో పాటు పిలియన్ రైడర్లకు (వెనక కూర్చున్న వారికి) కూడా పూర్తి భద్రత కల్పించే విధంగా ఏర్పాట్లున్న మోటార్ బైక్‌లకు మాత్రమే రోడ్లపై అనుమతి నివ్వాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. పిలియన్ రైడర్లకు భద్రతా ఏర్పాట్లు లేని బైక్‌లకు అనుమతి ఇవ్వొద్దంటూ 2008 నవంబర్‌లో మధ్యప్రదేశ్ హైకోర్టు వెలువరించిన తీర్పును సవాలు చేస్తూ భారత ఆటోమొబూల్ తయారీదార్ల సంస్థ (సియాఎం) దాఖలు చేసిన అప్పీల్‌ను డిస్మిస్ చేసిన న్యాయమూర్తి ఎకె గోయెల్‌తో కూడిన ధర్మాసనం హైకోర్టు తీర్పును సమర్థించింది.

ప్రత్యేకం

4 జిబి అంతంత మాత్రమే

భారత్‌లో ఇంటర్‌నెట్ వేగంపై నివేదిక



ముంబయి : ఇప్పుడు సగటు భారత వినియోగదారుకు రోజుకు ఒక జిబి డేటా నిత్యావసరంగా మారిపోయింది. కానీ 4జి ఎల్‌టిఇ స్పీడ్ విషయానికొస్తే ఆ కథే వేరన్నట్టుగా మారిపోతోంది. ఊక్లా వంటి థర్డ్ పార్టీ సంస్థలు అందిస్తున్న ఇంటర్నెట్ స్పీడ్ టెస్ట్ పరీక్షల వివరాల మేరకు భారత్‌లో 4జి ఇంటర్నెట్ స్పీడు ప్రపంచ ప్రమాణాలను అందుకోవాలంటే ఇంకా చాలా దూరం ప్రయాణించాల్సి వుంది. అయితే గత ఏడాది కన్నా ఈ ఏడాది మెరుగన్న రీతిలో ఇంటర్నెట్ స్పీడ్‌లో రోజురోజుకూ మార్పులు సంతరించుకుంటున్నాయి. భారత్‌లో మొబైల్ బ్రాండ్‌బాండ్ స్పీడ్ ఇప్పుడిప్పుడే ప్రపంచ ప్రమాణాలను అందుకుంటోందని ఓక్లా చీఫ్ ఆపరేటింగ్ అధికారి జామీ స్టీవెన్ చెబుతున్నారు. ఇంటర్నెట్ స్పీడ్‌లో భారత్ టాప్ 100 జాబితాలోకి ఇంకా చేరలేదని, ఈ జాబితాలో భారత్ 112వ స్థానంలో వుందని ఆయన వివరించారు. ఇప్పుడు భారత్‌లో సగటు వినియోగదారుడు అందుకుంటున్న మొబైల్ ఇంటర్నెట్ స్పీడ్ కేవలం 9.14 ఎంబిపిఎస్ మాత్రమేనంటున్నారు. దీనిని కూడా వీడియో చిత్రాలను తిలకించేందుకు ఇతర కార్యకలాపాల కోసం వినియోగిస్తున్నారని ఆయన వివరించారు. అయితే మొబైల్ ఇంటర్నెట్ విషయంలో భారత్ ఒక క్లిష్టమైన మార్కెట్ అని, ఇక్కడ మౌలిక వసతుల నుండి చివరి వినియోగదారుడి వరకూ ప్రతి అంశమూ సవాలుతో కూడుకున్నదేనని ఆయన అన్నారు. భారత్ వంటి విస్తృత జనసాంద్రత వున్న దేశంలో ప్రజలకు హైస్పీడ్ ఇంటర్నెట్ అందచేయటం సర్వీస్ ప్రొవైడర్లకు సవాలు వంటిదేనన్నారు. ప్రస్తుతం దేశంలో అత్యధిక ప్రజాదరణ పొందుతున్న 4జి ఇంటర్నెట్ ఈ సమస్యను మరింత జటిలం చేస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. 2017 నుండి దేశవ్యాప్తంగా 4జి ఇంటర్నెట్ వినియోగం విస్తృత స్థాయిలో పెరిగినప్పటికీ ఇంటర్నెట్ స్పీడ్‌పై ఇప్పటికీ అనుమానాలు వ్యక్తమవుతూనే వున్నాయి. ఇంటర్నెట్ స్పీడ్‌ను అంచనా వేసేందుకు ట్రాయ్ విడుదల చేసిన మైస్పీడ్ యాప్‌లో తరచు రిలయన్స్ జియో అగ్రస్థానంలో కన్పిస్తూంటుంది. కాగా ఊక్లా సంస్థ పరీక్షల్లో మాత్రం ఎయిర్‌టెల్ అగ్రస్థానంలో నిలుస్తోంది. ఈ స్పీడ్ టెస్ట్ అంచనా వేసే విధానం, అంకెల మార్పు వంటి వివిధ కారణాలతో ఈ వ్యత్యాసం కన్పిస్తుంటుందని ఊక్లా సిఒఓ చెబుతున్నారు. కానీ ఇంటర్నెట్ స్పీడ్‌ను అంచనా వేసేందుకు తాము అనుసరించే పద్ధతి విభిన్నంగా వుంటుందని ఆయన చెబుతున్నారు. తాము అనుసరించే ఈ పద్ధతిని ట్రాయ్‌కి కూడా వివరించామని ఆయన చెప్పారు. ప్రస్తుతం భారత్‌లో ఫిక్సెడ్ బ్రాడ్‌బ్యాండ్ వినియోగం సముచిత స్థాయిలోనే వుందన్నారు. ప్రస్తుతం మన దేశంలో 20.2 ఎంబిపిఎస్ స్పీడ్‌లో డౌన్‌లోడింగ్ అవుతోందని, ఏడాది క్రితం ఇది 12ఎంబిపిఎస్ మాత్రమేనని ఆయన వివరించారు. అప్‌లోడింగ్ స్పీడ్ మాత్రం ఇప్పుడు దాదాపు 15 ఎంబిపిఎస్ స్థాయిలో వుందన్నారు. భారత్‌లో 1జిబిపిఎస్ స్పీడ్ సాధ్యమవుతుందా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ ఈ సవాలు మనం అనుసరించే సాంకేతిక పరిజ్ఞానంపై ఆధారపడి వుంటుందన్నారు. 1జిబి స్పీడ్ ను అందుకోవటానికి ఫైబర్ ఆప్టిక్‌తో సహా ఇంకా అనేక చర్యలు తీసుకోవాల్సి వుందన్నారు.

సంక్షిప్తం

నీరవ్‌మోడీ బ్యాంకు ఖాతాలు, కంపెనీ షేర్స్ నిలిపివేత

ముంబయి : ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్‌మోడీకి సంబంధించిన రూ.30 కోట్ల విలువ చేసే బ్యాంకు ఖాతాలతో పాటు, రూ.13.86 కోట్ల విలువ చేసే కంపెనీ షేర్స్‌ను శుక్రవారం ఎన్‌ఫోర్స్‌డైరెక్టరేట్(ఇడి) నిలిపివేసింది. సోదాల సమయంలో 176 స్టీల్ అలర్మాలు, 158 బాక్స్‌లు, 60 ప్లాస్టిక్ కంటెనర్‌ల్లో ఉన్న ఇంపోర్టెట్ గడియారాలను ఇడి స్వాధీనం చేసుకుంది. గురువారం నీరవ్, ఆయన సంస్థకు చెందిన 100 కోట్ల విలువ చేసే డిపాజిట్లు, షేర్స్, లగ్జరీ కారులను కూడా ఇడి స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. పంజాబ్ నేషనల్ బ్యాంకులో సుమారు 11, 400 కోట్ల రూపాయల మోసపూరిత లావాదేవీలకు పాల్పడినందుకు ఆ బ్యాంకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నీరవ్‌మోడీ, అతని మేనమామ, గీతాంజలి జెమ్స్ అధినేత మోహుల్ చోక్సీని, ఇతరులపై ఇడి, ఇతర సెంట్రల్ ఏజెన్సీ సంస్థలు దర్యాప్తు చేస్తున్నాయి.

నేడు రాయబరేలీకి సోనియాగాంధీ

కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ శనివారం తన నియోజకవర్గమైన ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీలో పర్యటించనున్నారు. అక్కడ జిల్లా విజిలెన్స్, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి హాజరుకానున్నారని, అనంతరం ఎంపి నిధుల నుండి అనేక పథకాలను ప్రారంభిస్తారని, ఈ అంశంపై పార్టీ నేతలతో సమావేశంలో పాల్గొంటారని పార్టీ ప్రతినిధి ఒకరు తెలిపారు.

యువతిని సజీవ దహనం చేసిన దుండగులు

8ఏళ్ళ యువతిని కొందరు దుండగులు సజీవ దహనం చేసిన ఉత్తరప్రదేశ్‌లోని శాత్నాబాలా కేథా అనే గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గురువారం ఆ యువతి సైకిల్‌పై ఇంటి నుండి మార్కెట్‌కు వెళుతుండగా, కొంత మంది దుండగులు ఆమెపై పెట్రోల్‌పోసి నిప్పటించారని పోలీసులు తెలిపారు. దీనితో ఆ యువతి మృతి చెందిందని తెలిపారు. ఆ యువతి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో ఎఫ్‌ఐఆర్‌ను నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అధికారులు తెలిపారు. పోస్ట్‌మార్టం అనంతరం మరింత సమాచారం తెలిసే అవకాశం ఉందని పోలీసులు తెలిపారు.

పెన్షన్‌లో కోతను నిరసిస్తూ లండన్‌లో లెక్చరర్ల సమ్మె

సౌత్ లండన్ : లండన్‌లోని దాదాపు 57 విశ్వ విద్యాలయాలలో పనిచేస్తున్న 40 వేల మంది లెక్చరర్లు గురువారం పెద్ద ఎత్తున సమ్మె చేపట్టారు. గత రెండేళ్ళ కాలంలో దేశంలో ఇంత భారీ సమ్మె ఎన్నడూ జరగలేదు. తమ పెన్షన్లలో 40 శాతం కోత విధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా లెక్చరర్లు సమ్మె జరుపుతున్నారు. ఇందుకు గాను మొత్తం 14 రోజుల కార్యాచరణను రూపొందించారు. అందులో భాగంగా రెండు రోజులపాటు సమ్మె నిర్వహిస్తున్నారు. విశ్వవిద్యాలయాల కాలం చెల్లిన పెన్షన్ ఫండ్ పథకం కింద గత పదేళ్ళుగా యూనివర్సిటీలు పెన్షన్ ఫండుకు చెల్లింపులు చేయలేద ని లండన్ యూనివర్సిటి కాలేజి లెక్చరర్లు సమ్మె బాట పట్టారు.



సమ్మె

పెన్షన్లలో 40 శాతం కోత విధిస్తూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా లండన్‌లో సమ్మె చేస్తున్న లెక్చరర్లు

సిరియా సేనల దాడుల్లో 400 మందికి పైగా మృతి

సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్‌రైట్స్ వెల్లడి

డౌమా (సిరియా) : సిరియాలోని డౌమా పట్టణంపై ప్రభుత్వ సేనలు, మిత్రదేశం రష్యా సేనలు గత ఐదు రోజులుగా జరిపిన భూతల, వైమానిక దాడుల్లో 95 మంది చిన్నారులతో సహా మొత్తం 403 మంది పౌరులు మరణించారని లండన్‌కు చెందిన సిరియన్ అబ్జర్వేటరీ ఫర్ హ్యూమన్ రైట్స్ వెల్లడించింది. తూర్పు ఘౌట ప్రాంతంపై జరిగిన తాజా బాంబింగ్‌లో అనేక మంది మరణించటంతో సిరియా సేనలు గత ఐదు రోజులుగా జరుపుతున్న దాడుల్లో మరణించిన వారి సంఖ్య 400 దాటినట్లు ఈ సంస్థ ఒక ప్రకటనలో వివరించింది. గురువారం ఒక్కరోజు వైమానిక, భూతల దాడుల్లో దాదాపు 46 మందికి పైగా మరణించారని వివరించిన అబ్జర్వేటరీ ఇప్పటికైనా ఏడున్నరేళ్ల ఈ రక్తపాతానికి తెరదించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రపంచ దేశాలకు విజ్ఞప్తి చేసింది. ఇదిలా వుండగా భీకరపోరులో చిక్కుకున్న తూర్పు ఘౌటా ప్రాంతం నుండి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు, వారికి అవసరమైన సాయం అందించేందుకు సంబంధించిన ముసాయిదా తీర్మానానికి తాము చేసిన సవరణ ప్రతిపాదనలు వీగిపోవటంతో సిరియాలో నెల రోజుల పాటు కాల్పుల విరమణ పాటించాలన్న ప్రతిపాదనపై ఏకాభిప్రాయం కుదరలేదని సిరియా, దాని మద్దతుదారు రష్యా వెల్లడించాయి. ప్రభుత్వ సేనలు ఆస్పత్రులు, ప్రభుత్వ భవనాల వంటి వాటిని వేటినీ వదలకుండా బాంబుల వర్షం కురిపిస్తుండటంతో ప్రజలు భూగర్భంలోని షెల్టర్లలో తలదాచుకుంటున్నారని భద్రతా మండలిలో వివిధ దేశాల దౌత్యవేత్తలు శుక్రవారం నాటి చర్చలో ఆందోళన వ్యక్తం చేశారు.

అమెరికా నుండి ప్రచారం మానుకోండి

వెనిజులా ప్రతిపక్ష నేతకు హితవు

కారకస్ : వెనిజులా ప్రతిపక్ష నేత జూలియో బోర్జెస్ తన రాజకీయ ప్రచారాన్ని దేశంలోనే నిర్వహించుకోవాలని జాతీయ రాజ్యాంగ నిర్ణయాక అసెంబ్లీ (ఎఎన్‌సి) అధ్యక్షుడు డెల్సీ రొడ్రిగజ్ కోరారు. అమెరికా నుండి ప్రచారాన్ని నిర్వహించడాన్ని ఆమె విమర్శించారు. ఏప్రిల్ 22న అధ్యక్ష ఎన్నికల అనంతరం సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు యోచించడాన్ని తప్పు పడుతూ ప్రతిపక్ష నేత బోర్జెస్, మెగా ఎన్నికల ప్రతిపాదనతో అధ్యక్షుడు తప్పు చేస్తున్నారని, ఆయనకు రోజులు దగ్గరపడ్డాయని విమర్శించారు. 'విదేశాల్లో వుండి రాజకీయాలు చేయడం కాదు, స్వదేశానికి రండి, ఇక్కడ రాజకీయాలు చేయండి' అని డెల్సీ ట్విట్టర్ వేదికగా తీవ్రంగా వ్యాఖ్యానించారు.

కాలిఫోర్నియా, మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మాణం ప్రారంభం

వాషింగ్టన్ : కాలిఫోర్నియా, మెక్సికోల మధ్య సరిహద్దులో గోడ నిర్మాణాన్ని అమెరికా ప్రభుత్వం ప్రారంభించింది. 1990వ దశకంలో నిర్మించిన కంచె స్థానంలో ఇప్పుడు గోడను నిర్మిస్తున్నారు. అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలోనే సరిహద్దు గోడ నిర్మిస్తానని ట్రంప్ హామీ ఇచ్చారు. మెక్సికోలోని మెక్సికలికి, కాలిఫోర్నియాలోని కాలెక్సికోకి మధ్య మూడు కిలోమీటర్ల పొడవునా గోడ నిర్మిస్తున్నారు. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ కార్యాలయం ఈ ప్రాజెక్టును నిర్వహిస్తోంది. నెబ్రాస్కాకి చెందిన ఎస్‌డబ్ల్యుఎఫ్ కన్‌స్ట్రక్టర్స్ గత నవంబరులో కోటీ 80లక్షల డాలర్లకు ఈ కాంట్రాక్టును పొందారు. మొత్తం నిర్మాణానికి 10నెలల సమయం పడుతుందని భావిస్తున్నారు.

వేతన పెంపు కోరుతూ

పశ్చిమ వర్జీనియాలో టీచర్ల సమ్మె

మూడు దశాబ్దాల్లో మొదటిసారి

వాషింగ్టన్ : దాదాపు మూడు దశాబ్దాల కాలంలో మొదటిసారిగా పశ్చిమ వర్జీనియాలో ఉపాధ్యాయులు సమ్మె చేశారు. 15వేలమంది టీచర్లు, స్కూలు బస్సు డ్రైవర్లు, ఇతర సిబ్బంది తమ విధులను బహిష్కరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ నిరసన గురు, శుక్రవారాల్లో జరుగుతోంది. అమెరికాలో కెల్లా అత్యంత తక్కువ వేతనాలు వున్నది పశ్చిమ వర్జీనియా టీచర్లకే. వీరు ఇప్పుడు తమ వేతనాలు పెంచాలని ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ నిర్వహణలోని ప్రభుత్వ ఉద్యోగుల బీమా సంస్థ (పిఇఐఎ) విధించిన ఆరోగ్య సంరక్షణ వ్యయాలను తగ్గించాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు సమ్మెలు చేయరాదంటూ విధించిన నిషేధాన్ని ధిక్కరించి మరీ వీరు ఈ నిరసనకు దిగారు. సమ్మె చేసిన పక్షంలో జరిమానాలు విధించడం, మూకుమ్మడిగా విధుల నుండి తొలగించడం, జైలుకు పంపడం వంటి చర్యలను ప్రభుత్వం తీసుకుం టుంది. కాగా సమ్మెపై అటార్నీ జనరల్ పాట్రిక్ మోర్సీ వ్యాఖ్యానిస్తూ, విధులను బహిష్కరించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. వెంటనే విధులకు హాజరు కావాలని స్కూలు బోర్డులు, సూపరింటెండెంట్లు ఆదేశాలు జారీ చేయాలని, తాను కూడా వాటికి మద్దతిస్తానని చెప్పారు.



ఇద్దరు ట్రంప్ సలహాదారులు వైదొలగే అవకాశాలు?

వాషింగ్టన్ : అధ్యక్షుడు ట్రంప్‌తో ఇద్దరు ఉన్నత స్థాయి సలహాదారులకు దీర్ఘకాలంగా వున్న విభేదాలు పెరుగుతున్నాయని, ఏదో ఒక సమయంలో ఆ ఉద్రిక్తతల కారణంగా వారు రాజీనామా చేసే అవకాశాలు వున్నాయని సీనియర్ పాలనా యంత్రాంగ అధికారులు పేర్కొన్నారు. ఆ ఇద్దరు జాతీయ భద్రతా సలహాదారు హెచ్.ఆర్.మెక్‌మాస్టర్, వైట్‌హౌస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ జాన్ కెల్లీలు. వీరు ఇరువురూ సైనికాధికారులే. వీరు వైట్‌హౌస్‌పై సాధారణ ప్రభావమే చూపినా అధ్యక్షుడు ట్రంప్‌పై ఒక మోస్తరు ప్రభావాన్ని కనపరిచారని అమెరికా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అంతర్జాతీయ కూటములు ముఖ్యంగా నాటో వంటి సంస్థల ప్రాముఖ్యతను ట్రంప్‌కు నొక్కి చెప్పారు. ఇప్పుడే కాకపోయినా సమీప భవిష్యత్తులోనైనా వీరిద్దరిలో ఒకరైనా, లేదా ఇద్దరైనా వైదొలగే అవకాశం వుందని అడ్మినిస్ట్రేటివ్ అధికారులు తెలిపారు. అయితే వైట్‌హౌస్ ప్రతినిధి రాజ్ షా స్పందిస్తూ, అధ్యక్షుడు ట్రంప్‌కు తన బృందంలోని ప్రతి ఒక్క సభ్యుడిపైనా నమ్మకం వుందని చెప్పారు. మెక్ మాస్టర్ పట్ల ట్రంప్‌కు పూర్తి స్థాయి విశ్వాసం వుందని పత్రికా విభాగ కార్యదర్శి సారా శాండర్స్ తెలిపారు. కాగా వీటిపై సలహాదారులిద్దరూ వ్యాఖ్యానించలేదు.

'గ్రే లిస్ట్'లోకి పాకిస్తాన్ : ఎఫ్‌ఎటిఎఫ్

న్యూఢిల్లీ : ఉగ్రవాద సంస్థలకు ఆర్థిక అండదండలందిస్తున్న ఆరోపణలెదుర్కొంటున్న పాకిస్తాన్‌పై నిఘా పెంచుతూ ఆ దేశాన్ని 'గ్రే లిస్ట్'లో చేర్చాలని ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్‌ఫోర్స్ (ఎఫ్‌ఎటిఎఫ్) నిర్ణయించింది. 1989లో ఏర్పడిన ఈ అంతర్ ప్రభుత్వ వ్యవస్థలో వివిధ దేశాల ప్రభుత్వ ప్రతినిధులు సభ్యులుగా వుంటారు. ఉగ్ర ఆర్థిక సాయం, మనీలాండరింగ్ వంటి అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు చేటు కలిగించే నేరాలపై పోరులో అవసరమైన ప్రమాణాలను నెలకొల్పడం, వాటిని అమలు చేసేందుకు అవసరమైన చట్టపరమైన, నియంత్రణా, నిర్వహణా చర్యలు తీసుకోవటం ఈ వ్యవస్థ ఏర్పాటు ముఖ్యోద్దేశం. పాకిస్తాన్‌ను గ్రేలిస్ట్‌లో పెట్టాలన్న ప్రతిపాదనపై తొలుత వ్యక్తం చేసిన అభ్యంతరాన్ని చైనా ఉపసంహరించుకోవటంతో ఈ అంశంపై ఏకగ్రీవ నిర్ణయానికి మార్గం సుగమమైంది. ఉగ్ర ఆర్థిక సాయం విషయంలో పాకిస్తాన్‌ను గ్రేలిస్ట్‌లో పెట్టే అంశంపై జరిగిన ప్రాథమిక చర్చలో ఏకాభిప్రాయం కుదరని విషయం తెలిసిందే. ఈ అంశంపై ఇంకా తుది నిర్ణయం వెలువడాల్సి వున్నందున దీనిపై ఇప్పుడే స్పందించటం 'తొందర పాటు' అవుతుందని అమెరికా, భారత్ అధికారులు అంటున్నారు. ఉగ్ర ఆర్థిక సాయం విషయంలో పాక్‌పై నిఘా వుంచాలన్న ప్రతిపాదనపై తొలి విడత జరిగిన చర్చలో ఏకాభిప్రాయం కుదరకపోవటంతో తాము అంతర్జాతీయ వత్తిడిని ఎదుర్కొనే విషయంలో విజయం సాధించినట్లు పాక్ విదేశాంగ మంత్రి క్వాజా ఎం ఆసిఫ్ ప్రకటించిన విషయం తెలిసిందే. మనీ లాండరింగ్ ఆరోపణల విషయంలో పాకిస్తాన్ గతంలో 2012 నుండి 2015 వరకూ ఎఫ్‌ఎటిఎఫ్ నిఘాలో వున్న విషయం తెలిసిందే.

బ్రిటన్‌పై బ్రెగ్జిట్ ప్రభావం

తగ్గుతున్న ఇయు జాతీయుల వలసలు

లండన్ : బ్రిటన్‌పై బ్రెగ్జిట్ ప్రభావం కనిపిస్తోంది. ఈ దేశానికి వస్తున్న యురోపియన్ యూనియన్ పౌరుల సంఖ్య తగ్గిపోతోందని జాతీయ గణాంకాల కార్యాలయం (ఒఎన్‌ఎస్) తెలిపింది. బ్రిటన్‌కు వెళ్ళే, వచ్చే ఇయు జాతీయుల సంఖ్య 2014లో నమోదైన స్థాయిలో వుందని పేర్కొంది. 2015, 2016ల్లో రికార్డు స్థాయిల్లో వలసలు నమోదయ్యాయి. 2017 సెప్టెంబరుతో ముగిసిన ఏడాదిలో వలసల సంఖ్య 2,44,000గా వుంది. బ్రిటన్ నుండి వెళ్ళిపోయిన సంఖ్యను వచ్చిన వారి నుండి తీసివేయగా వచ్చిన వలసల సంఖ్య ఇది. మొత్తంగా 5,78,000మంది రాగా, 3,34,000మంది వెళ్లిపోయారు. యురోపియన్ దేశాల నుండి బ్రిటన్‌కు వస్తున్న వారి సంఖ్య కన్నా ప్రపంచంలోని నలుమూలల నుండి బ్రిటన్‌కు వస్తున్నవారి సంఖ్య ఎక్కువగా వుందని ఓఎన్‌ఎస్ తెలిపింది. ఆసియా పౌరుల్లో ఎక్కువమంది చదువు కోసమే బ్రిటన్‌కు వస్తున్నారు. ఇయు యేతర దేశాల నుండి బ్రిటన్‌కు వలస వస్తున్నవారు 2,05,000 మంది వుండగా అందులో 1,35,000మంది ఆసియా పౌరులు కాగా మిగిలిన 60వేల మంది ఇయుయేతర జాతీయులే.

బ్రెగ్జిట్ వ్యూహంపై వచ్చే వారం బ్రిటన్ ప్రధాని నిర్ణయం

లండన్ : బ్రెగ్జిట్ సమయంలో ఏ విధంగా ముందుకు సాగాలో బ్రిటన్ ప్రధాని థెరిస్సా మే వచ్చే వారం నిర్ణయించనున్నారు. బ్రెగ్జిట్ కోసం అనుసరించే వ్యూహంపై థెరిస్సా బృందంలోనే విభేదాలు వున్నాయి. పైగా యురోపియన్ యూనియన్ ప్రతినిధులను కూడా ఈ విభేదాలు అసహనానికి గురి చేస్తున్నాయి. ఆ విబేధాల పరిష్కారానికి వచ్చే వారంలో ఉన్నత సహాయకులతో థెరిస్సా సమావేశం జరపనున్నారు. గత 40ఏళ్ళకు పైగా యురోపియన్ యూనియన్‌తో బ్రిటన్‌కు గల అనుబంధాన్ని తెగతెంపులు చేసుకునేందుకు అనుసరించే విధానంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. కార్ల రంగం నుండి డిజిటల్ వాణిజ్యం వరకు విస్తృతమైన అంశాలపై దాదాపు ఎనిమిది గంటల పాటు తన బృందంతో చర్చించినట్లు థెరిస్సా తెలిపారు. ఇయుకి వెలుపల బ్రిటన్ దార్శనికత ఎలా వుండాలనే విషయమై ఒక ఒప్పందానికి రావడానికి థెరిస్సా ఈ సమావేశంలో ప్రయత్నించారు. 'రోడ్ టు బ్రెగ్జిట్' సిరీస్‌లో భాగంగా థెరిస్సా ఈ ప్రసంగం చేయనున్నారు.

మొదటి పేజీ తరువాయి

ఇంటర్ పరీక్షల కోసం యాప్

బోర్డు కార్యదర్శి ఉదయలక్ష్మి చెప్పారు.

గ్రేడింగ్ విధానంలో ఫలితాలు

ఈ ఏడాది ర్యాంకులు కాకుండా గ్రేడుల విధానంలో ఫలితాలు విడుదల చేయాలని నిర్ణయించారు. శుక్రవారం నుంచే విద్యార్థులు హాల్ టికెట్లను jnanabhumi.ap.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని, ప్రిన్సిపాల్ చేత ధ్రువీకరించుకోవాల్సివుంది. ఫీజులు చెల్లించలేదన్న పేరుతో విద్యార్థుల హాల్ టికెట్లు ఆపితే ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకుంటామని మంత్రి గంటా హెచ్చరించారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలను తెలుసుకోవడానికి ఇబ్బందిపడకుండా 'ఐపిఇ (ఇంటర్మీడియేట్ పబ్లిక్ ఎగ్జామినేషన్) సెంటర్ లోకేటర్ యాప్'ను రూపొందించామని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల్లోకి ఏటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలనూ అనుమతించరు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే నాలుగేళ్ల (ఎనిమిది పరీక్షలు) పాటు డిబార్ చేస్తామని హెచ్చరించారు. పేపర్ లీకేజ్ వదంతులు నమ్మొద్దని, నిజంగా లీకైతే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రతి రోజు ఇన్విజిలేటర్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, పరిసర ప్రాంతాల్లో జిరాక్స్ సెంటర్ల మూసి వేయాలని ఆదేశించారు. పరీక్షలను సమర్థంగా నిర్వహించేందుకు ఆయా జిల్లా కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా కోఆర్డినేషన్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు కరెంట్ కోతలు, రవాణా సౌకర్యాలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులతో చర్చించామన్నారు. సిట్టింగ్ స్క్వాడ్స్‌తో పాటు, ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను నియమించామని చెప్పారు. సమస్యలుంటే 0866-2974130, ఫాక్స్ నెంబర్ 0866-2970056, టోల్ ఫ్రీ నెంబర్ 18002749868కు తెలియజేయవచ్చని సూచించారు.

ఉగ్రవాదం, వాణిజ్యం

తమకు సహజ భాగస్వామ్య దేశమని అభివర్ణించారు. అంతకు ముందు విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ కెనడా ప్రధానిని కలిసి ఇరుదేశాల సంబంధాలు, ఇతర ప్రాధాన్యతాంశాలపై చర్చించారు. ట్రూడోతో సుష్మ భేటీ సుహృద్భావ వాతావరణంలో సాగిందని, ఇరుదేశాల మధ్య సంబంధాలు, భాగస్వామ్యాన్ని బలోపేతం చేసే అంశంపై ఇరువురు నేతలూ చర్చించారని విదేశాంగశాఖ ప్రతినిధి రావీష్‌కుమార్ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

గిరిజనులకూ ఇన్నోవా కార్లు

మార్చిలోగా అమలుకు ట్రైకార్ కసరత్తు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ (ట్రైకార్) ద్వారా లబ్ధిదారులకు 150 ఇన్నోవా, మరో 80 బొలెరో వాహనాలు అందజేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఎస్సీ కార్పొరేషన్ లబ్ధిదారులకు ఇన్నోవా కార్లు పంపిణీ చేసిన నేపథ్యంలో, ఎస్టీలకు కూడా ట్రైకార్ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరంలోనే (వచ్చే మార్చిలోగా) కార్లను ఇవ్వాలని నిర్ణయించారని సమాచారం. ప్రస్తుతం అధికారులు లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నారు. కనీసం పదో తరగతి చదువుకుని, డ్రైవింగ్ లైసెన్స్ సహా బాడ్జీ ఉన్న ఎస్టీ నిరుద్యోగులు ఈ పథకానికి అర్హులు. ఇన్నోవా కారు రూ. 16.6 లక్షలు, బొలెరో రూ. 9.6 లక్షలుగా యూనిట్ ధరను నిర్ణయించారు. లబ్ధిదారునికి ఈ ధరలో 25 శాతం వరకు సబ్సిడీ ఇస్తారు. లబ్ధిదారుడు రూ. 80 వేల నుంచి లక్ష వరకు భరించాల్సివుంటుంది. మిగతా మొత్తాన్ని బ్యాంకు రుణంతో సంబంధం లేకుండా, నేషనల్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎస్‌టిఎఫ్‌డిసి) నిధుల నుంచి రుణంగా ఇవ్వాలని నిర్ణయించారు. అయిదేళ్ల కాలవ్యవధిలో లబ్ధిదారులు ఈ రుణాన్ని వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించాల్సివుంటుంది.

ఒకే యూనిట్‌కు ఇద్దరేసి లబ్ధిదారులా?

ఒక వాహనానికి ఒకరినే కాకుండా ఇద్దరేసి లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిసింది. ఈ పద్ధతిలో ఎంపిక విధానం వల్ల ఒక కారుకు ఉండే ఇద్దరు లబ్ధిదారుల్లో ఒకరు నామమాత్రమై, మరొకరు (వాటా భరించగల) మరొకరే వాస్తవంగా లబ్ధిపొందే వీలుంటుందని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ విధానంలో మంత్రుల సిఫారసులు, పలుకుబడిగల అధికారపార్టీ నేతల అండదండలుగల, లబ్ధిదారులే ఎక్కువ మంది ఎంపికయ్యే వీలుంటుందనీ పలువురు అనుమానపడుతున్నారు. గిరిజనాభివృద్ధికి సంబంధించిన వివిధ ప్రభుత్వ విభాగాలు, సంస్థలకు ఈ వాహనాలనే అద్దెకు తీసుకుని లబ్ధిదారులు రుణాన్ని సక్రమంగా తీర్చుకోగలిగే వెసులుబాటును కల్పించాలనే యోచన ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

రెండు నుంచి థియేటర్ల బంద్!

(మొదటిపేజీ తరువాయి)

వచ్చారు. మార్చి రెండో తేదీ నుంచి కొత్త సినిమాలు విడుదల చేయకూడదని నిర్ణయం తీసుకున్నారు.

అసలు ఏం జరిగింది?

గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్(జీఎస్‌టీ), స్థానిక సంస్థల వినోదపు పన్నుతో ఇప్పటికే ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు నిర్మాతలు, పంపిణీదారులు. కొత్తగా వచ్చిన సాంకేతిక పరిణామం వల్ల థియేటర్లలో సినిమాల ప్రదర్శనకు డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లు (క్యూబ్, యుఎఫ్ఒ)ను తీసుకొచ్చారు. ఈ సర్వీస్ ప్రొవైడర్లు వారికి నచ్చినట్టు అద్దెలను వసూలు చేస్తున్నారని నిర్మాతల ఆరోపణ. కొన్ని రాష్ట్రాల్లో వారానికి ఒక సినిమా ప్రదర్శనకు పది వేలు అయితే మరో రాష్ట్రంలో నాలుగు నుంచి ఎనిమిది వేలు వసూలు చేస్తున్నారు. వీటి వల్ల ఇబ్బందులు పడుతున్నామని అద్దెలు తగ్గించాలని నిర్మాతలు చాలా కాలంగా విన్నవిస్తున్నారు. కానీ సర్వీస్ ప్రొవైడర్లు మాత్రం పట్టించుకోలేదన్నది వారి ఆరోపణ. వాస్తవంగా సర్వీస్ ప్రొవైడర్లు ఎంత వసూలు చేస్తున్నారు? ఎంత వసూలు చేయాలి? అన్న దానిపై ఇప్పటికీ ఓ స్పష్టత రాలేదు. ఈ అద్దెలు రాష్ట్రాలను బట్టి మారుతున్నాయని కూడా అంటున్నారు. అద్దెలు తగ్గించే విషయంలో సర్వీస్ ప్రొవైడర్లను తమదారికి తెచ్చుకోవడానికి నిర్మాతలు, పంపిణీదారులు సమ్మెకు తెరతీశారు. డిసెంబర్ నుంచి మార్చి లోపు చర్చలతో సమస్య పరిష్కారమైతే సరే సరి.. లేకపోతే మార్చి రెండో తేదీ నుంచి థియేటర్లలో సినిమాలు ప్రదర్శించకూడదనీ, కొత్తవి విడుదల చేయకూడదని నిర్ణయం తీసుకున్నారు. దీంతో డిసెంబర్ నుంచీ ఈ విషయంపై చర్చలు జరుగుతూనే ఉన్నాయి. అవి ఇప్పటికీ ఓ కొలిక్కి రాలేదు. ఇప్పటికే హైదరాబాద్, చెన్నైలో రెండేసి దఫాలు చర్చలు జరిపారు. తాజాగా బెంగళూరులో శుక్రవారం మరోమారు చర్చించారు. కానీ సఫలం కాలేదు. అందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తుంది.

ఇంకా చర్చిస్తున్నాం: డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్

ఈ విషయమై సర్వీస్ ప్రొవైడర్లకు చెందిన హైదరాబాద్ నాయకులు ప్రవీణ్, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఇంకా తుది నిర్ణయం ఏదీ తీసుకోలేదనీ, తాము చర్చలు జరుపుతున్నామని వెల్లడించారు. పంపిణీదారులు, నిర్మాతలు చెబుతున్నట్లు ఎక్కువ మొత్తాన్ని మేం ఆశించడం లేదని పేర్కొన్నారు. చిన్న, పెద్ద చిత్రాలకు సంబంధించిన రేటు విషయంలో చిన్నపాటి భేదాలున్నాయని చెప్పారు. ఆ విషయాలను చర్చించి అతి త్వరలో పరిష్కారం చేయనున్నామని తెలిపారు. నిర్మాతలు ఇచ్చిన గడువు ఐదు రోజులే ఉండడంతో ఉత్కంఠ నెలకొంది.

ఫైళ్లన్నీ ఆన్‌లైన్‌లోనే

(మొదటిపేజీ తరువాయి)

(ఐఎస్‌బి) ప్రతినిధులను ఆదేశించామన్నారు. మార్చి నాటికి అన్ని ఫైల్స్ ఆన్‌లైన్‌లో తీసుకువస్తామన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబంలో ఒకరు డిజిటల్ లిటరేటర్‌గా, పారిశ్రామికవేత్తగా ఎదిగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.దేశంలో అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వీస్ ప్రొవైడ్ చేసేలా మన ఇ - ప్రగతి కార్యాలయంను తీర్చిదిద్దుతామని చెప్పారు. ఇ - ప్రగతి ద్వారా ఫైళ్లను నిమిషాలలో పరిష్కరించవచ్చని ముఖ్యమంత్రి అన్నారు. దీనితో ప్రజలకు వేగవంతమైన, పారదర్శక పాలన అందించేందుకు వీలుంటుందన్నారు. తను రాజకీయాల్లో మొదటిసారిగా ఎన్నికై ఈ నెల 27 నాటికి నలభై ఏళ్లు పూర్తవుతుందన్నారు. గతంలో పాలనలో కంప్యూటరీకరించినప్పుడు ప్రతి ఒక్కరూ తనపై కోపంగా ఉండేవారని, ఇప్పుడు వారే టెక్నాలజీ వల్ల ఎంజాయ్ చేస్తున్నారని చెప్పారు. టెలికమ్యూనికేషన్స్‌లో సంస్కరణలు తీసుకురావడంలో అప్పట్లో తమ కమిటీ ఇచ్చిన సిఫార్సులే కారణమన్నారు. దానివల్లే నేడు ప్రజలకు ఇంటర్‌నెట్, వాయిస్ కాల్స్ అందుబాటులకి వచ్చాయన్నారు. ఇ - ప్రగతిలో కార్యక్రమం రెండో దశ కింద అన్ని శాఖాధిపతులకు, అధికారులకు రెండు నెలలపాటు శిక్షణ ఇస్తామని సిఎం అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఐఎస్‌బి, హాంకాంగ్ యూనివర్శిటీలు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తాయన్నారు. ఐటి, పంచాయతీరాజ్ మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ పాలనలో మార్పులు తీసుకురావడం అంత సులభం కాదని, నాయకులు తమ శాఖల మార్పుకు కృషి చేయాలని సూచించారు. ఇ - ప్రగతి ద్వారా అభివృద్ధితోపాటు సాంకేతిక పరిజ్ఞానంలో వినూత్న మార్పులు వస్తాయన్నారు. సోషల్ మీడియా ప్రస్తుతం టెక్నాలజీలో ప్రధాన పాత్ర పోషిస్తోందన్నారు. ఈ సందర్భంగా 51 శాఖల నుంచి 96 మంది అధికారులు ఇ - ప్రగతిలో ఐఎస్‌బి శిక్షణ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి చేతుల మీదుగా సర్టిఫికెట్లు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పత్తిపాటి పుల్లారావు, నక్కా ఆనందబాబు, ఐటి సెక్రటరీ కె. విజయానంద్, ఐటి అడ్వైజర్ జె. సత్యనారాయణ, ఇ-ప్రగతి సిఇఒ బాలసుబ్రహ్మణ్యం, ఐఎస్‌బి డీన్ శ్రీవాత్సవ, శ్రీనిరాజ్ పాల్గొన్నారు.

15న జాతీయ స్థాయిలో నిరసన దినం

(మొదటిపేజీ తరువాయి)

కల్పించంచటంతోపాటు ఔట్‌సోర్సింగ్‌ను ప్రోత్సహించటం ద్వారా సార్వభౌమత్వానికి చేటు చేస్తోందని కార్మిక సంఘాలు ఈ ప్రకటనలో విమర్శించాయి. ఈ నెల 1వ తేదీన ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ ప్రాథమికంగా కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక వైఖరితో వుందని, ఎటువంటి వనరుల కేటాయింపూ లేకుండానే ప్రజాకర్షక నినాదాలతో ప్రజలను ప్రభుత్వం మోసం చేస్తోందని కార్మిక సంఘాలు విమర్శించాయి. కేంద్రం అనుసరిస్తున్న ఈ వైఖరిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధం కావాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగానే మార్చి 15న దేశవ్యాప్తంగా నిరసన దినాన్ని పాటించాలని నిర్ణయించినట్లు ఈ ప్రకట నలో వెల్లడించాయి. ఈ భేటీలో సిఐటియు, ఐఎన్‌టియుసి, ఎఐటియుసి, హెచ్‌ఎంఎస్, ఎఐయుటియుసి, టియుసిసి, సేవా, ఎఐసిసిటియు, యుటియుసి, ఎల్‌పిఎఫ్ తదితర కార్మిక సంఘాల నేతలు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్నికల బడ్జెట్

(మొదటిపేజీ తరువాయి)

ఈ నిర్ణయమైతే తీసుకున్నారని, ఎంతవరకు పెంచాలనే అంశం మీద తుది కసరత్తు సాగుతోందని అధికారులు చెబుతున్నారు. స్వీయ రక్షణ కోసం మహిళలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు అమలు చేయాలనుకుంటున్నారు. యువత కోసం అంతర్జాతీయ స్థాయిలో యువభేరి కార్యక్రమాన్ని నిర్వహించేందుకు, పోటీ పరీక్షలకు ప్రత్యేకంగా ఉచిత శిక్షణ ఇచ్చేందుకు ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు చేశారు. జిల్లా స్థాయిలో ఉచిత క్రీడా పరికరాల పంపిణీపైనా ప్రతిపాదనలు వచ్చాయి. వీటికీ బడ్జెట్‌లో కేటాయింపులుండే వీలుంది. రైతుల కోసం వ్యవసాయ రంగానికి నిధులను ఎక్కువ కేటాయించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. వీటన్నింటినీ నిశితంగా పరిశీలిస్తున్నారు.

హెచ్-1బి వీసాలకు కొత్త పద్ధతి

(మొదటిపేజీ తరువాయి)

బ్యాంకింగ్, పర్యాటకం, వాణిజ్య సేవల వంటి రంగాలన్నీ తమకు సంబంధించిన పనుల కోసం భారత్‌కు చెందిన ఆన్‌సైట్ వర్కర్లపైనే ఎక్కువగా ఆధారపడుతున్నాయి.

గురువారం ప్రకటించిన కొత్త విధానం ప్రకారం అమెరికా పౌరసత్వ, ఇమిగ్రేషన్ సర్వీసెస్ విభాగం థర్డ్ పార్టీ వర్క్‌సైట్‌లో నియమితులైన ఉద్యోగికి వారి పని వున్నంత కాలానికి మాత్రమే ఈ హెచ్-1బి వీసాలను జారీ చేస్తుంది. సందర్భానుసారంగా ఈ వీసాల కాల పరిమితి మూడేళ్లలోపే వుండే అవకాశాలే ఎక్కువగా వున్నాయి. మూడేళ్ల కాలపరిమితికి ఒకేసారి వీసాలు జారీ చేస్తున్న ప్రస్తుత విధానానికి కొత్త విధానంతో తెరపడనుంది. ప్రకటించిన తక్షణమే అమలులోకి వచ్చిన కొత్త విధానంతో హెచ్-1బి వీసాల జారీ సీజన్ ప్రారంభానికి ముందే కొత్త మార్గదర్శకాలు జారీ కానున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ 1 నుండి ప్రారంభమయ్యే 2019 ఆర్థిక సంవత్సరానికి హెచ్-1బి వీసాల జారీ ప్రక్రియ ఏప్రిల్ 2 నుండి ప్రారంభం కానున్న విషయం తెలిసిందే.

విద్యుత్ కార్మికులకు సిఎం న్యాయం చేయలేమన్నారు

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ కార్మికులందరికీ ఈ సమయంలో న్యాయం చేయడం కష్టమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నట్లు సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరావు చెప్పారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ముప్పాళ్ల, అగ్రిగోల్డ్ బాధిత సంఘం నాయకులు శుక్రవారం సాయంత్రం ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. అనంతరం ముప్పాళ్ల నాగేశ్వరరావు మీడియాతో మాటాడారు. అగ్రిగోల్డ్ సమస్యతో పాటు విద్యుత్ కార్మికుల సమస్యలను తాము సిఎం దృష్టికి తీసుకెళ్లామన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు తక్షణ ఉపశమనం కోసం వచ్చే బడ్జెట్‌లో రూ.4 వేల కోట్లు ఇవ్వాలని తాము అడిగామన్నారు. ఎస్సెల్ గ్రూపు టేకోవర్ తరువాత ఆ గ్రూపు నుంచి ప్రభుత్వం డబ్బు వెనక్కి తీసుకోవచ్చని తాము సిఎం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఇంతవరకు అగ్రిగోల్డ్ ఏజెంట్లు, ఖాతాదారుల ఆత్మహత్యల వివరాలను ఈ సందర్భంగా సిఎంకు తెలిపామ న్నారు. మరణించిన వారికి నష్ట పరిహారం చెల్లింపుల్లో జాప్యాన్ని వివరించామన్నారు. ఎస్సెల్ గ్రూపు అగ్రిగోల్డ్ సంస్థను టేకోవర్ చేస్తోన్న సమయంలో ఇక ప్రభుత్వ నిధులు కేటాయిం చాల్సిన అవసరం ఏముందని చంద్రబాబు ప్రశ్నించారన్నారు. అగ్రిగోల్డ్ ఆర్థిక మోసంతో చనిపోయిన వారికి మాత్రం వచ్చే నెల ఒకటో తేదీ నుంచి రూ.5 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ నేత ముప్పాళ్ల తెలిపారు.

23న రాజ్యసభ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

మే నెలల్లో ముగియనుండటంతో ఆయా స్థానాలకు ఈసీ ఎన్నికలు నిర్వహించనుంది. ఆంధ్రప్రదేశ్‌లో కె.చిరంజీవి, రేణుక చౌదరి, టి.దేవేందర్ గౌడ్, తెలంగాణలో సి.ఎం రమేష్, రాపోలు ఆనంద్ భాస్కర్, పాల్వాయి గోవర్ధన్ రెడ్డిల పదవీ కాలం ఏప్రిల్ 2తో ముగియనుంది. పాల్వాయి గోవర్ధన్ రెడ్డి ఇటీవలే మృతి చెందారు. రిటైరయ్యే వారిలో నలుగురు కాంగ్రెస్ సభ్యులు కాగా, ఇద్దరు టిడిపి సభ్యులు. దేశవ్యాప్తంగా రిటైరయ్యే ప్రముఖుల్లో కేంద్ర మంత్రులు అరుణ్ జైట్లీ, రవిశంకర్ ప్రసాద్, ధర్మేంద్ర ప్రదాన్, జెపి నడ్డా, ప్రకాశ్ జవదేకర్, తావర్ చంద్ గెహ్లాట్, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, నరేష్ అగర్వాల్, జయా బచ్చన్ తదితరులు వున్నారు.

ఏపిలో రెండు టిడిపి, ఒకటి వైసిపి

ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుత శాసనసభ్యుల సంఖ్యా బలం ప్రకారం ఖాళీ అయ్యే మూడు రాజ్యసభ స్థానాల్లో రెండు అధికార టిడిపి, ఒకటి ప్రతిపక్ష వైసిపి కైవశం చేసుకునే అవకాశముంది. ఒక రాజ్యసభ సభ్యుడు గెలుపొందేందుకు 44 మంది ఎమ్మెల్యేలు ఓటు వేయాల్సి ఉంది. గత ఎన్నికల్లో వైసిపి నుంచి 67 మంది ఎమ్మెల్యేలు గెలిచారు. అందులో 22మంది పార్టీ ఫిరాయించి, అధికార టిడిపిలో చేరారు. దీంతో వైసిపికి ప్రస్తుతం 45 మంది ఎమ్మెల్యేలున్నారు. కనుక ఒక రాజ్యసభ స్థానం వైసిపి సొంతం కానుంది. మిగిలిన రెండు స్థానాలు అధికార టిడిపి వశం కానున్నాయి.


టాక్సీ వాలా



విజయ్ దేవరకొండ

'అర్జున్ రెడ్డి' వంటి భారీ విజయం తర్వాత విజయ్ దేవరకొండ కొత్త చిత్రం ఇప్పటి వరకూ రాలేదు. తాజాగా ఈయన హీరోగా, రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో విభిన్నంగా ఉండే యాక్షన్ థ్రిల్లర్ ఒకటి రూపొందుతోంది. ఈ చిత్రానికి 'ఆటోవాలా' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సినిమాను సమ్మర్‌కు మే 18న విడుదల చేయాలని సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ఫస్ట్‌లుక్, టైటిలను ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు. ఇందులో ప్రియాంక జవాల్కర్ కథానాయిక చేస్తుంది. ఈ చిత్రంతోనే ఈమె అరంగేట్రం చేస్తుంది. ఇందులో ప్రియా వైద్యురాలు పాత్రలో మెప్పించబోతుంది. ఈమెతో పాటు మాళవికా నాయర్, కల్యాణి, మధునందన్, సిజ్జు మీనన్, రవి ప్రకాష్, రవి వర్మ, ఉత్తేజ్, విష్ణు తదితరులు నటిస్తున్నారు. జీఏ2, యువీ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈచిత్రానికి విజువల్స్ : సుజిత్, మ్యూజిక్ : జేమ్స్, మాటలు : కృష్ణకాంత్, స్టంట్స్ : జాషువా.

రజనీ కొత్త చిత్రం



రజనీకాంత్ సినిమాలకు స్వస్తి చెప్పి రాజకీయాలకు వెళ్లబోతున్నారని, ఇక నుంచి ఆయన హీరోగా సినిమాలు రావడం కష్టమేనని అందరూ అనుకున్నారు. అందుకే ఇప్పటికే ఉన్న సినిమాలనే పూర్తి చేసే పనిలో ఉన్నారని ప్రచారం జరిగింది. ఎందుకంటే కమల్ హాసన్ రాజకీయాలకు వెళ్లేముందే తన చేతిలో ఉన్న రెండు సినిమాలు పూర్తి చేసి ఇక నుంచి సినిమాలు చేయనని ప్రకటించారు. తెలుగు చిత్రసీమలో పవన్ కల్యాణ్ కూడా ఇక సినిమాలు చేయకపోవచ్చు అన్నట్టు చెప్పారు. ఈ కోణంలో రజనీకాంత్ కూడా అంతే అనుకున్నారు అంతా. కానీ యుద్ధం వచ్చినప్పుడు దాన్ని ఎదుర్కోవడానికి అభిమాలంతా సిద్ధంగా ఉండాలని చెబుతూ, మరో పక్క సినిమాలకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నారు ఈ సూపర్‌స్టార్. తాజాగా మరో చిత్రం చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ చిత్రానికి కార్తిక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించనున్నారు. కళానిధి మారన్ నిర్మించనున్నారు. సన్ పిక్చర్స్ బ్యానర్‌పై తెరకెక్కనుంది. ఈ విషయాన్ని కళానిధి మారన్ ట్విట్టర్‌లో ప్రకటించారు. ఈ సినిమాలో హీరోయిన్, ఇతర సిబ్బంది ఎవరు అన్నది ఇంకా తెలియాల్సి ఉంది. రజనీకాంత్ చేసిన 'కాలా' ఏప్రిల్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీని తర్వాత నెలలో గానీ '2.0' కూడా విడుదలకు సిద్ధమవుతుంది.

మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి



కల్యాణ్ రామ్, కాజల్

కల్యాణ్ రామ్, కాజల్ జోడీగా నటిస్తున్న సినిమా 'ఎంఎల్ఏ'. మంచి లక్షణాలు ఉన్న అబ్బాయి ఉపశీర్షిక. ఉపేంద్ర దర్శకత్వం వహిస్తున్నారు. కిరణ్ రెడ్డి, భరత్ చౌదరి నిర్మిస్తున్నారు. బ్లూ ప్లానేట్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లో రూపొందుతోంది. మణిశర్మ బాణీలు సమకూరుస్తున్నారు. ఈ చిత్రం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. కల్యాణ్ రామ్ కొత్తలుక్‌లోనూ, కాజల్ సంప్రదాయంగా కనిపించారు.

నా కనులే కనని ఆ కలనే కలిశా...



'కృష్ణార్జున యుద్ధం'లో నాని, రుక్సాన్

నాని హీరోగా మేర్లపాటి గాంధీ దర్శకత్వంలో రూపొందుతోన్న సినిమా 'కృష్ణార్జున విజయం'. ఈ చిత్రంలోని నాని ద్విపాత్రాభినయంలో ఎలా ఉంటాడో ఫస్ట్‌లుక్ ద్వారా వివరించారు. శుక్రవారం ఓ పాటను విడుదల చేశారు. నా కనులే కనని ఆ కలనే కలిశా.. నీ వలనే బహుశా ఈ వరస.. ఐ వన ఫై.. వన ఫై..' సాగే ఈ గీతంలో నాని పల్లెటూరి కుర్రాడిగా కనిపించారు. రుక్సార్, అనుపమ పరమేశ్వరన్ ఇద్దరూ కనిపించారు. ఎల్వీ రేవంత్, సంజిత్ హెగ్డే స్వరాలందించారు. షైన్ స్ట్రీన్స్ పతాకంపై సాహు గరకపాటి, హరీశ్ పెద్ది సినిమాను నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 12న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి విశ్వరఘు కొరియోగ్రఫీ, సత్య ఎడిటింగ్ బాధ్యతలు చూస్తున్నారు.

చిత్ర సమీక్ష

ఆకట్టుకున్న 'హైదరాబాద్ లవ్‌స్టోరీ'



తెలుగు సినిమాలో ప్రేమకథలు సర్వసాధారణం. ఎవరికి వారు తమ ఊహల్లోంచి పుట్టుకొచ్చిన కథలనే ప్రేమకథలుగా తెరకెక్కిస్తుంటారు. 'అలా ఎలా' అంటూ ఏడాదిక్రితం గ్రామీణ నేపథ్యంలో చక్కటి ప్రేమకథతో విజయాన్ని సొంతం చేసుకున్న కథానాయకుడు రాహుల్.. ఈసారి హైదరాబాద్ బేస్డ్ కథతో ముందుకొచ్చాడు. హైదరాబాద్ పేరుతో లవ్‌స్టోరీగా తెరకెక్కించిన రాజ్ సత్య కొత్త ప్రయోగమే చేశానని చెప్పాడు. నిర్మాణపు విలువలు కోసం శ్రమించామని చెప్పిన ఈ చిత్రం ఎలా ఉందో చూద్దాం.

సినిమా : హైదరాబాద్ లవ్‌స్టోరీ
నటీనటులు : రాహుల్ రవీంద్రన్, రేష్మీ మీనన్, జియా, రావు రమేష్, అంబటి, రమాప్రభ, షఫీ, సన, సూర్య, రచ్చ రవి తదితరులు
సాంకేతికత : కథ, డైలాగ్స్ , స్క్రీన్ ప్లే , దర్శకత్వం : రాజ్ సత్య, కెమెరామన్ : బి వీ అమర్నాథ్ రెడ్డి, మ్యూజిక్ : సునీల్ కశ్యప్, ఎడిటర్ : ఎం ఆర్ వర్మ, నిర్మాతలు : ఎం.ఎల్ రాజు, ఆర్.ఎస్ కిషన్, వేణు గోపాల్ కొదుమగుళ్ళ, బ్యానర్ : సినిమా పీపుల్, సమర్పణ : మాస్టర్ ప్రణవ్ తేజ్.

కథ : భాగ్యలక్ష్మి (రేష్మిమీనన్) మధ్యతరగతి యువతి. తండ్రి కారు మెకానిక్. భాగ్యలక్ష్మి సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగిని. మిత్రులతో పార్టీ చేసుకుని డ్రై చేస్తూ కారును ఢీకొడుతుంది. హైదరాబాద్‌లో ఎల్అండ్ టి ఫ్లయిఓవర్ వద్ద భాగ్యలక్ష్మి పరిస్థితి చూసి ఇంటికి చేరవేస్తాడు ఇంజనీర్ రాహుల్ (రాహుల్ రవీందర్). అలా అతన్ని మొదటి చూపులోనే ప్రేమించేస్తుంది. రాహుల్‌కు కూడా తనంటే ఇష్టమే. అయితే ఓ సంఘటనతో రాహుల్ గతాన్ని భాగ్యలక్ష్మి బయటపెట్టేస్తుంది. దాంతో రాహుల్ జంటిల్‌మేన్ కాదనీ, తనొక గే అనే భావనకు వచ్చేస్తుంది. నిదానంగా తనకు దూరంగా ఉంటుంది. విషయం తెలిసిన రాహుల్ ఫ్యామిలీ డాక్టర్ ఆమెకు అసలు నిజాన్ని వెల్లడిస్తాడు. అది ఏమిటి? ఆ తర్వాత ఏం జరిగింది? అనేది మిగిలిన సినిమా.

విశ్లేషణ : నటనా పరంగా రాహుల్ రవీంద్రన్ ప్రేమికుడిగా గత చిత్రాల్లో మాదిరిగా హావభావాలను చక్కగా పలికించాడు. భాగ్యలక్ష్మిగా రేష్మిమీనన్ చూడముచ్చటగా ఉంది. అమాయకత్వం కలగలిపిన పాత్రలో మెప్పించింది. డాక్టర్‌గా రావురమేష్ పాత్ర సరిపోయింది. సాఫ్ట్‌వేర్ కంపెనీ నడిపే వ్యక్తిగా అంబటి శ్రీను నటించాడు. తను ఎంటర్‌టైన్ చేయాలని ప్రయత్నించాడు. రాహుల్ తల్లిదండ్రులుగా సన, సూర్య చేశారు. వీరుకాక సినిమాకు కీలకంగా మారిన ముస్లిం పాత్రను అజయ్ చేశాడు. ఇలా ప్రతివారూ తమ పాత్రలకు న్యాయం చేశారు.

సాంకేతికత : సాంకేతికపరంగా కెమెరామెన్ పనితనం బాగుంది. సంగీతపరంగా సునీల్ కశ్యప్ బాణీలు కొత్తవికాకపోయినా వినసొంపుగానే ఉన్నాయి. దర్శకుడు రాజ్ సత్య తీసుకున్న అంశం కాస్త ప్రయోగమే చెప్పాలి. రొటీన్ ప్రేమకథే అయినా దానికి హిందూ, ముస్లిం అనే తారతమ్యాలు ప్రేమకు లేవనే విషయాన్ని చెప్పదలిచాడు. అది ప్రేమికుల మధ్య కాకుండా... బాల్యస్నేహితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తుల కథను తీసుకున్నాడు. ఓ అనాధను రాహుల్ తన తల్లిదండ్రుల సహకారంతో సొంత తమ్ముడుగా భావించి తీసుకున్న నిర్ణయం ఇందులో కీలకం. మానవతా విలువలు మృగ్యమవుపోతున్న ఈరోజుల్లో ఇటువంటి అంశాన్ని తీసుకుని అంతా సమానమే అని చెప్పే ప్రయత్నం చేశాడు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడాలంటే కులాలు, మతాలు చూడ్డం ఎంత మూర్ఖమే తెలియజేశాడు. అదేవిధంగా ప్రేమ పొందడానికి మనసులో ఫీల్ కలగాలి. అది లేకపోతే అదే ప్రేమేకాదు. తను ప్రేమించిన అమ్మాయి దూరమవుతున్నా ఏదో కోల్పోయామన్న భావన కల్గడమే నిజమైన ప్రేమ. దాన్ని తెలియజెప్పేందుకు దర్శకుడు చేసిన ప్రయత్నం అభినందనీయం. అయితే తండ్రి చనిపోయాడని తెలిసి కూడా... స్నేహితుని గురించే ఆరాటపడే సన్నివేశం ఇబ్బందిగా అనిపిస్తుంది. ఎందుకంటే చిన్నతనంలో స్నేహితునిపై ప్రేమ వేరు. పెద్దయ్యాక పరిణితి చెందుతారు. తల్లితండ్రి తర్వాత ఎవరైనా.. ఈ విషయాన్ని కాస్త జాగ్రత్తగా డీల్ చేస్తే మరింత బాగుండేది. చిత్రంలో సందర్భానుసారంగా సంభాషణలూ రాసుకున్నా సన్నివేశపరంగా మరింత జాగ్రత్తలు తీసుకోవాల్సింది.

'యమ్6'లో హాస్యం



శ్రావణి, మారుతి

మారుతి, శ్రావణి, ప్రియ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'యమ్6'. జై రామ్ వర్మ దర్శకుడు. విశ్వనాథ్ ఫిలిం ఫ్యాక్టరీ, శ్రీలక్ష్మి వెంకటాద్రి క్రియేషన్స్ బేనర్స్‌పై విశ్వనాథ్ తన్నీరు, సురేష్.ఎస్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. టీఎఫ్‌సీసీ ఛైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ ఈ చిత్రం టైలర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'హారర్ అంశాలతో పాటు యూత్ ఫుల్ ఎంటర్ టైనర్‌గా రూపొందినట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. హీరో మారుతి ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నాడు. భవిష్యత్‌లో మంచి హీరోగా ఎదిగే లక్షణాలు మెండుగా ఉన్నాయి. ట్రైలర్ కట్ చేయడంలోనే దర్శకుడి ప్రతిభ ఏంటో తెలిసింది. మ్యూజిక్ కూడా బాగుంద'ని అన్నారు.

దర్శకుడు జై రామ్ వర్మ మాట్లాడుతూ 'ఇదొక సస్పెన్స్ థ్రిలర్ చిత్రం. కడుపుబ్బా నవ్వించే కామెడీ కూడా ఉంటుంది. అంతర్లీనంగా చిన్న సందేశం కూడా ఇచ్చే ప్రయత్నం చేశాం. విజయ్ బాలాజీ ఒక పాటతో పాటు అద్భుతమైన నేపథ్య సంగీతం సమకూర్చారు. సినిమాటోగ్రఫీ కూడా బాగా కుదిరింద'ని చెప్పారు.

నామ్ హై మేరా



ఊర్వశి రౌతెల

నామ్ హై మేరా ...ఈ ట్రాక్ 2006లో వచ్చింది. అప్పట్లో మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పుడు మళ్లీ వచ్చింది. పాత గీతంలా కాకుండా కొత్తగా కొన్ని జోడించి చేసింది ఊర్వశి రౌతెల. బాలీవుడ్ కథానాయిక ఊర్వశి రౌతెల చేసిన ఈ ఆల్బమ్ ట్రైలర్‌ను శుక్రవారం సామాజిక మాధ్యమంలో పోస్టు చేశారు. ఈ ఆల్బమ్‌కు 'నామ్ హై మేరా ఫ్రమ్ స్టోరీ ఐవీ' అని నామకరణ చేశారు. ఈ గీతంలో ఆమె చేసిన నృత్యానికి ప్రశంసలు లభిస్తున్నాయి. తన కిష్టమైన ట్రాక్ అంటూ ఈ ట్రైలర్‌ను పోస్టు చేస్తూ పేర్కొంది ఊర్వశి. దుబాయ్‌లో భారీ నిర్మాణ విలువలతో తీసినట్టు తెలిపారు ఆమె. ఈ ఆల్బమ్‌లో చేసేందుకు నాలుగు నెలలు పాటు డాన్స్‌లో ట్రైనింగ్ తీసుకున్నట్టు పేర్కొన్నారు. ఈ గీతానికి బాస్కో సీజర్ కొరియోగ్రఫీ అందించారు.

ఈ క్షణమే




శ్వేత, అనురాగ్‌పై క్లాప్ కొడుతున్న బి. గోపాల్

అనురాగ్ హీరోగా పరిచయం అవుతూ రూపొందుతోన్న చిత్రం 'ఈ క్షణమే'. శ్వేత కథానాయిక. జనని క్రియేషన్స్ పతాకంపై పోకూరి లక్ష్మణా చారీ నిర్మిస్తున్నారు. సాయిదేవ రామన్ దర్శకుడు. రామానాయుడు స్టూడియోస్‌లో ప్రారంభమైన ఈ చిత్ర ముహూర్తపు షాట్‌కు బి.గోపాల్ క్లాప్ నివ్వగా, జడ్జి రామారావు కెమెరా స్విచ్చాన్ చేశారు. హీరో అనురాగ్ మాట్లాడుతూ 'కథ బాగుంది. పది రోజుల్లో చిత్రీకరణ ప్రారంభిస్తాం. లవ్, ఎంటర్‌టైన్‌మెంట్‌లో సాగే చిత్రమిది' అని పేర్కొన్నారు. సింగిల్ సిట్టింగ్‌లో ఈ కథ చేయడానికి అంగీకరించారని దర్శకుడు రామన్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా : సతీష్, పాటలు : అనంత్ శ్రీరామ్, మాటలు : హేమంత్ కార్తీక్.

నమస్తే హైదరాబాద్



పి.సి. క్రియేషన్స్ పతాకంపై మనోహర్ చిమ్మని దర్శకత్వంలో రూపొందుతున్న కమర్షియల్ సినిమా 'నమస్తే హైదరాబాద్'. ఇందులో కొత్త గాయనీగాయకులను పరిచయం చేయనున్నారు. ప్రదీప్ చంద్ర సంగీత సారథ్యంలో ప్రస్తుతం ఆడిషన్స్ జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాన్ని తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సంతప్ కుమార్‌స్వామి, మహిళా అధ్యక్షురాలు నిర్మల ఫేడర్ ప్రారంభించారు. నూతన నటీనటులతో పాటు గాయనీగాయకులకు కూడా అవకాశం కల్పిస్తూ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం విజయం సాధించాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు. మనోహర్ చిమ్మని మాట్లాడుతూ 'పూర్తి స్థాయి యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్. హైదరాబాద్ నగరం నేపథ్యంగా రూపొందుతోంది. త్వరలో సెట్స్‌పైకి వెళ్లనుంది' అని అన్నారు.



చూడదగ్గ సియాటిల్

సియాటిల్.. నార్త్ వెస్ట్ అమెరికాలో వాషింగ్టన్ రాష్ట్రానికి పారిశ్రామిక రాజధాని. అమెరికా - కెనడా సరిహద్దులో ఉంది. మేము వెళ్ళింది డిసెంబరు నెలకావడంతో అక్కడి ఉష్ణోగ్రత మైనస్ 3 డిగ్రీల వరకు అత్యల్పంగా నమోదయింది. ఈ.. వాతావరణం చాలా ఆనందం కలిగించింది. ఇక్కడ ఇండియన్స్ చాలా మంది ఉన్నారు. ఇండియన్ షాప్స్, రెస్టారెంట్లు దారిపొడవునా కనిపించాయి. నా..సియాటిల్ పర్యటనలోని మరిన్ని విశేషాలు మీకోసం.. ఈ వారం జర్నీలో..!

నా భార్య విజయలక్ష్మీ కుమారితో కలిసి సియాటిల్‌లో ఉంటోన్న మా అల్లుడి దగ్గకు వెళ్లాం. ఇద్దరికీ అమెరికా వెళ్ళడం మొదటిసారి కావడంతో మాకు అన్నీ కొత్తగానే ఉన్నాయి. ప్రధానంగా వారి జీవనశైలి పరిశీలించాం. ఎవరైనా ఎదురు పడితే పరిచయం ఉన్నా లేకపోయినా అమెరికన్లు 'హాయ్' అని ఆప్యాయంగా పలకరిస్తారు. అక్కడ మ్యాన్ పవర్ చాలా ఖరీదవడం వల్ల, ఎవరిమీదా ఆధారపడకుండా ఎవరింటి పనులు వారే చక్క బెట్టుకుంటారు. విశేషమేమంటే ఆడా, మగా భేదం లేకుండా అందరూ అన్ని పనులు చేస్తారు. యుక్త వయస్సు వచ్చాక, ఆస్తులున్నా పిల్లలు, తల్లిదండ్రులపై ఆధారపడరు. ఏదో ఒక జాబ్ చేస్తారు. మా ఇంటికి హోం సర్వీస్ ఏజెన్సీ ద్వారా ఒక ఆమె వచ్చి బాత్‌రూం, వంటగదితో పాటు అన్నీ శుభ్రం చేసింది. ఆమె చదువుకోలేదేమో?! అనుకున్నాను. అయితే, ఆమె బి.టెక్ డిగ్రీ చదవడంతోపాటు వ్యాపారం చేస్తోందట! పార్ట్‌టైమ్ హోం సర్వీస్ చేస్తున్నట్లు చెప్పింది. ఆ విషయం వినగానే ఆమెపట్ల చాలా గౌరవం కలిగింది. అయితే, అమెరికాలోనూ కార్మికులు శ్రమ దోపిడికి గురవుతున్నారు. మేము హోంసర్వీస్ ఏజెన్సీకి గంటకి 40 డాలర్లు ఇస్తే వారు ఆమెకు గంటకి 25 డాలర్లే చెల్లిస్తున్నారు. అమెరికాలో కనీసవేతనం గంటకి 13డాలర్లు. కాని, షాపింగ్ మాల్స్‌లో పని చేసే వారికి గంటకి 10 డాలర్లు లోపే చెల్లిస్తారు. అమెరికా వెళ్ళిన భారతీయుల్లో ఉద్యోగాల్లేని వారు (ఎక్కువగా గృహిణులు) ఇలాంటి చిన్న చిన్న పనులు చేస్తుంటారు.



అనుకూలమైన రోడ్లు

అక్కడ రోడ్లకు ప్రత్యేకత ఉంది. రైలు సదుపాయాలు చాలా తక్కువ. రవాణా ముఖ్యంగా సముద్రమార్గం గుండా, రోడ్ల ద్వారా జరుగుతుంది. రోడ్లపై ట్రాక్స్ అన్ని ప్రాంతాల్లోనూ కనిపిస్తాయి. ఎవరి ట్రాక్‌లో వారు వాహనాలను క్రమశిక్షణతో నడుపుతారు. కాబట్టి స్పీడ్ ఎక్కువయినా సరే, ఏక్సిడెంట్స్ చాలా తక్కువ. అయితే, మనుషులు ఈ రోడ్లపై నడవకూడదు. ఫుట్‌పాత్ పైనే నడవాలి. సిగ్నల్ చూసుకొని క్రాస్ చెయ్యాలి. వికలాంగులకి అమెరికా రోడ్లు చాలా అనుకూలంగా ఉంటాయి. వీల్ ఛైర్స్‌పై వారు ఎక్కడికయినా సరే ఎవ్వరి సాయం అవసరం లేకుండా వెళ్ళిపోయేటట్లు ఫుట్‌పాత్‌లు, రోడ్లు నిర్మించారు. ఫుట్‌పాత్‌లను రోడ్లతో ప్రతి క్రాసింగ్ వద్ద స్లోప్‌గా కలిపారు. వారు వీల్ ఛైర్‌తో సిటీ బస్‌లోకి వెళ్ళే విధంగా బస్‌స్టాప్ వద్ద బస్‌ని డౌన్ చేస్తారు. వికలాంగులకీ, సీనియర్ సిటిజన్లకి బస్సుల్లో ప్రత్యేకంగా సీట్లు, స్థలాలు కేటాయించారు. బస్ రష్‌గా ఉన్నాసరే వీరికి సీట్లు ఇచ్చేస్తూ ఇతరులు సీట్లు ఖాళీ చేసేస్తారు. చిన్న పిల్లలని బండిలో తెచ్చుకొని, బస్సులో పెట్టుకోవడానికి కూడా స్థలాలుంటాయి.

పిల్లల స్కూలింగ్-ఆట పాటలు

అక్కడ చదువుకోవడానికి, ఆడుకోవడానికి ఉండే సదుపాయాలు చూస్తే చాలా ముచ్చటేసింది. మా అల్లుడితో కలసి వెళ్ళి 'రోజ్ హిల్ మిడిల్ స్కూల్'ని సందర్శించాము. పెద్ద ప్రాంగణంలో చాలా విశాలంగా స్కూలు నిర్మించారు. ఆ స్కూల్‌లో 6 నుంచి 8 తరగతులు ఉన్నాయి. అన్ని రకాల పరికరాలతో సైన్స్ ల్యాబ్, కంప్యూటర్లు ఉన్నాయి. ఉదయం తొమ్మిది గంటలనుంచి మధ్యాహ్నం 2.45 వరకు క్లాసులు జరుగుతాయి. తర్వాత 4.30 వరకు ఫిజికల్ ట్రైనింగ్ ఉంటుంది. ఇది అందరికీ తప్పనిసరి, తర్వాత గేమ్స్. అన్ని సబ్జెక్స్‌తోపాటు మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్, డిజిటల్ ల్యాబ్, కుకింగ్, డిబేట్ & స్పీచ్ వంటి ఎంపిక చేసుకున్న సబ్జెక్ట్స్ ఆరు నెలలకొకటి చొప్పున నేర్చుకోవచ్చు. వారం వారం పరీక్షలుండవు. అన్ని సబ్జెక్స్‌లలో స్టూడెంట్ చూపే ప్రతిభ ఆధారంగా గ్రేడ్స్ ఇస్తారు. విద్యను బలవంతంగా రుద్దేసి ఆత్మహత్యలకి ప్రేరేపించే చర్యలు అక్కడ ఏమూలనా కనిపించలేదు. ప్రతి స్టూడెంట్‌తో స్కూల్ కౌన్సిలర్ తరచుగా వ్యక్తిగతంగా ఇంటరాక్ట్ అయి, వారి అభిరుచులు, ఆకాంక్షలు, యోగ్యతలకి తగిన గైడెన్స్ ఇచ్చి వారి ఎదుగుదలకి తోడ్పడతారు. ఇది పబ్లిక్ స్కూల్. ఇక్కడ అడ్మిషన్, ట్యూషన్ ఫీజులు లేవు. అన్నీ ఉచితమే. మధ్యాహ్నం సబ్సిడీ రేట్లలో భోజన సదుపాయం కూడా ఉంది. పేద విద్యార్థులకి సామాజికసేవా విరాళాలతో ఉచితంగా మధ్యాహ్న భోజనం పెడతారు. అంతేకాదు, ఇక్కడ ప్రైవేటు స్కూల్స్ కన్నా ప్రజలు పబ్లిక్ స్కూళ్ళకి ప్రాధాన్యతనిస్తారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నివాసం ఉండే పిల్లలకి తప్పనిసరిగా సీట్ ఇవ్వాలి. ఇతర ప్రాంతాల్లోని స్కూళ్ళలో అయితే మెరిట్ ఆధారంగా సీట్ కేటాయిస్తారు. మేం వెళ్లిన స్కూల్‌లో అనేక దేశాలకు చెందిన వివిధరకాల జాతులు, మతాల విద్యార్థులు ఉన్నారు. వివిధ మతాలకు చెందిన పండగలు ఈ స్కూల్‌లో జరుపుతారట! ఈ స్కూల్‌లో ఒక్కొక్క స్టూడెంట్ కి ప్రభుత్వం ఏడాదికి 10,760 డాలర్లు ఖర్చు చేస్తుంది. పబ్లిక్ పార్కులలో ఆడుకోవడానికి మైదానాలను తయారు చేస్తారు. వీటిలో నగరంలోని ముందుగా బుక్ చేసుకున్న టీమ్ ఉచితంగా ఆడుకోవచ్చు. జిల్లా మొత్తంగా పెద్ద పెద్ద లైబ్రరీలున్నాయి. ఇవన్నీ ఫీజు లేకుండానే.



వాషింగ్టన్ కన్వెన్షన్ సెంటర్

పోరాట చరిత్ర

ప్రపంచ ఆర్థికవేదిక (డబ్ల్యూ.ఇ.యఫ్) మంత్రుల సమావేశం 1999లో సియాటిల్‌లోని 'వాషింగ్టన్ కన్వెన్షన్ సెంటర్'లో జరిగింది. వాణిజ్య సంప్రదింపుల ద్వారా ప్రపంచీకరణ విధానాలు 21వ శతాబ్దంలో అమలుచేసే లక్ష్యంతో ఈ సమావేశాలు జరిగాయి. ప్రపంచ కార్మికవర్గం దీన్ని తీవ్రంగా నిరసించింది. ఈ సమావేశాలు ప్రారంభానికి ముందు నుంచి కన్వెన్షన్ సెంటర్ చుట్టు పక్కల డౌన్‌టౌన్ అంతటా 40 వేలమంది నిరసనకార్లు దాదాపు వారం రోజులపాటు సమరశీలంగా నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రెండవరోజున ఎమర్జెన్సీ విధించినప్పటికీ నిరసనకార్లు వెనక్కి తగ్గలేదు. ఇంత పెద్ద నిరసన సియాటిల్ నగర చరిత్రలో ఇంకెన్నడూ జరగలేదు. ఈ నిరసన ఆధారంగా 'బేటిల్ ఆఫ్ సియాటిల్' అనే డాక్యుమెంటరీ సినిమా తీశారు. ఈ కన్వెన్షన్ సెంటర్‌ని, నిరసన జరిగిన ప్రదేశాన్ని చూశాము. అనేక దేశాల కార్మికులు కదంతొక్కి జరిపిన నిరసన ప్రదేశాన్ని చూడడం సియాటిల్ పర్యటనలో మాకు తృప్తినిచ్చింది.

మేం చూసిన ప్రదేశాలు

అక్కడ చూడవలసిన స్పేస్ నీడిల్, చిహులి గ్లాస్ గార్డెన్, అర్గోసీ క్రూయిస్, సియాటిల్ అక్వేరియం, స్నో క్వామి వాటర్ ఫాల్స్, బీచ్, ఉడ్ ల్యాండ్ పార్క్ జూ తదితర వింతలన్నీ చూసి ఎంతో ఆనందించాం. అక్కడికి దగ్గరలోని స్కీయింగ్ సెంటర్ – స్టీఫెన్స్ పాస్, ఒలింపియా, పోర్ట్‌లాండ్ నగరాలు, మౌంట్ హెలెన్ మంచు పర్వతం చూశాం. స్టీఫెన్స్ పాస్ వద్ద పిల్లలు, యువతీ యువకులు కేరింతలు కొడుతూ స్కీయింగ్ ఆటలాడుతున్నారు. చిన్న, చిన్న పిల్లలకి కూడా స్కీయింగ్ నేర్పించడం ప్రత్యేక ఆకర్షణ. లీవెన్ వర్త్, ఉడెన్ విల్లి గ్రామాల్లో క్రిస్మస్ సంబరాలు తిలకించాం. ఆహ్లాదకర వాతావరణంలో జరిగిన మా సియాటిల్ పర్యటన మా జీవితంలో మరపురాని అనుభవం.



- బి బి గణేష్, ఎల్ఐసి ఉద్యోగి, విశాఖపట్నం
ఫోన్: 9440133400



పీతల దీవి క్రిస్మస్ ఐలాండ్

ఆస్ట్రేలియాలోని ఓ దీవి పేరు క్రిస్మస్ ఐలాండ్. సీజన్ వచ్చిందంటే ఎర్రని పీతలతో దీవంతా నిండిపోతుంది. అదే ఇక్కడి ప్రత్యేకత. కోట్లాదిగా కనిపించే ఈ పీతలు అక్కడి జనాభాని డామినేట్ చేస్తాయి. ఎందుకంటే, ఈ దీవిలో నివసించేది దాదాపుగా రెండు వేల మంది ప్రజలు మాత్రమే. ఆ పీతలు ఎక్కడి నుంచి వచ్చాయో, వాటి వెనకున్న ఆసక్తికరమైన కథేంటో చూద్దాం. క్రిస్మస్ ఐడాండ్‌లో నివాస ప్రాంతాలకంటే, అడవి విస్తీర్ణం చాలా ఎక్కువ. అందులో లక్షల్లో ఎర్ర పీతలుంటాయి. ఇవి మిగిలిన జాతి పీతల్లా నీటిలో కాకుండా నేల మీద బతికేవన్నమాట. తడిగా ఉండే మెత్తని మట్టిలో జీవిస్తాయి. ఈ అడవిలోని పండుటాకుల్ని తింటూ బతుకుతాయి. ఇక్కడివి 40, 50 లక్షల వరకూ ఉంటాయని అంచనా. అంటే, ఏ చెట్టున, ఏ గట్టున చూసినా ఇవే అన్నమాట. అయితే, అక్టోబరు, నవంబరు నెలలు రాగానే ఇక్కడ ఓ చిత్రం చోటు చేసుకుంటుంది. లక్షలాది పెద్ద పెద్ద ఎర్ర పీతలు అడవుల్లోంచి కొండలు, కోనలు దాటుకుంటూ సముద్రంలోకి వలసకు బయలుదేరతాయి. ఆ సమయంలో ఏ రోడ్లపై చూసినా, ఇళ్ల వాకిళ్లలోనైనా.. చకచకా నడిచే పీతలే కనిపిస్తాయి. వాటికి ఎలాంటి హానీ చేయకుండా స్థానికులు చాలా జాగ్రత్తలే తీసుకుంటారు. రోడ్లు దాటేప్పుడు కొన్ని వాహనాల కింద పడి చనిపోతున్నాయని గుర్తించి వీటి కోసం ఏకంగా వంతెనలూ కట్టించారు. రోడ్డు కింద సొరంగ మార్గాల్లాంటివీ ఏర్పాటు చేశారు. ఇంకొన్ని రోడ్లును ఈ సీజన్‌లో మొత్తంగా మూసేస్తారు. అవి సముద్రంలోకెళ్లి గుడ్లు పెడతాయి. ఒక్కో పీతా లక్షకుపైగా గుడ్లు పెడుతుంది. ఆ గుడ్లునుంచి వచ్చే పిల్లలను షార్కులు వేటాడి తింటాయి. వాటి బారి నుంచి రక్షించుకోవడానికి ఈ పిల్లలన్నీ మళ్లీ దీవి మీదికి తీసుకొస్తాయి పెద్ద పీతలు. అడుగు వెయ్యడానికి కూడా ఖాళీలేకుండా చిన్న చిన్న పీత పిల్లలు ఈ దీవిలో రోడ్లెక్కెస్తాయి. ఈ చిత్రం ఈ మధ్య మళ్లీ ఇక్కడ కనిపించింది. మొత్తం రోడ్లను కమ్మేశాయి. ఇళ్ల వాకిళ్లలోకీ పరుచుకుపోయాయి. ఎర్ర తివాచీలు పరిచారా అన్నట్టు కనువిందు చేశాయి. ఇలాంటి ఆశ్చర్యకరమైన దృశ్యాన్ని చూసేందుకు చాలా మంది పర్యాటకులు ఈ దీవికి వస్తూ ఉంటారు. ఇది మామూలు దీవే అయినా సీజన్‌లో మాత్రం ఓ పెద్ద పర్యాటక ప్రాంతంగా మారిపోతుందన్న మాట! ★



'జర్నీ'కి ఆహ్వానం

మన జీవితంలో కుటుంబ సమేతంగానో, స్నేహితులతోనో ఎన్నో ప్రయాణాలు చేస్తూ ఉంటాం. ఆ అనుభవాలు, విశేషాలు మాతో పంచుకునేందుకు 'జర్నీ' మీకు ఆహ్వానం పలుకుతోంది. మీ పర్యాటక అనుభూతులను మాకు రాసి పంపండి. లేదా మెయిల్ చేయొచ్చు. ఫొటోలు జత చేయడం మర్చిపోవద్దు.



మా చిరునామా
జర్నీ, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



చిన్నారి


పొడుపు కథ

ఎగరలేని పక్షులివి,
ఆడపక్షి గుడ్డు పెడితే,
మగపక్షి పొదుగుతుంది,
దక్షిణ ధ్రువంలో ఆవాసం?

జవాబు : పెంగ్విన్

జోక్ :

టీచర్ : ఒరేయ్ బంటీ! ఈ ప్రశ్నకు సమాధానం చెప్పు! మనిషి ఉన్నత శిఖరాలకు చేరాలంటే ఏం కావాలిరా?
బంటి : నాకు తెలుసు సార్! ఆక్సిజన్ సిలెండర్ కావాలి..!



నీడ కనుక్కోండి!

పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని జంతువులు.. వాటి నీడలు ఉన్నాయి. అందులో ఏ నీడ దేనితో కనిపెట్టండి!

చేపలు నిద్రపోతాయా?!



పిల్లలూ..! మీరు చేపలను చాలాసార్లు చూసే ఉంటారు. కానీ వాటిని దగ్గరగా ఎప్పుడైనా గమనించారా? వాటికి కనురెప్పలు ఉండవు. కాబట్టి అవి ఎప్పుడు చూసినా కళ్లు తెరిచే ఉన్నట్టు కనిపిస్తాయి. అయితే అవి నిద్రపోవా? అనేగా మీ సందేహం? అవి కూడా.. మనలాగే.. ఎంతో కొంతసేపు నిద్రపోతాయి. కొన్ని చేపలు పగటివేళ నిద్రిస్తే, మరికొన్ని రాత్రివేళల్లో నిద్రిస్తాయి. నిద్ర వచ్చిన వెంటనే సముద్రంలో ఉండే చేపలు నీటిలోతుల్లో ఉండే గుహల్లోకి, పగడపు లోయల్లోకి వెళ్లి బంకమన్నులాంటి పదార్థాన్ని పూతగా తమ దేహాలపై ఏర్పాటు చేసుకుంటాయి. అలా ఎందుకు చేస్తాయో తెలుసా? తమ ఉనికిని ఇతరప్రాణులు కనిపెట్టకుండా ఉండేందుకు. అలా అవి నిద్రపోతున్నా వాటి ప్రాణానికి ప్రమాదం లేకుండా చాలా జాగ్రత్తలు తీసుకుంటాయి. మంచినీటిలోని చేపలు నిద్రించేటప్పుడు వాటి జీవప్రక్రియలు కొంతమేర నెమ్మదించడంతో అవి అంత చురుగ్గా ఉండవు. అంతేకానీ అవి తమ స్పృహను పూర్తిగా కోల్పోవు. ఇది ఎవరు చెప్పారు అనుకుంటున్నారా? కొందరు నిద్రించే చేపలపై పరిశోధనల చేశారు. వాటిలో తేలిందేమంటే అవి గాఢనిద్రలోకి చేరుకున్నాగానీ.. నెమ్మదిగా నీటిలో ఈదుతూనే ఉంటాయి. ఇదర్రా.. చేపల నిద్ర కథ ★





నా ప్రయాణం

ఆమధ్య విజయవాడలోని పి.డబ్ల్యు.డి గ్రౌండ్‌లో పూల ఎగ్జిబిషన్ పెట్టారు. ఆ ఎగ్జిబిషన్‌ను చూడటం కోసం నేను, నా స్నేహితులు వెళ్లాం. దారిలో మాకు గోడలపై బొమ్మలు చాలానే కనిపించాయి. అంతేకాదు నన్ను చాలా ఆశ్చర్యంలో ముంచెత్తిన విషయం ఏమిటంటే.. మనం పనికిరాని ఇనుప సామానులను బయట పడేస్తాం కదా! వాటితో బొమ్మలు చేశారు. అవి చూడటానికి చాలా బాగున్నాయి. అలా నగరంలో చాలా చోట్లు చూసుకుంటూ.. పి.డబ్ల్యు.డి గ్రౌండ్స్‌కు చేరాం. అక్కడ ఎంట్రీ ఫీజు పది రూపాయలు. పది రూపాయలు కట్టి లోపలికి వెళ్లాం. లోపల ఒక బృందావనంలా ఉంది. రంగురంగుల పూలు. పూలతోనే ఆవు, దూడలను తయారుచేసి పెట్టారు. అవి చూడటానికి భలే ఉన్నాయి. ఒక్కో స్టాల్ తిరిగి చూస్తుంటే కొత్తకొత్త పువ్వులు. ఇంతకుముందు నేను ఎప్పుడూ వాటిని చూడలేదు. అక్కడ నాకు ఆశ్చర్యం కలిగించిన ఒక విషయం ఉంది. అదేంటో తెలుసా? ఒక అడుగు సైజు మాత్రమే ఉన్న ఒక చిన్న చెట్టుకు కాయలు కాసాయి. నాకయితే అది చాలా వింతగా అనిపించింది. నేను ఆ ఎగ్జిబిషన్ చూసినప్పటి నుంచి అక్కడి పూల గురించే ఆలోచిస్తున్నా. అన్నింటిలోకి నాకు చాక్లెట్ ఫౌంటెన్ బాగా నచ్చింది. ఈ ప్రయాణం నాకు కొత్త అనుభవాన్ని ఇచ్చింది. మొక్కల గురించి ముఖ్యంగా రోజా పూల గురించి చాలా విషయాలు తెలుసుకున్నా.



సి. చక్రవర్ధన్ రెడ్డి
7వ తరగతి
అరవింద హై స్కూల్, కుంచనపల్లి

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com

చెమటోడ్చాల్సిందే..

సుదీర్ఘ సఫారీ పర్యటనలో టీమిండియా చివరి టీ20 మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో శనివారం తలపడనుంది. మూడు టీ20ల సిరీస్‌లో ఇరుజట్లు చెరో మ్యాచ్ గెలిచి సమానఉజ్జీలుగా నిలిచాయి. నేడు జరిగే ఆఖరి మ్యాచ్ విజేతకు టీ20 సిరీస్ దక్కనుంది.



- భారత్-దక్షిణాఫ్రికా జట్ల మధ్య చివరి టీ20
- రాత్రి 9:30 గం॥ల నుంచి

కేప్‌టౌన్: టీ20 సిరీస్‌ను నిర్ణయించే చివరి మ్యాచ్ శనివారం జరగనుంది. ఇప్పటికే ఇరుజట్లు ఒక్కో విజయాన్ని నమోదు చేసుకొని ఉండడంతో చివరి మ్యాచ్‌లో హోరా హోరీ పోరు తప్పదు. దీంతో టీమిండియాకు ఇక చావో రేవో తేల్చుకునే సమయం ఆసన్నమైంది. రెండో టీ20లో హెన్రిక్ క్లాసెన్, జేపీ డుమినిలు ఆతిథ్య జట్టుకు విజయన్నందించి సిరీస్‌ను రసవత్తరంగా మార్చేశారు. తాము ప్రత్యర్థి జట్టు నుంచి ఇలాంటి పోటీనే కోరుకుంటున్నామని కోహ్లీ సైతం అన్నాడు. ఈ నేపథ్యంలో చివరి పోరులో రెండు జట్లు నువ్వా... నేనా... అన్నట్లు తలపడే అవకాశాలున్నాయి. మొత్తంగా అభిమానులకు పొటి క్రికెట్‌లో చివరి మ్యాచ్‌లో పరుగుల వరద పారే సూచనలు కనిపిస్తున్నాయి. మ్యాచ్ గెలిస్తే కోహ్లీసేన దక్షిణాఫ్రికా గడ్డపై రెండు సిరీస్ గెలిచిన జట్టుగా చరిత్ర సృష్టించడం ఖాయం.

స్పిన్నర్లకంటే ఆల్‌రౌండర్లు బెస్ట్...

వన్డేలు వేరు... టీ20లు వేరు... పొట్టి ఫార్మట్‌లో ఒక్క ఓవర్ చాలు మ్యాచ్‌ను మలుపు తిప్పడానికి. పేసర్లను ఎదుర్కోవడం కంటే... స్పిన్నర్లపై ఆధిపత్యం చెలాయిస్తే పరుగులు దానంతట అవే వస్తాయనడానికి రెండో టీ20యే ఉదాహరణ. చాహల్ వేసిన నాలుగు ఓవర్లలో 64 పరుగులు సమర్పించుకున్నాడు. అందువల్ల నిర్ణయాత్మకమైన మూడో టీ20లో స్పిన్నర్లకంటే ఆల్‌రౌండర్లను తీసుకుంటే మంచిది. టీమిండియా టీ20ల్లో ఓపెనర్ రోహిత్ శర్మను మినహాయిస్తే టాప్ ఆర్డర్, మిడిలార్డర్ బాగానే ఉన్నట్లు కనబడుతోంది. ధావన్, కోహ్లీ, మనీశ్ పాండే, ధోనీ, రైనా చక్కని ఫామ్ కనబరుస్తున్నారు. రెండో టీ20లో 170 పరుగులు చేస్తే ఎక్కువే అనుకున్న సమయంలో పాండే, ధోనీ వీరోచితంగా ఆడి 189 పరుగుల లక్ష్యం నిర్దేశించారు. అయితే ఆ మ్యాచ్‌లో క్లాసెన్ రాణించడంతో మ్యాచ్ చేజారింది. గాయం కారణంగా రెండో మ్యాచ్ ఆడని బుమ్రా మూడో టీ20కి ఆడేది అనుమానమే. అతడు ఫిట్‌గా ఉంటే మాత్రం జయదేవ్ జట్టు నుంచి తప్పుకోవాల్సి వస్తుంది. శార్దూల్ ఠాకూర్ సెంచూరియన్‌లో నాలుగు ఓవర్లలో 31 పరుగులిచ్చి ఒక వికెట్ సాధించాడు. ఇక భువనేశ్వర్ సంగతి చెప్పనక్కర్లేదు. మూడో పేసర్‌గా హార్దిక్ పాండ్యను భావిస్తే అక్షర్ పటేల్‌కు అవకాశం రాకపోవచ్చు.

జీరో కాస్తా హీరో అయ్యాడు...

భారత స్పిన్నర్లను ఎదుర్కోవడంలో ఇబ్బందులు పడ్డ సఫారీ జట్టుకు క్లాసెన్ ఊపిరిపోశాడు. చాహల్ వేసిన నాలుగు ఓవర్లలో 64 పరుగులు సాధించడంతో ఆ జట్టు వికెట్ కీపర్ క్లాసెన్ ఒక్కసారిగా హీరోగా మారిపోయాడు. దీంతో మూడో టీ20కి దక్షిణాఫ్రికా జట్టు ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది. జేపీ డుమిని, హెన్రిచ్ క్లాసెన్ దూకుడుగా ఆడుతున్నారు. చాహల్ బౌలింగ్‌లో మిగతా వారు ఇబ్బంది పడ్డా, వీరిద్దరూ చక్కగా ఆడి మ్యాచ్‌ను గెలిపించారు. ఓపెనర్ జేజే స్మట్స్, డేవిడ్ మిల్లర్ ఆశించిన మేరకు రాణించలేదు. సీనియర్ ఆటగాడు డేవిడ్ మిల్లర్ జట్టు అండగా నిలిచే అవకాశాలున్నాయి. సీనియర్ల గైర్హాజరీలో రెండో టీ20లో సఫారీజట్టు అద్భుత విజయాన్నందుకుంది. దీంతో నిర్ణయాత్మక మూడో టీ20లో టీమిండియా బౌలింగ్ చాలా కీలకంగా మారనుంది. ఇక బౌలింగ్ పరంగానూ ఆతిథ్య జట్టు బాగానే ఉంది.



భారతజట్టు : విరాట్ కోహ్లీ (సారథి), శిఖర్ ధావన్, రోహిత్ శర్మ, సురేశ్ రైనా, మనీశ్ పాండే, దినేశ్ కార్తీక్, ఎంఎస్ ధోనీ, హార్దిక్ పాండ్య, చాహల్, కుల్‌దీప్ యాదవ్, అక్షర్ పటేల్, భువనేశ్వర్ కుమార్, జస్ప్రీత్ కుమార్, జయదేవ్ ఉనద్కట్, శార్దూల్ ఠాకూర్.

దక్షిణాఫ్రికా జట్టు : జేపీ డుమిని (సారథి), బెహార్డీన్, జూనియర్ డాలా, రీజా హెండ్రిక్స్, క్రిస్టియాన్, హెన్రిచ్ క్లాసెన్, డేవిడ్ మిల్లర్, క్రిస్ మోరిస్, డేన్ ప్యాటర్‌సన్, ఆరోన్ ఫాంగిసో, ఫెలుక్‌వాయో, షంషి, జేజే స్మట్స్

మహిళల చివరి పోరు

- సఫారీలతో ఐదో టీ20



మహిళాజట్టు సారథి హర్మన్‌ప్రీత్ కౌర్

కేప్‌టౌన్ : భారత మహిళాజట్టు కూడా సఫారీ పర్యటనలో చివరి మ్యాచ్ శనివారం ఆడనుంది. ఐదు టీ20 సిరీస్‌లో ఇప్పటికే 2-1 ఆధిక్యతలో నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని మనజట్టు సఫారీలతో నేడు తాడోపేడో తేల్చుకోనుంది. సిరీస్‌ను నిర్ణయించే ఈ మ్యాచ్‌లో ఒకవేళ టీమిండియా ఓడినా సంయుక్త విజేతగా నిలిచే అవకాశముంది. పటిష్టమైన భారతజట్టును ఎదుర్కోవడం సఫారీలకు కష్టమే అయినప్పటికీ మూడో టీ20 గెలిచి పైచేయి సాధించింది. నాల్గో మ్యాచ్‌లో సఫారీలు 16 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 130 పరుగులు సాధించిన క్రమంలో వర్షం కారణంగా ఆ మ్యాచ్ రద్దు అయ్యింది. దీంతో నిర్ణయాత్మకమైన ఈ మ్యాచ్‌ను చేజార్చుకోకూడదని ఉద్దేశ్యంతో సఫారీ మహిళాజట్టు సైతం పోరాడే అవకాశముంది. టీమిండియా సారథి హర్మన్ ప్రీత్‌కౌర్, ఓపెనర్, సీనియర్ బ్యాట్స్‌ఉమన్ మిథాలీరాజ్, మంధన బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణిస్తు న్నారు. నేటి చివరి మ్యాచ్ కూడా గెలిచి సఫారీ పర్యట నను దిగ్విజయంగా ముగించాలని మహిళాజట్టు భావిస్తోంది.

మహిళాజట్టు : మిథాలీ రాజ్, స్మృతి మందన, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రోడ్రిగ్వెస్, వేద కృష్ణమూర్తి, అనూజ పాటిల్, శిఖా పాండే, తానియా భాటియా (కీపర్), పూజా వస్త్రాకర్, పూనమ్ యాదవ్, రాజేశ్వరి గైక్వాడ్, రాధా యాదవ్, దీప్తి శర్మ, రుమేలి ధర్, నుజ్హత్ పర్వీన్.

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యం

రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - కర్నూలు స్పోర్ట్స్

అభివృద్ధితో పాటు ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ తమ లక్ష్యమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ తెలిపారు. శుక్రవారం కర్నూలు స్పోర్ట్స్ అవుట్‌డోర్ స్టేడియంలో ధూల్ రాష్ట్రస్థాయి క్రీడాపోటీలను ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. తాను ఊటిలో చదువుతున్న రోజుల్లో చదువులో కంటే క్రీడలకు అధిక మార్కులు వచ్చేవని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు పెద్దపీట వేస్తోందన్నారు. కర్నూలు ఎమ్మెల్యే ఎస్వీ.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ... రాజకీయ నాయకుల కంటే క్రీడాకారులకు అంతర్జాతీయ గుర్తింపు లభిస్తుందన్నారు. నగరంలో రూ.10 లక్షలతో శిల్పారామం ఏర్పాటు చేస్తే కర్నూలు నగర ప్రజలు రుణపడి ఉంటారని తెలిపారు. ఎమ్మెల్సీ రాష్ట్ర ఒలంపిక్ సంఘం ఛైర్మన్ కెఇ.ప్రభాకర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. తిరుపతిలో జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని కర్నూలులో నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. అంతకుముందు జరిగిన కార్యక్రమంలో అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రీడాకారులు మార్చ్‌ఫాస్టు చేయగా గౌరవ వందనం స్వీకరించారు. జెసి ప్రసన్న వెంకటేష్, క్రీడల అధికారి జగన్నాథరెడ్డి, ఒలంపిక్ సంఘం అధ్యక్షులు విజయకుమార్, కార్యదర్శులు ఆంజనేయులు, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ శమంతకమణి, కెడిసిసి ఛైర్మన్ మల్లికార్జునరెడ్డి, జిల్లా గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి భూమా అఖిల ప్రియ

వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు ఇవాంక?



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణకొరియా) : ఆదివారంతో ముగియనున్న వింటర్ ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు అమెరికా అధ్యక్షుని కుమార్తె ఇవాంక హాజరుకానున్నారు. ఈ విషయాన్ని శుక్రవారం వైట్‌హౌస్ అడ్వయిజర్ అధికారి తెలియజేశారు. ఆమె ముగింపు క్రీడలకు హాజరుకానున్నండడంతో దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్-జె-ఇన్ ఆమెకు ఘన స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆమె ఈ పర్యటనలో భాగంగా అమెరికా అథ్లెట్లతో కొంతసేపు మాట్లాడనున్నారు.

చంద్రబాబుది ద్వంద్వ వైఖరి

- జైలుకి వెళ్లాల్సింది ఎవరో ఆయనే చెప్పాలి
- మీట్ ది ప్రెస్‌లో బిజెపి ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రానికి ప్రత్యేక హోదా, ప్యాకేజి అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు వైఖరిని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. తమపై ఎంతో విశ్వాసం ఉందంటూ గతంలో సిఎం చెప్పిన మాటలు ఇప్పుడేమయ్యాయని ప్రశ్నించారు. గత మూడేళ్ళలో హోదా అంశంపై అనేక పర్యాయాలు వివిధ వేదికలపై మాట్లాడారని, ఈ వార్తలకు సంబంధించిన క్లిప్పింగ్‌లను ప్రదర్శించారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హోదా అంటే జైలుకేనని సిఎం అన్నారని, ఇప్పుడు జైలుకు ఎవరు జైలు కెళ్లాలో ఆయనే చెప్పాలని అన్నారు. 'హోదాతో ఒరిగేదేమీ లేదు, రాకపోతే రూ.3వేల కోట్లే నష్టం' అని చెప్పారని గుర్తు చేశారు. ప్యాకేజికి చట్టబద్ధత కల్పించినందుకు ప్రధాని మోడీ, జైట్లీలకు ధన్యవాదాలు చెబుతూ అసెంబ్లీలో తీర్మానం చేసిన విషయాన్నీ గుర్తు చేశారు. ఆ మాటలు ఇప్పుడు ఏమయ్యాయన్నారు. ఆయన చేస్తున్న రెండు రకాల వాదనల్లో ఏది వాస్తవమని ప్రశ్నించారు. గతంలో ప్రతిపక్షాల ఆందోళనల విషయంలో చట్టం తన పనితాను చేసుకుపోతుందని చెప్పి, ఇటీవల బంద్‌లో ఎలా పాల్గొన్నారని ప్రశ్నించారు. విభజన సమయంలో తెలంగాణకు అనుకూలంగా లేఖ రాసి, ఆంధ్రాకి వచ్చి విభజనలో సమన్యాయం చేయలేదంటూ డబుల్ గేమ్ ఆడారని విమర్శించారు. విభజన సమయంలో రాష్ట్రానికి కావాల్సిన వాటి గురించి అడిగిందెవరని ప్రశ్నించారు. తెలంగాణ టిడిపి ఎంపీలు పోలవరం వద్దని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడిది ధర్మయుద్ధమని వ్యాఖ్యానించారు. హోదాకు సమానమైన ప్యాకేజిలో భాగంగా రాష్ట్రానికి ఇవ్వాల్సిన నిధులు అంచనా వేస్తున్నారని, ఇవి రూ.16 వేల కోట్ల నుంచి 18 వేల కోట్లు వరకూ ఉండే అవకాశం ఉందన్నారు. ఈ ప్రక్రియ కొలిక్కి వచ్చిన అనంతరం నిధులు విడుదల చేస్తారని చెప్పారు. పోలవరంతో ఒక్క సీజన్‌లో 50 వేల కోట్ల విలువపైన పంట పండుతోందని, ఈ ప్రాజెక్టుకు చిక్కులు తొలగించింది కేవలం బిజెపి పార్టీయేనని తెలిపారు. కియో మోటార్స్ రాష్ట్రానికి రావడానికి కారణం మేకిన్ ఇండియాలో ప్రధాని దక్షిణ కొరియా వెళ్ళినప్పుడు జరిగిన ఆరు ఒప్పందాలు ఇదీ ఒకటన్నారు.

రేపటి నుండి జాతీయ స్థాయి బీచ్ కబడ్డీ పోటీలు



ప్రజాశక్తి - బాపట్ల (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా బాపట్ల మండలం సూర్యలంక బీచ్‌లో ఆదివారం నుండి చంద్రబాబు 10వ జాతీయ స్థాయిబీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు వాల్ పోస్టర్‌ను వేగేశన ఫౌండేషన్ చైర్మన్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 25వ తేదీ నుండి 28వ తేదీ వరకూ స్త్రీ, పురుషుల విభాగాల్లో పోటీలను డిప్యూటీ సిఎం కెఇ కృష్ణమూర్తి ప్రారంభిస్తారని చెప్పారు. రోజూ సాయంత్రం నాలుగు గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పోటీలు ఉంటాయని, దేశ వ్యాప్తంగా 25 రాష్ట్రాల నుండి 50 జట్లు పాల్గొంటాయని వివరించారు. మొదటి బహుమతి రూ.లక్ష, రెండో బహుమతి రూ.50 వేలు, మూడో బహుమతి రూ.25 వేలు ఇస్తామని ప్రకటించారు. ఇదిలా ఉండగా పోటీలు మంగళగిరి మండలం పెదవడ్లపూడలో నిర్వహించాల్సి ఉన్నా వేదికను కొన్నికారణాల వల్ల సూర్యలంకకు మార్చారు.

ఓటుకు నోటు కేసులో కీలక మలుపు

అప్రూవర్ గా మారుతా :సుప్రీంకు మత్తయ్య లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్

ఓటుకు నోటు కేసులో అప్రూవర్‌గా మారుతున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఎ-4 జెరూసలేం మత్తయ్య లేఖ రాశారు. అప్రూవం గా మారుతున్నట్టు సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. ఓటుకు నోటు కేసులో తనకు అసలు సంబంధం లేదని, తనను అటు టిడిపి, ఇటు టిఆర్ఎస్ ప్రభుత్వాలు వాడుకోవాలని చూశాయన్నారు. తాను స్టీఫెన్సన్‌ని కలిసింది క్రిస్టియన్ సమస్యల మీదనేనన్నారు. అతనితో ఏ ఇతర అంశాలూ చర్చించలేదని పేర్కొన్నారు. తనను ఉపయోగించి చంద్రబాబును ఇరికించాలని చూశారన్నారు. తనకు కెటిఆర్, ఆయన గన్‌మ్యాన్ ఫోన్ చేయడంతో ఆయన్ని ఇరికించేందుకు ఎపి ప్రభుత్వం వాడుకోవాలని చూసిందన్నారు. హైకోర్టులో కేసు ఉన్నప్పుడు ఎపి ప్రభుత్వం తనకు సహకరించిందన్నారు. సుప్రీంకోర్టు కేసు విషయంలో తనకు ఎవరూ సమాచారం ఇవ్వడం లేదన్నారు. తనకు తెలిసిన విషయం మొత్తం కోర్టుకు చెబుతానని పేర్కొన్నారు.

హైకోర్టు





మరికొన్ని నమూనాలు

- హైకోర్టు, ఐటీ టవర్‌లకు సిద్ధం
- పరిశీలించిన చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర రాజధాని అమరావతిలో నిర్మించనున్న కోర్టు, ఐటి టవర్ భవనాల డిజైన్లను రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిందని పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ప్రజాభిప్రాయ సేకరనకు ఆన్‌లైన్‌లో అత్యధికులు ఎంపిక చేసిన డిజైన్లకు టెండర్లు పిలిచి నిర్మాణం చేపట్టాలని సిఆర్ డిఎ అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి తెలిపారు. సిఎం అధ్యక్షతన సిఆర్‌డిఎ సమావేశం నిర్వహించామన్నారు. ఈ సమావేశంలో సిటి కోర్టు నిర్మాణానికి 12 డిజైన్లు, ఐటి టవర్‌కు 19 డిజైన్లు రూపొందించారన్నారు. వీటిని ఆన్‌లైన్‌లో ఉంచామన్నారు. అత్యధికులు ఎంపిక చేసిన డిజైన్లను సిఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు.ఆయన ఆమోదించిన వెంటనే టెండర్లు పిలిచి నిర్మాణాలు చేపడతామని మంత్రి తెలిపారు.

రూ.372 కోట్లతో వెయ్యి అపార్టుమెంట్లు

అమరావతి రాజధాని పరిధిలో వేగవంతంగా గృహనిర్మాణాలు ప్రారంభం కావడానికి ప్రభుత్వమే వెయ్యి అపార్టుమెంట్లను సొంతంగా నిర్మించనున్నట్లు మంత్రి తెలిపారు. నిర్మాణం పూర్తికాగానే ప్రజలకు వేలం పద్ధతిలో విక్రయిస్తామన్నారు. వీటికి సిఎం అనుమతిచ్చారన్నారు. త్వరలోనే నిర్మాణాలు చేపడతామన్నారు.విజయవాడలో ఉన్న కెనాల్స్ పక్కన చేపట్టిన గ్రీనరీని రెండు నెలల్లో పూర్తి చేస్తామన్నారు.110 మున్సిపాల్టీల్లో ఏర్పాటు చేయనున్న కమాండ్ కంట్రోల్ సెంటర్లను సచివాలయంలోని సిఎంవోలో ఉన్న ఆర్టీజీ సెంటర్ కమాండ్ కంట్రోల్‌తో అనుసంధానం చేస్తామన్నారు.





ఐటి భవనాలు

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68